

STAY UPDATED IN REAL-TIME WITH OUR WHATSAPP CHANNEL

GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/53323

# సమయజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం

తెలుగు దిన పత్రిక

CELEBRATING 12TH YEAR ANNIVERSARY

సంపుటి : 12 సంచిక : 222 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 శనివారం 22 నవంబర్ 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్




# శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్రపతి

## ముర్ముకు స్వాగతం పలికి దర్శనం కల్పించిన టీటీడి



**తిరుమల,నవంబర్21(సమయజ్యోతి):**

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. గురువారం రాత్రి తిరుమలకు చేరుకున్న రాష్ట్రపతి శుక్రవారం ఉదయమే దర్శనం చేసుకున్నా ఆలయ మహాద్వారం వద్ద ఆమెకు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అర్చకులు ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. దర్శనానంతరం అర్చకులు ఆమెకు వేదాశీర్వచనాలిచ్చి తీర్థప్రసాదాలను అందజేశారు. రాష్ట్రపతికి స్వామివారి చిత్రపటాన్ని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు అందించారు. అనంతరం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆలయం నుంచి పద్మావతి అతిథి గృహానికి బయలుదేరారు. దారి మధ్యలో రాంభగీచ వసతిగృహం వద్ద వాహనం దిగి అక్కడి భక్తులతో మాట్లాడారు. వారికి చాక్లెట్లు కూడా పంచారు. రాష్ట్రపతి రాకతో తిరుమలలో భారీగా భద్రత కల్పించారు. ఆమెపర్యటించిన ప్రాంతాల్లో గట్టి నిఘా పెట్టారు. అయితే, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరుమల పర్యటనలో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది.. రాంభగీచ సర్కిల్ వద్ద ప్రోటోకాల్ పక్కన పెట్టేసి భక్తులను పలకరించారు రాష్ట్రపతి ముర్ము.. కాన్వాయ్ నుంచి దిగి రోడ్డు పక్కన నిలిచిఉన్న భక్తులను ప్రేమగా పలకరించిన రాష్ట్రపతి.. భక్తులతో కరచాలనం చేసి చా÷-లకెట్స్ పంపిణీ చేశారు.. ఇక, ఊహించని ఘటనతో భక్తులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.. అయితే, రాష్ట్రపతి అనూహ్యంగా కాన్వాయ్ దిగడంతో.. భద్రతా సిబ్బంది ఒక్కసారిగా అలర్ట్ అయ్యారు. రెండు రోజుల పర్యటన భాగంగా.. గురువారం తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. ఆ తర్వాత తిరుమల చేరుకుని శ్రీపద్మావతి విశ్రాంతి గృహంలో బస చేశారు.. ఉదయం శ్రీవారిని దర్శించు కున్నారు.. అనంతరం హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.




## త్వరలోనే స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ

## ఏటీసీలుగా 65 ఐటీఐ కళాశాలల మార్పు

**హైదరాబాద్,నవంబర్21(సమయజ్యోతి):**

65 ఐటీఐ కళాశాలలను ఏటీసీలుగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క తెలిపారు. హైదరాబాద్ కూకట్‌పల్లిలోని జేఎన్టీయూ డైమండ్ జూబ్లీ వేడుకలకు ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరయ్యారు. విద్యార్థుల భవిష్యత్తులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. త్వరలోనే స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు.



# గవర్నర్లకు గడువు ఉండాల్సిందే

## అవసరమైతే రాజ్యాంగ సవరణ చేయాలి

## సుప్రీం తీర్పుపై తమిళనాడు సిఎం స్టాలిన్ వ్యాఖ్య

**చెన్నై,నవంబర్21(సమయజ్యోతి):**

శాసనసభలు ఆమోదించి పంపించిన బిల్లులకు సమ్మతి తెలిపే విషయంలో రాష్ట్రపతి,గవర్నర్లకు న్యాయస్థానాలు గడువు విధించలేవని సుప్రీం కోర్టు స్పష్టం చేయడంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్రంగా స్పందించారు. బిల్లులపై నిర్ణయం తీసుకునేలా గవర్నర్లకు గడువు విధించే విధంగా రాజ్యాంగంలో సవరణలు తెచ్చేవరకు తమ పోరాటం ఆపబోమని వెల్లడించారు.ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్‌లో సుప్రీంకోర్టు ఇచ్చిన అభిప్రాయం.. ఏప్రిల్ 8 నాటి తీర్పును (తమిళనాడు ప్రభుత్వం వర్సెస్ గవర్నర్) ప్రభావితం చేయలేదు. వాస్తవానికి ఎన్నికైన ప్రభుత్వం డ్రైవర్ సీటులో ఉండాలని, రాష్ట్రంలో రెండు పాలక వర్గాలు ఉండకూడదని సుప్రీం తీర్పు పునరుద్ఘాటించింది. బిల్లులను పక్కన పడేసేలా వీటో అధికారం చూపే అవకాశం గవర్నర్లకు ఉండదు. బిల్లులను నిలిపివేసే అధికారం వారికి లేదు. రాష్ట్ర హక్కులు, సమాఖ్యవాదం కోసం మా పోరాటం కొనసాగుతూనే ఉంటుందని స్టాలిన్ స్పష్టం చేశారు. తమిళనాడు గవర్నర్ బిల్లులను నిరవధికంగా నిలిపివేయడాన్ని సవాల్‌చేస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం ఏప్రిల్ 8న నిర్ణయం వెలువరించింది. ఆ తీర్పు రాష్ట్రపతి, గవర్నర్ అధికారాల్లో జోక్యం చేసుకున్నట్లుగా ఉండటంతో మే 13న ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము 14 ప్రశ్నలతో సీజేఐకి లేఖ రాశారు. ఈ నేపథ్యంలోనే సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం గురువారం కీలక తీర్పు వెలువరించింది. బిల్లులకు సమ్మతి తెలిపే విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయస్థానాలు గడువు విధించలేవని రాజ్యాంగ ధర్మాసనం తెలిపింది. అయితే తమ వద్దకు వచ్చిన బిల్లులను గవర్నర్లు అకారణంగా, నిరవధికంగా నిలిపివేయడం తగదని, సహేతుక సమయంలోగా నిర్ణయం తీసుకోవాలని సూచించింది. అందుకు రాజ్యాంగ సవరణ అవసరమని ఇప్పుడు సిఎం స్టాలిన్ అభిప్రాయపడ్డారు.




## ఈ ఏడాది మిస్ యూనివర్స్‌గా ఫాతిమా బోష్..

### పోటీలో భారత్‌కు తీవ్ర నిరాశ

2025 ఈ ఏడాది మిస్ యూనివర్స్‌గా మెక్సికో భామ ఫాతిమా బోష్ నిలిచారు. థాయ్‌లాండ్ వేదికగా జరిగిన విశ్వ సుందరి పోటీల్లో ఫాతిమా విజేతగా నిలిచారు. దీంతో గతేడాది మిస్ యూని వర్స్‌గా నిలిచిన డెన్మార్క్ భామ విక్టోరియా కెజార్ హెల్విగ్.. ఫాతిమాకు మిస్ యూనివర్స్ కిరీటాన్ని అలంకరించారు. పోటీల్లో తొలి రన్నరప్‌గా థాయ్‌లాండ్‌కు చెందిన ప్రవీనర్ సింగ్, రెండో రన్నరప్‌గా వెనెజువెలాకు చెందిన స్టిఫానీ అబాసలీ నిలిచారు.


# రాయపూర్‌లో మూడ్రోజుల పాటు డిజిపిల సమావేశం

## హాజరవుతున్న ప్రధాని మోడీ, అమిత్ షాల హాజరు

**రాయపూర్,నవంబర్ 20 (సమయజ్యోతి):**



ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో ఈ నెల 28 నుంచి 30 వరకు అన్ని రాష్ట్రాల డీజీపీల సమావేశం జరగనున్నది. ఈ సమావేశానికి ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షా హాజరుకానున్నారు. ఈ సమావేశంలో అన్ని రాష్ట్రాల డీజీపీలు, ఐజీలు, సీనియర్ అధికారులు పాల్గొంటారు. ఈ వార్షిక సమావేశంలో ప్రధానంగా ఆపరేషన్ కగార్ పురోగతి, ఉగ్రవాద దాడుల నిరోధక వ్యూహాలు ప్రధాన అజెండాగా ఉండనున్నాయని తెలిసింది. మావోయిస్టుల లొంగుబాట్లు, వరుస ఎన్‌కౌంటర్లు జరుగుతున్న నేపథ్యంలో ప్రధాని, కేంద్ర హోంమంత్రి హాజరవుతుండటంతో సమావేశానికి మరింత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే కేంద్రం, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం భారీ స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ప్రత్యేక కమాండోలు, సీఆర్‌పీఎఫ్, ఎన్ఐఏ, ఐబీ బృందాలు రాయ్‌పూర్ చేరుకుని వ్యూహాత్మక భద్రతా ప్రణాళికను అమలు చేస్తున్నాయి. ఈ సమావేశానికి తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ డీజీ విజయ్‌కుమార్, ఎస్ఐబీ చీఫ్ సుమతి తదితరులు హాజరుకానున్నారు. శాటిలైట్ నిఘా, డ్రోన్ పెట్రోలింగ్, గ్రౌండ్ ఆపరేషన్స్ ను మరింత సమర్థవంతంగా మార్చడంపై కీలక నిర్ణయాలు తీసుకుంటారని అధికారవర్గాలు చెప్తున్నాయి. ఇటీవలి వరుస ఎన్‌కౌంటర్లు, హిడ్మా తదితరుల హతం తరవాత దీనికి ప్రత్యేకత ఏర్పడింది.



# దుబాయ్ ఎయిర్ షోలో ప్రమాదం

## ప్రదర్శన సమయంలో కుప్పకూలిన తేజస్

**న్యూఢిల్లీ,నవంబర్21(సమయజ్యోతి):**

దుబాయ్‌లో జరుగుతున్న ఎయిర్ షోలో ప్రమాదం చోటు చేసుకుంది. భారత్‌కు చెందిన తేజస్ యుద్ధ విమానం కూలిపోయింది. ఎయిర్ షోలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ప్రదర్శన జరుగుతుండగా.. విమానం ఒక్కసారిగా కూలిపోయింది. ఆ వెంటనే పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి . ఈ ఘటనతో అక్కడ ఒక్కసారిగా భయాందోళనకర వాతావరణం నెలకొంది. పైలట్ ప్రమాదం నుంచి బయటపడ్డాడా..? లేదా..? అన్నది స్పష్టంగా తెలియలేదు. కానీ, ప్రమాద తీవ్రతను చూస్తుంటే పైలట్ బతికే ఛాన్స్ లేదనే తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ కూడా ఇంకా ఎలాంటి ప్రకటనా చేయలేదు. కాగా, పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఈ యుద్ధ విమానాన్ని బెంగళూరులోని హిందూస్తాన్ ఎరోనాటికల్ లిమిటెడ్ తయారు చేసింది.

# అబద్దాల ప్రచారం మానుకోవాలి



## అబద్దాల ప్రచారంలో కెటిఆర్ దిట్ట

## గతంలో లాగా అడ్డగోలు నిర్ణయాలకు మేం దూరం

## ఉపాధి, ఉద్యోగాల కోసం పెట్టుబడుల వేట

## గతంలో ఇచ్చిన జీవోల ఆధారంగానే భూ కేటయింపులు

## ఎవ్వరికీ భూములు దోచిపెట్టే పరిస్థితి లేదు

## కెటిఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్,నవంబర్21(సమయజ్యోతి):**

పదేళ్లు మంత్రిగా పనిచేసిన కేటీఆర్ రాష్ట్ర ప్రజలకు అసత్యాలు చెబుతున్నాని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం సిఎం రేవంత్ నేతృత్వంలో పెట్టుబడుల కోసం, ఉపాధి, ఉద్యోగాల కల్పనకు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నదని అన్నారు. అచిర కాలంలోనే తెలంగాణ అనేక విజయాలు సాధించిందని అన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా అడ్డగోలుగా జీవోలు, చెల్లింపులు చేయడం లేదని, వారి హయాంలో ఏం చేసినా దాని వెనుక ఓ మతలబు ఉండేదని ఆరోపించారు. శుక్రవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.



# భూములపై వాలిపోతున్న రేవంత్ ముఠా

- రాష్ట్రంలో భారీ భూకుంభకోణం
- నాలుగు లక్షల కోట్ల విలువచేసే భూమికి రెక్కలు
- నన్ను అరెస్ట్ చేసే ధైర్యం రేవంత్‌కు లేదు
- మీడియ సమావేశంలో కెటిఆర్ విమర్శలు

**హైదరాబాద్,నవంబర్21(సమయజ్యోతి):**

రాష్ట్రంలో భారీ భూకుంభకోణం జరుగుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఏకంగా నాలుగు లక్షల కోట్ల విలువచేసే భూమిని కొల్లగొట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి ముఠా కుట్ర చేస్తున్నదని ఆయన సంచలన ఆరోపణ చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ యువతకు ఉద్యోగాలు ఇవ్వలేకపోయిందని విమర్శించారు.తెలంగాణ భవన్‌లో కేటీఆర్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో భూములు ఎక్కడున్నా రేవంత్ ముఠా అక్కడ వాలిపోతోందని అన్నారు.

# ఢిల్లీలో ప్రమాదకరంగా గాలి కాలుష్యం

## మరింతగా క్షీణించినట్లు గుర్తింపు

## స్పోర్ట్స్ యాక్టివిటీస్‌పై నిషేధం విధింపు

## ప్రజలను హెచ్చరించిన అధికారులు

**న్యూఢిల్లీ,నవంబర్21(సమయజ్యోతి):**

ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలకు చేరుకుంది. పలు ప్రాంతాల్లో పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. గత నెల ఢిల్లీ – ఎన్సీఆర్ ప్రాంతాల్లోని 80 శాతం ఇళ్లలో విషపు గాలి కారణంగా కనీసం ఒక సభ్యుడు అనారోగ్యానికి గురైనట్లు సర్వేలు చెబుతున్నాయి. గాలి కాలుష్యం కారణంగా ప్రజల ఆయుర్దాయంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఎన్ని చర్యలు తీసుకుంటున్నా కూడా పూర్తి స్థాయిలో ప్రజలకు రక్షణ లభించటం లేదు. మాస్కులు, ఎయిర్ ప్యూర్గి÷యైర్లు కొంత మేరకు మాత్రమే రక్షణ ఇస్తాయని, కాలుష్యాన్ని నియంత్రించడానికి పాలసీలో మార్పులు రావాలని వైద్యులు సూచిస్తున్నారు. కాలుష్యం తీవ్ర స్థాయికి చేరుకున్న నేపథ్యంలో ఢిల్లీ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. స్పోర్ట్స్ యాక్టివిటీస్‌పై నిషేధం విధించింది. ఢిల్లీలో కాలుష్యం పెరుగుతుండటంతో స్పోర్ట్స్ యాక్టివిటీస్ ఆపేయాలని రెండు రోజుల క్రితం దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తం అయింది. సాధారణంగా ఢిల్లీలోని స్కూల్స్ చలికాలంలో స్పోర్ట్స్ మీట్స్ కండక్ట్ చేస్తూ ఉంటాయి. కాలుష్యం పెరగటంతో నవంబర్, డిసెంబర్ నెలలో నిర్వహించే క్రీడలను నిర్వహించొద్దని ఢిల్లీ ప్రభుత్వం స్కూళ్లను ఆదేశించింది. ఇకపోతే ఢిల్లీలో గాలి నాణ్యతలు క్షీణించాయి. ఢిల్లీలో కొన్ని ప్రాంతాల్లో ప్రమాదకర స్థాయిలో గాలి నాణ్యతలు నమోద్యాయి. దీంతో ఆ గాలి ప్రాణాంతకంగా మారుతుందని పలువురు నిపుణులు ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని ప్రాంతంలో 80 శాతం నివాసితులు గాలి నాణ్యతలు క్షీణించడం వల్ల అనారోగ్యాలపాలవుతున్నారు. కనీసం కుటుంబంలో ఒక్కరైనా శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారని పలు సర్వేలు వెల్లడించాయి. మాస్కులు, ఎయిర్ ప్యూర్గి÷యైర్‌లు కొంత రక్షిస్తున్నప్పటికీ.. ఈ సమస్యను పరిష్కరించడానికి ఏడాది పొడవునా కచ్చితమైన విధాన మార్పు అవసరమని వైద్యులు సూచించారు. శుక్రవారం ఉదయం 9 గంటల సమయానికి ఎక్యూఐ 370 స్థాయి వద్ద నమోదైంది. దీంతో వీటి స్థాయిల్ని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వెరీపూర్ కేటగిరీలో వర్గీకరించింది. ఢిల్లీలో కొన్ని ప్రాంతాల్లో ఎక్యూఐ తీవ్ర స్థాయిలో నమోదైంది. చాందినీ చౌక్, ఆనంద్ విహార్, ముండ్కా, బవానా, నరేలా, డిటియు– వజీర్‌పూర్‌లలో 400కి పైగా ఎక్యూఐ నమోదైంది. 18 పర్యవేక్షణా కేంద్రాల్లో 400 పైగానే ఎక్యూఐ నమోదైంది. గత కొన్ని రోజుల్లోనే కాకుండా.. వచ్చే వారంలో ఆరు రోజులు కూడా తీవ్ర ప్రమాదకర స్థాయిలోనే గాలి నాణ్యతలు నమోదయ్యే అవకాశం ఉందని భూశాస్త్రాల మంత్రిత్వశాఖ అంచనా వేసింది. గాలి కదలికలు సరిగ్గా లేకపోవడం, శీతాకాలం కారణంగా గాలి నాణ్యతలు ప్రమాదకర స్థాయిలో నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఢిల్లీలో గాలి ఎంత కాలుష్యంగా ఉందో నెట్టింట వైరల్ అవుతున్న ఫొటోలే నిదర్శనం. దేశ రాజధానిలో వాయు కాలుష్యం పెరిగిపోవటానికి పంట వ్యర్థాలను తగలబెట్టడం ప్రధాన కారణం అవుతోంది. ఢిల్లీ చుట్టు పక్కల ఉండే రాష్ట్రాల ప్రజలు పెద్ద సంఖ్యలో పంట వ్యర్థాలను తగలబెడుతూ ఉన్నారు. దాని కారణంగా ఢిల్లీలో కాలుష్యం పెరుగుతోంది. అధికారులు పోలీస్ కేసులు నమోదు చేస్తున్నా.. భారీ÷న్లు వేస్తున్నా కూడా రైతులు మారటం లేదు. పంట వ్యర్థాలను కాలుస్తూనే ఉన్నారు.

## హోంశాఖను వదులుకున్న నితీశ్

### బిజెపి ఉపముఖ్యమంత్రి సామ్రాట్‌కు కేటాయింపు

### పలువురు మంత్రులకు శాఖలు కేటాయిస్తూ ఉత్తర్వులు

**పట్నా,నవంబర్21(సమయజ్యోతి):**

భాజపా సీనియర్ నేత, డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌధరికి హోంశాఖను కేటాయించారు. దాదాపు 20 ఏళ్ల పాటు తన వద్ద ఉన్న కీలకమైన హోంశాఖను సీఎం నీతీశ్ వదులుకున్నారు. అత్యంత కీలకమైన ఈ శాఖను బిజెపికి కేటాయించారు. బిహార్‌ను సుదీర్ఘకాలంగా పాలిస్తున్న జేడీయూ అధినేత నీతీశ్ కుమార్ పదోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన విషయం తెలిసిందే. ఆయనతో పాటు మరో 26 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. బిహార్‌లో సీఎం నీతీశ్ కుమార్ సారథ్యంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వంలో మంత్రులకు శాఖల కేటాయింపు చేపట్టారు. మంత్రిత్వశాఖల కేటాయింపుల్లో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. మంత్రులకు శాఖల కేటాయింపునకు సంబంధించి శుక్రవారం అధికారిక నోటిఫికేషన్ విడుదలైంది. మరో డిప్యూటీ సీఎం, భాజపా నేత విజయ్ కుమార్ సిన్హాకు రెవెన్యూ, భూసంస్కరణలు, భూగర్భగనుల శాఖను అప్పగించారు. సీఎం నీతీశ్ వద్ద సాధారణ పరిపాలన విభాగం, క్యాబినెట్ సెక్రటేరియట్, విజిలెన్స్ తదితర శాఖలు మాత్రమే ఉన్నాయి. మరోవైపు, జేడీయూతో పొత్తు పెట్టుకున్న ప్రతిసారీ భాజపా చేతిలో ఉన్న ఆర్థికశాఖను ఈసారి జేడీయూకి కేటాయించడం గమనార్హం. దీంతో ఆర్థిక, వాణిజ్య పన్నుల శాఖలను జేడీయూ సీనియర్ నేత బిజేంద్ర ప్రసాద్ యాదవ్‌కు అప్పగించారు. జేడీయూ సీనియర్ నేత శ్రోవన్ కుమార్‌కు గ్రామీణాభివృద్ధి, రవాణాశాఖ కేటాయించగా.. అదే పార్టీకి చెందిన అశోక్ చౌదరికి గ్రామీణ పనుల విభాగం శాఖను కేటాయించారు. జేడీయూ నేత విజయ్ చౌధరికి భవన నిర్మాణం, జలవనరులు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖలు అప్పగించగా.. మదన్ సాహ్నీకి సాంఘిక సంక్షేమ మంత్రిత్వశాఖను కేటాయించారు. భాజపా నేత శ్రేయసి సింగ్‌కు క్రీడలు, ఐటీ శాఖ అప్పగించిన నీతీశ్.. ఆ పార్టీకి చెందిన నేతలు అరుణ్ శంకర్ ప్రసాద్‌కు పర్యాటక శాఖ, సంజయ్ టైగర్‌కు కార్మిక శాఖను అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రీయ లోక్ సమతా పార్టీకి చెందిన దీపక్ ప్రకాశ్‌కు పంచాయతీరాజ్, హెచ్ఏఎం నేత సంతోష్ సుమన్‌కు జలవనరుల శాఖను కేటాయించారు.

## రైతుల ఆత్మహత్యపై స్పందించరేం

### ధరణి పోయి భూమాత వచ్చినా సమస్యలు పరిష్కరించరా

### సిఎం రేవంత్ రెడ్డి తీరుపై హరీష్ రావు విమర్శలు

**హైదరాబాద్,నవంబర్21(సమయజ్యోతి):**

ఒక్క రైతు కూడా భూ సమస్య వల్ల ఆత్మహత్య చేసుకోకూడదు. రైతుల భూమి హక్కులు 100 శాతం కాపాడతాం అని ఎన్నికల ప్రచారంలో అదరగొట్టిన రేవంత్ రెడ్డికి మీ పార్టీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల వద్ద, తహసిల్దార్ కార్యాలయాల వద్ద జరుగుతున్న రైతు ఆత్మహత్యాయత్నాలు కనిపించడం లేదా అని మాజీ మంత్రి హరీశ్‌రావు సూటిగా ప్రశ్నించారు. అధికారం లోకి వస్తే 3 నెలల్లో భూమి సమస్యలు పరిష్కరిస్తాం అన్న హామీ ఏమైంది రేవంత్ రెడ్డి అని నిలదీశారు. భూముల రికార్డులు సరిచేస్తాం, రైతుల హక్కులు కాపాడతాం అని చెప్పి మీరు రెండేళ్లుగా కుంటి సాకులు చెబుతూ రిజిస్ట్రేషన్లు చేయకుండా రైతుల జీవితాలతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు. రైతు భూమి మీద ఆ రైతుకే హక్కు లేకుండా చేస్తున్న దుర్మార్గ ప్రభుత్వం మీది. ఇది రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ద్రోహం. ఆపదకో, అవసరానికో ఉన్న భూములు అమ్ముకోలేక.. అధిక వడ్డీకి రుణాలు తీసుకోలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు అని హరీశ్‌రావు పేర్కొన్నారు.ప్రజా పాలన దరఖాస్తులు ఏమయ్యాయి? రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు ఏమయ్యాయని అన్నారు. ధరణి పేరు మార్చి తెచ్చిన భూ భారతి ఏమైందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 70 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే మీ ప్రభుత్వం ఏం చేస్తున్నట్లు? నెలల తరబడి రెవెన్యూ ఆఫీసులు,కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా రైతులు, ప్రజల సమస్యలు మాత్రం పరిష్కారమవడం లేదు. ఇప్పటికే మీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల వల్ల 700 పైగా అన్నదాతలు ప్రాణాలు కోల్పోయారు. రుణమాఫీ కాక, రైతు భరోసా అందక, పంట బోనస్ ఇవ్వక పోవడంతో రైతులు ఆత్మస్థైర్యం కోల్పోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, రెవెన్యూ శాఖ మేలుకుని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, రైతు ఆత్మహత్యలు చేసుకోకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో మరో జాతీయ సదస్సు

### డిసెంబర్‌లో చారిత్రక నాణెలిల సదస్సు

### బ్రోచర్‌ను ఆవిష్కరించిన మంత్రి జూపల్లి

**హైదరాబాద్,నవంబర్21(సమయజ్యోతి):**



హైదరాబాద్ మరో జాతీయ సదస్సుకు వేదిక కాబోతున్నది. తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా జాతీయ స్థాయిలో చారిత్రక నాణెలిల సదస్సు నిర్వహణకు రంగం సిద్ధమైంది. రాష్ట్ర వారసత్వ శాఖ ఆధ్వర్యంలో డిసెంబర్ 11, 12 తేదీల్లో 107వ వార్షిక జాతీయ నాణెలిల సదస్సు, సెమినార్‌ను నిర్వహించనున్నారు. ఈ సదస్సు బ్రోచర్‌ను శుక్రవారం డా.బీఆర్. అంబేద్కర్ సచివాలయంలో పర్యాటక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు లాంఛనంగా ఆవిష్కరించారు. న్యూమిస్మాటిక్ సొసైటీ ఆఫ్ ఇండియా సహకారంతో తెలంగాణ వారసత్వ శాఖ సంయుక్తంగా ఈ ప్రతిష్టాత్మక సదస్సును నిర్వహిస్తోంది. రాష్ట్ర ఆవిర్భావం తరువాత నాణెలిల అధ్యయనంపై ఇంతటి ముఖ్యమైన జాతీయ స్థాయి కార్యక్రమం హైదరాబాద్‌లో జరగడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. నాణెలిల చరిత్ర ద్వారా తెలంగాణ రాష్ట్ర గొప్ప చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని దేశానికి చాటి చెప్పేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్‌లోని డా. ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డి ఇన్‌స్టిట్యూట్‌లో డిసెంబర్ 11, 12 న రెండు రోజుల పాటు ఈ సదస్సు జరగనుంది. భారతదేశ నలుమూలల నుంచి విద్యార్థులు, స్కాలర్స్, పరిశోధకులు (రీసర్చర్స్), న్యూమిస్‌మటిక్స్ నిపుణులు పాల్గొనే ఈ సదస్సు, నాణెలిల చారిత్రక, సాంస్కృతిక, కళాత్మక ప్రాముఖ్యతపై చర్చించేందుకు ఒక వేదికగా ఉపయోగపడనుందని భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, వారసత్వ శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్ రావు కుతాడి, డిప్యూటీ డైరెక్టర్లు డా. డి. రాములు, డా. పి. నాగరాజు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

# అబద్ధాల ప్రచారం మానుకోవాలి

'మా కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలపై కేటీఆర్ ఆరోపణలు చేశారు. మొత్తం 9,292 ఎకరాల భూమి గురించి మాట్లాడారు. పరిశ్రమలను ప్రోత్సహించాలని ప్రభుత్వం భూములను తక్కువ ధరకు ఇస్తోంది. 2023లో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం మూడు జీవోలు ఇచ్చింది. ఆ జీవో ప్రకారం హైదరాబాద్‌లోని భూములను ట్రాన్స్‌ఫర్‌కు అనుమతి ఇచ్చారు. ప్రభుత్వ భూమి అమ్ముకున్నట్టు కేటీఆర్ మాట్లాడుతున్నారు. ఫ్రీహోల్డ్, ల్యాండ్ లీజ్‌కు తేడా లేకుండా మాట్లాడారు. 2023లో భారత రాష్ట్ర సమితి తెచ్చిన జీవో ప్రకారమే భూములు ఇస్తున్నాం. భూమి హక్కులు ఉన్న వారికి మేలు చేయాలని చూస్తున్నాం. గత ప్రభుత్వం హయాంలో చాలా భూములు బదిలీ చేశారు. పరిశ్రమలకు ఉపయోగపడాలని గ్రిడ్ పాలసీ తీసుకున్నారని అనుకున్నాం. పారిశ్రామిక వేత్తలను ఇబ్బంది పెట్టకూడదు. పెట్టుబడులు రావాలని రాయితీలతో కూడిన పాలసీలు తీసుకుంటాం. కొన్ని రాష్ట్రాల్లో 99 పైసలకే భూములు ఇస్తున్నారు. పెట్టుబడులు రావాలి, ఉపాధి పెంచాలి అనేది మా లక్ష్యం. ఫ్రీహోల్డ్ ల్యాండ్ ఉన్నవారు పాలసీ ద్వారా అవకాశం ఉంటే దరఖాస్తు చేసుకుంటారని అన్నారు. భారత రాష్ట్ర సమితి నేతలు అభూత కల్పనలతో రాష్ట్ర ప్రజలకు సత్యదూరమైన మాటలు చెబుతున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమి తర్వాత ఆ పార్టీ నేతలకు పగలే చుక్కలు కనిపిస్తున్నాయి. పెట్టుబడులు రాకూడదు, రాష్ట్ర అభివృద్ధి జరగకూడదు అనేది కేటీఆర్ ఆలోచన. ఆధారాలు ఉంటేనే మాట్లాడాలి. కేటీఆర్ కొంత మంది పేర్లు చెప్పారు.. వారు ప్రభుత్వంలో లేరు. ఆధారాలు ఉంటే చెప్పండి.. చర్యలు తీసుకుంటాం అని శ్రీధర్‌బాబు తెలిపారు. రాష్ట్ర ప్రగతిని అడ్డుకునేలా అబద్ధాల ప్రచారం మానుకోవాలన్నారు. గతంలో లాగా అడ్డగోలు నిర్ణయాలు జరగడం లేదన్నారు. స్వలాభం అన్నదానికి వారు హయాంలో తీసుకున్న నిర్ణయాలే నిదర్శనమని శ్రీధర్ బాబు అన్నారు.

మొదటిపేజీ తరువాయి

## భూములపై వాలిపోతున్న రేవంత్ ముఠా

ఎంతో విలువైన భూములపై రేవంత్ కుటుంబసభ్యుల కన్ను పడిందని ఆరోపించారు. బాలానగర్ పరిసరాల్లో సుమారు 9300 ఎకరాల భూకుంభకోణం జరుగుతోందని చెప్పారు. బాలానగర్, కాటేదాన్, జీడిమెట్లలో రేవంత్ తన వాళ్లకు భూములిచ్చారని విమర్శించారు. మొత్తం నాలుగు లక్షల కోట్ల కుంభకోణం జరుగుతోందని ఆరోపించారు. జపాన్‌లో ఉన్నప్పుడు కూడా ఆ భూమికి సంబంధించిన ఫైల్‌పై రేవంత్ ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ప్రతి ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు రాయితీలు ఇస్తుందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం హైదరాబాద్‌లో అతిపెద్ద భూకుంభకోణానికి తెరలేపిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో 2022లో భూముల రెగ్యులేషన్ కోసం చట్టం తీసుకొచ్చామని, భూములకు వంద శాతం ఫీజులు చెల్లించేలా నిబంధన చేర్చామని కేటీఆర్ తెలిపారు. భూములు వేరేవాళ్లకు అమ్ముకుంటే రెండు వందల శాతం చెల్లించాలని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనలు పట్టించుకోకుండానే భూ కేటాయింపులు చేసిందని విమర్శించారు. 30 శాతం చెల్లిస్తే రెగ్యులర్ చేస్తామని ఉత్తర్వులు ఇచ్చారని ఆరోపించారు. ఇకపోతే రేవంత్ రెడ్డి నన్ను అరెస్టు చేసే ధైర్యం చేయరు. ఈ ఫార్ములా రేస్ కేసులో ఏమీ లేదని రేవంత్ రెడ్డికి కూడా తెలుసు. ఏ తప్పూ చేయలేదు.. లై డిటెక్టర్ టెస్టుకైనా సిద్ధమే అని కేటీఆర్ పేర్కొన్నారు. కడియం శ్రీహరిని కాపాడేందుకు దానం నాగేందర్‌తో రాజీనామా చేయించే ప్రయత్నం చేస్తున్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడితే ప్రభుత్వం పరువు పోతుందని ముందుగానే ఎమ్మెల్యేలచే రాజీనామా చేయించేందుకు సిద్ధమవుతున్నారు. ముందుగా జీహెచ్ఎంసీ ఎన్నికలు వస్తాయి. ఆ తర్వాత ఉప ఎన్నికలు వస్తాయి అని కేటీఆర్ పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి

## జేఎన్టీయూ డైమండ్ జూబ్లీ వేడుకల్లో డిప్యూటీ సీఎం

జేఎన్‌టీయూ ఒక విశ్వవిద్యాలయం మాత్రమే కాదని.. ఇది దేశానికి, ముఖ్యంగా తెలంగాణకు గొప్ప ఆస్తి అని పేర్కొన్నారు. ఇంజనీర్లను తయారు చేసే శక్తివంతమైన దేశ ఇంజిన్ అని ప్రశంసించారు. విద్యార్థుల ప్రతిభ ప్రపంచానికి ఎంతో గర్వకారణమన్నారు. విద్య అనేది ఖర్చు కాదని, భవిష్యత్తును నిర్మించే పెట్టుబడని విద్యార్థులకు భట్టి విక్రమార్క సందేశం ఇచ్చారు. ఉద్యోగాలు వెతికే వారిగా కాకుండా ఉద్యోగాలు సృష్టించే వారిగా ఎదగాలని సూచించారు. మొదటి 60 ఏళ్ల కంటే, వచ్చే 60 ఏళ్లు మరింత మహోన్నతంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు.

## బిఆర్ఎస్ హయాంలో ఫామ్‌హౌజ్ పాలన

### పచ్చకామెర్లు సోకిన వ్యక్తి కెటిఆర్

### ఘాటుగా విమర్శించిన ఎంపి చామల

**హైదరాబాద్,నవంబర్21(సమయజ్యోతి):**

పచ్చ కామెర్లు వచ్చిన వారికి లోకం అంతా పచ్చగానే కనపడుతోందని.. కేటీఆర్‌కి కూడా అలాగే ఉందని మాజీ మంత్రి కేటీఆర్ కి కాంగ్రెస్ భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. శుక్రవారం గాంధీభవన్‌లో మీడియాతో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో ఫాం హౌస్ పాలన తప్పా.. ప్రజాపాలన ఎక్కడా చేయలేదని మండిపడ్డారు. తమ ప్రభుత్వంలో కేబినెట్‌లో అన్ని నిర్ణయాలు జరుగుతాయని కేటీఆర్ గతంలో ఒప్పుకున్నారని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబాన్ని విమర్శించడమే కేటీఆర్ పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి. రేవంత్‌రెడ్డి కుటుంబంలో ఎంతమంది తమ ప్రభుత్వంలో ఉన్నారో కేటీఆర్ చెప్పాలని సవాల్ విసిరారు. కేటీఆర్ లాగా ఇంట్లో ఉన్నోళ్లందరికీ రాజకీయ పదవులను తమ ప్రభుత్వంలో ఇవ్వలేదని స్పష్టం చేశారు. కేటీఆర్ పదేళ్లు ఏం చేశారని, తెలంగాణకు తీసుకువచ్చిన పెట్టుబడులు ఏమయ్యాయని ప్రశ్నల వర్షం కురిపించారు. కేటీఆర్ అండ్ కో తెలంగాణకు మంచి చేయరని... తాము చేస్తుంటే అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. వ్యాపారవేత్తలను కేటీఆర్ బెదిరించారని ఆరోపించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ని ఓడగొట్టినా కేటీఆర్‌కు బుద్ధి మారలేదని ఎద్దేవా చేశారు. చివరికి జూబ్లీహిల్స్‌లో ఓడగొట్టినా కేటీఆర్ మారడం లేదని విమర్శలు చేశారు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి. ఒక ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలిస్తేనే మాజీ మంత్రి కేటీఆర్ తట్టుకోలేక పోతున్నారని ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ విమర్శించారు. ఇంకో రెండు ఉప ఎన్నికలు వస్తే కేటీఆర్ అమెరికా పారిపోతారని ఎద్దేవా చేశారు. నేతలు ఎవరైనా తప్పు చేస్తే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి దమ్ము, ధైర్యం ఏంటో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో చూపెట్టారని తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఓటమికి బాధ్యత వహిస్తూ కేటీఆర్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవికి రాజీనామా చేయాలని సవాల్ విసిరారు. జైలుకు పోవాలనే ఉత్సాహం కేటీఆర్‌కు ఎక్కువగా ఉందని సెటైర్లు గుప్పించారు. ఐదేళ్లు అడ్డగోలుగా దోచుకున్న సొమ్ముతో కేటీఆర్ విర్రవీగుతున్నారని మండిపడ్డారు. రూ. 55 కోట్ల విలువ చేసే 20 ఎకరాల భూమిని సిరిసిల్ల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడికి కేటీఆర్ కట్టబెట్టారని ఆరోపించారు. ఫార్ములా ఈ కారు రేసు కేసు గురించి కేటీఆర్ ప్రెస్‌మీట్‌లో ఒకలా, కోర్టులో మరొకలా చెబుతున్నారని ఎద్దేవా చేశారు. జాతిపితలా కేటీఆర్ బిల్డప్ ఇస్తున్నారని దెప్పిపొడిచారు. కేటీఆర్ ఆరోపణలపై తమ ప్రభుత్వం లెక్కలతో సహా బయటపెట్టిందని స్పష్టం చేశారు. కవిత ఆరోపణలపై కేటీఆర్, హరీశ్‌రావు వెంటనే స్పందించాలని ఛాలెంజ్ చేశారు.

# విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరులు పెంపొందించాలి.

సమయజ్యోతి ప్రతినిధి భూపాల్ పల్లి

మహాముత్తారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్సు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు దేవ్ సింగ్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీయడానికి టాలెంట్ టెస్టు దోహదం చేస్తాయన్నారు విద్యార్థులలో శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించడానికి జనవిజ్ఞాన వేదిక ఎన్నో యేళ్ళుగా కృషి చేస్తుందని పేర్కొన్నారుప్రతీ ఏటా మండల స్థాయిలో పోటీలను నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు అనంతరం ములుగు పల్లె ఉన్నత పాఠశాల బయోలజీ ఉపాధ్యాయులు కామిడి సతీష్ రెడ్డి మాట్లాడుతూ సివి రామన్ వర్ధంతి సందర్భంగా మండల స్థాయిలో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు ప్రతి విద్యార్థి సైన్స్ పట్ల అభిరుచి ఆసక్తిని కలిగి ఉండాలని పేర్కొన్నారు సత్యన్వేషణ ద్వారానే సైన్స్ సాధ్యమవుతుందని విద్యార్థులు భావిభారత శాస్త్రవేత్తలుగా ఎద గాలని పేర్కొన్నారు అనంతరం మండల స్థాయిలో గెలుపొందిన వారికి మెమొంటో ప్రశంస పత్రంలు అందజేశారు జిల్లా పరిషత్ విభాగంలో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో ములుగు పల్లి ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానంలో జిల్లా పరిషత్ బోర్ల గూడెం స్కూల్ రెసిడెన్షియల్ విభాగంలో తెలంగాణ మోడల్ స్కూల్ ద్వితీయ స్థానంలో కేజీబీవీ మహ ముత్తారం జిల్లా స్థాయికి ఎంపికైనట్లు దేవ్ సింగ్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు వెంగళ శ్యాంసుందర్ జయ మధుకర్ రాంసింగ్ కట్ట సతీష్ రెడ్డి చైతన్య భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# అర్హులందరికీ ఇందిరా మహిళా చీరలు అందిస్తాం : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

అర్హులైన మహిళలందరికీ ఇందిరా మహిళా శక్తి చీరలు అందజేస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలోని మల్యాల గ్రామంలో లిమహిళా ఉన్నతి.. తెలంగాణ ప్రగతిలి పేరిట ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఇందిరా మహిళా శక్తి కింద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని వివరించారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా మహిళలకు ఇందిరమ్మ మహిళా శక్తి పేరిట చీరలు పంపిణీ చేస్తున్నామని, జిల్లాలో చీరలు పంపిణీ మొట్టమొదట మల్యాల గ్రామం ఎంపిక చేసుకున్నామని తెలిపారు. ఆకాశంలో సగం మహిళలు కాబట్టి ఆకాశంలో ఉన్న నీలి రంగు చీరలు సెలక్ట్ చేశామని, రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి చీరలు ఇస్తామని స్పష్టం చేశారు. జిల్లాలో లక్ష 45 వేల మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. మహిళా సంఘాలలో లేని వారికి కూడా పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వంలో పేద ప్రజల అభ్యున్నతి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. పేదలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. 200 యూనిట్లకు ఉచిత విద్యుత్, ఆర్టీసీ బస్సుల్లో మహిళకు ఉచిత బస్సు సౌకర్యం, ఆరోగ్య శ్రీ 10 లక్షలకు పెంపు, నూతన రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే సన్నం బియ్యం పంపిణీ చేస్తున్నామని ప్రకటించారు. స్వంత ఇంటి కల సాకారం కోసం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని, జిల్లాలో నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయని, లబ్ధిదారులకు నాలుగు విడతల్లో రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. మహిళా సంఘాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, చందుర్తి మండలంలోని స్వశక్తి మహిళలు ముందుకు వస్తే వారికి రైస్ మిల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మల్యాల గ్రామంలో ఎన్నో ఏళు ్లగా ఎదురు చూస్తున్న బ్యాంకు మంజూరు చేశామని తెలిపారు. చందుర్తి-మోత్కురావుపేట రోడ్డు నిర్మాణం త్వరలోనే పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

**వస్త్ర పరిశ్రమ సాధికారత.. మహిళా ఆత్మగౌరవానికి ప్రతీక**

ఇందిరా మహిళా చీరల ఉత్పత్తి ఆర్డర్లతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సాధికారతకు ఉపయోగపడుతుందని, మహిళల ఆత్మగౌరవానికి తోడ్పడుతుందని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అర్హులైన మహిళలకు అందజేసే చీరలు జిల్లాలో ఉత్పత్తి కావడం ఎంతో సంతోషంగా ఉందని, 32 జిల్లాల నుంచి ఎస్హెచ్జీ ల బాధ్యులు వచ్చి చీరల తయారీ విధానం, దశలు, రంగులు, నాణ్యత చూసి ఆనందం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉన్నతి.. తెలంగాణ ప్రగతి కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. మహిళల ఆర్థిక ఉన్నతితో రాష్ట్ర ప్రగతి సాధ్యమనే ఉద్దేశ్యంతో ప్రతి ప్రభుత్వ పథకంలో వారిని భాగస్వామ్యులను చేస్తుందని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పన, మరమ్మత్తుల పనులు అమ్మ ఆదర్శ పాఠశాల కింద మహిళా సంఘాలకు అందించామని, ఇందిరమ్మ ఇండ్లు మహిళల పేరిట ఇస్తుందని, కొనుగోలు కేంద్రాలు, ఇతర వ్యాపారాలకు అవకాశం కల్పించిందని తెలిపారు.ఎస్హెచ్జీ ల్లో ప్రస్తుతం 18- 59 ఏండ్ల వారికి అవకాశం ఉందని, ప్రభుత్వం ఇప్పుడు 15-18 ఏండ్ల కిశోర బాలికలకు, 60 ఏండ్ల వయసు పైబడిన వారికి కూడా సంఘాలు ఏర్పాటు చేసే అవకాశం కల్పించిందని తెలిపారు. సంఘాల్లోని మహిళలకు రుణ బీమా, ప్రమాద బీమా అమలు చేస్తుందని, ఇప్పటిదాకా 117 మందికి రూ. రెండు లక్షల వరకు రుణ బీమా, ఐదుగురికి రూ. 10 లక్షల చొప్పున ప్రమాద బీమా మంజూరు చేసిందని వెల్లడించారు. జిల్లాలో కొత్తగా 5560 మంది ఎస్ హెచ్ జీల్లో చేరారని తెలిపారు. అంగన్వాడీ, ఆశా కార్యకర్తలతోపాటు ఇప్పుడు ఎస్ హెచ్ జీ సభ్యులకు యూనిఫాం చీరలు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం, డీఆర్డీఓ శేషాద్రి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, తహసీల్దార్ భూపతి పాల్గొన్నారు.



# జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు కట్టుదిట్టం

## -సరైన పత్రాలు లేని వాహనాలు సీజ్

## జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ హెచ్చరిక

సమయజ్యోతి న్యూస్, నిర్మల్ బ్యూరో, నవంబర్ 21.

నిర్మల్ జిల్లా వ్యాప్తంగా పోలీసులు వాహన తనిఖీలను మరింత కట్టుదిట్టం చేసినట్లు జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల ఐపీఎస్ తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికేట్ వంటి వాహనానికి సంబంధించిన తప్పనిసరి పత్రాలు వాహనదారులు తమ వద్ద ఉంచుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ పత్రాలు లేని వాహనాలను పోలీసులు సీజ్ చేయడంతో పాటు, సంబంధిత వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేశారు.జిల్లాలో ఇటీవల చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో, మద్యం సేవించి వాహనం నడపడం తీవ్ర నేరమని, అలాంటి వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష చూపబోమని ఎస్పీ హెచ్చరించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే కేసులు నమోదు చేసి కోర్టు ద్వారా శిక్షలు, జరిమానాలు విధించబడుతాయని హెచ్చరించారు.



# సిబ్బంది సమయపాలన పాటించాలి

## : ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

సిబ్బంది అందరూ తప్పనిసరిగా సమయపాలన పాటించాలని జిల్లా ఇంఛార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాచందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్ సీ)ని ఇంచార్జి కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఓపీ రిజిస్టర్, ల్యాబ్, ఫార్మసీ, ఇమ్యూనైజేషన్ గది, ఇన్ పేషెంట్ గదులు, ఇతర గదులు, ఆవరణ పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే వారికి అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై వివరించాలని తెలిపారు. ప్రసవాల సంఖ్యపై ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని ఆదేశించారు.



# ఖేలో ఇండియా (అస్మిత) ఎంపిక పోటీలగోడప్రతులను విడుదల చేసిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

సమయజ్యోతి న్యూస్, నిర్మల్ బ్యూరో, నవంబర్ 21.

అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రేపటి నుంచి జిల్లాలో నిర్వహించబోయే బాలికల అండర్ 14, అండర్ 16 ఖేలో ఇండియా ఖేలో ఇండియా జిల్లా స్థాయి ఎంపిక పోటీలు రేపటి నుంచి నిర్వహించనున్నారు. ఈ ఎంపిక పోటీలకు సంబంధించి గోడప్రతులను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం సాయంత్రం తన ఛాంబర్లో విడుదల చేశారు. జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థుల్లో నైపుణ్యాలు దాగి ఉన్నాయని, ఇటువంటి పోటీల ద్వారా వాటిని వెలికి తీయాలని అన్నారు. ఎంపిక పోటీలు పగడ్బందీగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ ఎంపిక పోటీల్లో అధిక సంఖ్యలో విద్యార్థులను భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఈఓ భోజన్న, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ శ్యాముల్, ఎస్జిఎఫ్ సెక్రటరీ రవీందర్ గౌడ్, గిరిప్రసాద్, తదితరులు ఉన్నారు.



# పూర్తికాలం సీఎంగా సిద్దరామయ్యే

## ఊహాగానాలకు తెరదించిన డికె

బెంగళూరు,నవంబర్21(సమయజ్యోతి):

కర్ణాటక లో సిద్ధరామయ్య ను సీఎం పదవి నుంచి తొలగించి ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కు ఆ పదవిని కట్టబెట్టబోతున్నారనే ఊహాగానాలకు తెరపడినట్లే. కర్ణాటక కాంగ్రెస్కు చెందిన 10 మంది ఎమ్మెల్యేలు తాజాగా పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తో డిన్నర్లో పాల్గొనడం ఈ ఊహాగానాలకు తెరతీసింది. అయితే డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఈ డ్రామాకు తెరదించారు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్యేనని చెప్పారు. పూర్తికాలం ఆయనే సీఎంగా కొనసాగుతారని చెప్పారు. తామంతా ఆయనతో కలిసి పని చేస్తామని అన్నారు. ఖర్గేతో ఎమ్మెల్యేల సమావేశం గురించి ప్రశ్నించగా.. వాళ్లు పీసీసీ అధ్యక్ష పదవి, నాలుగైదు డిప్యూటీ సీఎం పదవులను కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ఇలాంటి మీటింగ్లు గత రెండున్నరేళ్లుగా కొనసాగుతున్నాయని డీకే చెప్పారు. ఇందులో కొత్తదనం ఏమీ లేదని అన్నారు. వాళ్లు ఇలాంటి మీటింగ్లు ఇంకా మరిన్ని పెట్టుకోనీయని వ్యాఖ్యానించారు.

# డొంకేశ్వర్ లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

## తహసీల్దార్ కార్యాలయం, రైతు వేదిక, కొనుగోలు కేంద్రం సందర్శన

సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్, నవంబర్ 21 :

డొంకేశ్వర్ మండల కేంద్రంలో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులపై ఒక్కో గ్రామం వారీగా రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్ష జరిపారు. వచ్చిన దరఖాస్తులలో ఆయా మాడ్యుల్స్ లో ఎన్ని అర్జీలు పరిష్కరించారు, ఎన్ని పెండింగ్ లో ఉన్నాయి, ఎంతమందికి నోటీసులు ఇచ్చారు, క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియకు అనుగుణంగా ఆన్ లైన్లో అన్ని అంశాలను అప్లోడ్ చేశారా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరించాలని అన్నారు. తిరస్కరణకు గురైన దరఖాస్తులకు సంబంధించి, స్పష్టమైన కారణాలను పేర్కొనాలని సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సన్నాహక ప్రక్రియను చేపడుతున్న తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. గడువు లోపు ఎస్.ఐ.ఆర్ పూర్తి చేయాలని అన్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ మంజూరీలపై ఆరా తీశారు. దరఖాస్తులు అందిన వెంటనే అర్హులైన వారిని గుర్తిస్తూ వెంటవెంటనే మంజూరీ జాబితాలు పంపాలని ఆదేశించారు. ఆధార్ అవసరం అయిన విద్యార్థులకు జనన ధృవీకరణ పత్రాలను సత్వరమే మంజూరు చేయాలని అన్నారు. అనంతరం కలెక్టర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యం సేకరణ తీరును పరిశీలించారు. ఇంకనూ పది శాతం వరకు వరి కోతలు మిగిలి ఉన్నాయని నిర్వాహకులు తెలుపగా, రైతులు ధాన్యం తెచ్చిన వెంటనే తూకం వేయించి మిల్లులకు తరలించాలని కలెక్టర్ సూచించారు. మిల్లుల వద్ద దొడ్డు రకం ధాన్యం సైతం సకాలంలో దిగుమతి చేసుకునేలా చూడాలని, ఒకవేళ ఎక్కడైనా అన్ లోడింగ్ చేసుకోకపోతే నేరుగా తన దృష్టికి తేవాలని కలెక్టర్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. రైతులు ఇబ్బందులు పడకుండా, సకాలంలో ట్రక్ షీట్లు తెప్పించుకుని ట్యాబ్ ఎంట్రీలు చేయించాలని, తద్వారా రైతుల ఖాతాలలో వెంటనే బిల్లులు జమ అవుతాయని అన్నారు. కాగా, రైతు వేదికను సందర్శించిన సందర్భంగా కలెక్టర్ స్థానిక రైతులతో భేటీ అయ్యారు. ధాన్యం అమ్మకాల విషయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురయ్యాయా అని ఆరా తీయగా, అలాంటిదేమీ లేదని ధాన్యం అమ్మకాలు సాఫీగా జరిగాయని రైతులు తెలిపారు. వరితో పోలిస్తే అధిక ఆదాయాన్ని అందించే ఆయిల్ పామ్ పంట సాగుపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగును ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందని గుర్తు చేశారు. రబీ సీజన్ కు సంబంధించి కూడా రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేలా ఇప్పటి నుండే ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ నరేష్ కుమార్, మండల వ్యవసాయ అధికారి మధుసూదన్ తదితరులు ఉన్నారు.



# సంపాదకీయం

## నక్సల్స్ ఏరివేతే కాదు...
### గిరిజనుల అభివృద్ధి ముఖ్యం !

కార్పొరేట్ల కన్ను అటవీ ప్రాంతాలపైన, కొండల కింద ఉన్న గనుల పైన పడటంతో గిరిజనులను అక్కడి నుండి వెళ్లగొట్టడానికి వివిధ పేర్లతో కుట్రలు జరుగుతున్నాయన్నది లెఫ్ట్ పార్టీల వాదనగా ఉంది. ఇది ఎంత వరకు నిజయమో తెలియాలి. ఇదే నిజమైతే దీనికి ప్రజాస్వామ్య పద్ధతిలో లెఫ్ట్ నేతలు కూడా పోరాటం చేపట్టాలి. ప్రజలను సమీకరించాలి. అడవులను నాశనం చేసేవారు ఎంతటి వారైనా నిలదీయాల్సిందే. అటవీ హక్కులను తిరస్కరిస్తున్నట్లుగా గుర్తిస్తే అందుకు ప్రజా ఉద్యమాలను నిర్వహించాలి. గిరిజనులతో నామమాత్రంగా కూడా చర్చించకుండానే పలు ప్రాజెక్టులను వారి నివాస ప్రాంతాల్లో చేపడుతున్నట్లుగా ఆరోపణలు చేస్తున్నారు. చట్ట ప్రకారం తప్పనిసరైన గ్రామసభలనుసైతం దాటవేస్తున్నారు. ఈ తరహా సర్కారీ దమనకాండపై అసంతృప్తిని, నిరసనను వ్యక్తం చేయడానికి కూడా అవకాశం ఇవ్వకుండా ఉక్కుపాదం మోపుతున్నారని అంటున్నారు. లెఫ్ట్ పార్టీలకు ఉద్యమాలు, పోరాటాలు కొత్త కాదు. ఇవే నిజమైతే ప్రజా ఉద్యమాలను నిర్మించాల్సిందే. కేంద్ర ప్రభుత్వం ప్రకటించినట్లుగానే తీవ్ర నిర్బంధ చర్యల ద్వారా మావోయిస్టులపై పై చేయి సాధించవచ్చు. కానీ, అణచివేతకు గురవుతున్న ప్రజానీకపు జీవన పరిస్థితుల్లో మార్పు రాకుంటే వారిలోని అసంతృప్తి మరోరూపం తీసుకోవచ్చు. ఇది ఒక సామాజిక ఆర్థిక సమస్య. క్షేత్రస్థాయిలో అసమానతలు రూపుమాపడమే దీనికి పరిష్కారం కావాలి. అలాగే గిరిజనులను పాలనలో భాగస్వాములను చేయాలి. వారి నివాస ప్రాంతాల్లో అభివృద్ధికి సంబంధించిన అంశాల్లో నిర్ణయాధికారం వారిదే కావాలి. విద్య, వైద్య సౌకర్యాలతో పాటు, ఉపాధిని పెద్ద ఎత్తున కల్పించాలి. దీంతో అడవుల్లో అన్నల అవసరం రాకపోవచ్చు. మావోయిస్టుల పేరుతోనో, వారి సానుభూతిపరుల పేరుతోనో గిరిజనులపై పోలీసుల వేధింపులను, నిర్బంధాన్ని తక్షణం నిలిపివేయాలి. ఇకపోత నక్సల్స్ ఏరివేత వెనక ఇదే పరమార్థం అని అంటున్నారు. నక్సల్స్ ఏరివేతతో అటవీ సంపద వినాశనాన్ని ముడిపెట్టరాదు. ఇవి రెండు కూడా వేర్వేరు అంశాలు. అందువల్ల మావోయిస్టులు ఏరివేతను అడవుల సంరక్షణతో పోల్చరాదు. అడవులను కార్పోరేట్లకు కట్టిపెడుతున్నారని ఖచ్చితమైన సమచారం ఉంటే ఎవ్వరైనా పోరాడవచ్చు. ఇకపోతే లొంగిపోవడానికి వచ్చిన నక్సల్స్ నేత హిడ్మాను, ఆన భార్య, ఇతర అనుచరులను మట్టుపెట్టారని, క్రెడిట్ దక్కించుకోవడానికే పోలీసులు ఈ పనిచేశారని వస్తున్న వార్తలపై పోలీసులే నిజాలు వెల్లడిస్తారని అనుకుంటే పోరపాటే. ఎందుకంటే ఖాకీ దుస్తులు వేసుకున్న తరవాత వారికి మానవత్వం అన్నది ఉండదు. నక్సలైట్ ఉద్యమంలో ఎందరో పోలీసులు అసువులు బాసారు. ఎందరో క్రూరంగా హత్యకు గురయ్యారు. మందుపాతరలకు బలయ్యారు. ఇవన్నీ వారు తప్పకుండా పరిగణలోకి తీసుకుంటారు. దీనికితోడు ప్రభుత్వం వారికి టార్గెట్లు విధించింది. అందువల్ల చిక్కిన అవకాశాన్ని వదులుకోరు. అందులోనూ నక్సల్స్ విషయంలో అస్సలు ఉండదు. మనం ఇక్కడ రెండు వైపులా ఆలోచన చేయాలి. నక్సల్స్ కూడా తమ ఉద్యమంలో కిరాతకంగా వ్యవహరించారు. చంపడంలో ఆరితేరారు. ఖతం చేయడమే వారి ఉద్యమంగా సాగింది. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు. మొత్తంగా నక్సల్స్ ఉద్యమంలో రెండువైపులా ప్రాణనష్టం జరిగింది. అమాయకులను ఎందరినో వారు పొట్టన పెట్టుకున్నారు. నేతలను బలితీసుకున్నారు. దీంతో వారు సాధించిందేమీ లేకపోగా, ఉద్యమం వల్ల దేశానికి తీవ్ర నష్టమే జరిగింది. అందుకే హిడ్మా లొంగిపోవడానికి వచ్చినా పట్టుకుని కాల్చేశారని అంటున్నారు. పోలీసులు అవకాశం కోసం చూస్తారు. అదను చూసి దెబ్బ తీస్తారు. ఇదంతా ఎలా ఉన్నా ఇరువైపులా హింస సరికాదు. నక్సల్స్ కూడా ప్రజల పక్షాన పోరాడడం మాని కేవలం అడవుల్లోనే ఉంటూ హింసాత్మక ఘటనలతో భీతావాహ పరిస్థితులను సృష్టించారు. నిజంగానే ఇప్పటికైనా నక్సల్స్ ఉంటే వారంతా జనజీవన స్రవంతిలోకి రావాలి. ప్రజల పక్షాన సమస్యలపై పోరాడాలి. ఇకపోతే అసలు ఆపరేషన్ కగార్ చేపట్టిందే హిడ్మా కోసమని, ఆయన కోసం డెడ్‌లైన్ కూడా పెట్టారని, ఆ గడువులోపలే పనిపూర్తయిందని మీడియాలో వస్తున్న కథనాలను చూస్తూనే ఉన్నాం. కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా కూడా పదేపదే మార్చి అంటూ టార్గెట్ పెడుతూనే ఉన్నారు. అందుకే తాజా రెండు ఎన్‌కౌంటర్లతో ఏం జరిగిందో అర్థం చేసుకోవచ్చు. భయోత్పాతం సృష్టించడమే లక్ష్యంగా జరిగే పోలీసు కనుసన్నల్లో జరిగే ఈ తరహా సంఘటనలు ఎంతమాత్రం సమర్థనీయం కాదని కొందరు అంటున్నారు. నక్స్‌కు మద్దతుగా నిలిచిన వారికి ఇది మారణహోమంగానే ఉంటుంది. అదే సందర్భంలో రాజకీయ నేతలను, పోలీసులను నక్సల్స్ అత్యంత కిరాతకంగా హత్య చేసిన పలు సందర్భాల్లో ఇప్పుడు విమర్శలు చేస్తున్నవారు ఏనాడూ స్పందించలేదు. నక్సల్స్‌కు భయపడి వీరంతా మిన్నకున్నారు. నిజానికి ఇటువంటి అప్రజాస్వామిక, హింసాత్మక విధానాలను ఎవరు అవలంబించినా ఖండించాల్సిందే. ఇకపోతే మరో నక్సల్ నాయకుడు తిప్పిరి తిరుపతి పోలీసుల అదుపులో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. అదే నిజమైతే పోలీసులు అదుపులోకి తీసుకున్న వారందరినీ తక్షణం న్యాయస్థానాల ముందు హాజరుపర్చాలి. ఇకపోతే రెండు రోజులుగా రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవల కాలంలో ఎన్నడూ లేని విధంగా వరుసగా జరుగుతున్న మావోయిస్టుల ఎన్‌కౌంటర్లు, అరెస్టులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఒక కుదుపు కుదిపాయి. ఎందుకంటే ఇటీవలి కాలంలో ఏపిలో నక్సల్స్‌ఉన్న జాడలేదు. అందుకే ఈ ఎన్‌కౌంటర్లపై సహజంగానే అనుమానాలు రవాడం సహజం. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీప్రాంతంలో మంగళవారం ఉదయం జరిగిన పోలీసు కాల్పుల్లో మావోయిస్టు పార్టీ అగ్రనేత హిడ్మా, ఆయన భార్య రాజక్కతో సహా ఆరుగురు మరణించారు. ఈ సంఘటన రేపిన కలకలం చల్లారకముందే, 24 గంటలలోపే బుధవారం ఉదయం దాదాపు అదే ప్రాంతంలో జరిగిన మరో ఘటనలో ఏడుగురు మావో యిస్టులు ప్రాణాలు నేలకొరిగారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వమే మావోయిస్టుల నిర్మూలన కార్యక్రమాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఆయుధాలతో సహా బేషరతుగా లొంగిపోవడం తప్ప మరో మార్గంలేదని సాక్షాత్తు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా పదేపదే ప్రకటించారు. ఆ హెచ్చరికల నేపథ్యంలోనే ఇవన్నీ సాగుతున్నాయని భావించాల్సిందే. ఆపరేషన్ కగార్ చేపట్టినతరువాత అంతా అయిపోయిందనుకుంటే పొరపాటు. అక్కడ నివసిస్తున్న గిరిజనుల సమస్యలు పరిష్కరించకుండా ముందుకు సాగితే పరిస్థితుల్లో మార్పు రాదని ప్రభుత్వాలు గుర్తించాలి.

# దేశాన్ని దోచుకుంటున్న మోదీ-అమిత్‌షా..!

### మతోన్మాద ఆరాచకానికి చెక్ పెట్టేది కమ్యూనిస్టులే
### జూలూరుపాడులోకి చేరుకున్న సీపీఐ బస్సు యాత్ర
### ఘన స్వాగతం పలికిన మండల కమ్యూనిస్టు నేతలు
### మతోన్మాదుల మెడలు వంచేది కమ్యూనిస్టులేనని నెల్లికంటి సత్యం, బాల నరసింహ పిలుపు





**జూలూరుపాడు నవంబరు 21సమయజ్యోతి**

దేశాన్ని దోచుకుంటున్న మోదీ–అమిత్‌షా జంటకు చెక్ పెట్టేది కమ్యూనిస్టులేనని సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాష్ట్ర నేత బాల నరసింహ స్పష్టం చేశారు. మతోన్మాదుల ఆరాచకానికి ప్రతిగా ఎర్ర జెండా మాత్రమే ప్రత్యామ్నాయమని అన్నారు .సీపీఐ శతవసంతాల ముగింపు సందర్భంగా ఈ నెల 26న ఖమ్మంలో జరగబోయే మహాసభకు రాష్ట్రవ్యాప్తంగా ఆకర్షణ కల్పించేందుకు గద్వాల నుంచి బయలుదేరిన బస్సు జాతా శుక్రవారం జూలూరుపాడు మండలం చేరుకుంది. సాయిబాబా ఆలయం వద్దకు చేరుకున్న జాతాకు మండల సీపీఐ నాయకత్వం ఎర్ర కండువాలు కప్పి ఘన స్వాగతం పలికింది. అక్కడి నుంచి అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీగా తీసుకెళ్లి నినాదాలతో ఊరంతా మార్మోగించారు.చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో నెల్లికంటి సత్యం మాట్లాడుతూ%8% అసెంబ్లీ ఎన్నికల వరుస ఫలితాల్లో ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ చతికిలపడిందని, బీజేపీ ఎదుట నిలబడే ధైర్యం కమ్యూనిస్టులకే ఉందని వ్యాఖ్యానించారు. దేశంలో నిరుద్యోగం ఉరకలు వేస్తోందని, ధరలు అదుపు తప్పిపోయాయని, రూపాయి పతనంతో ఆర్థిక వ్యవస్థ కుదేలైందని ఆయన దుయ్యబట్టారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు ఎడమ శక్తుల వైపు చూస్తున్నారని చెప్పారు.మావోయిస్టులు తుపాకీ గొట్టం మార్గం వదిలి ప్రజాస్వామ్య ఉద్యమాల్లో కమ్యూనిస్టులతో కలవాలని నెల్లికంటి సూచించారు. దేశవ్యాప్తంగా చీలిపోయిన కమ్యూనిస్టు శక్తులన్నీ ఏకం కావాల్సిన సమయం ఇదేనని పిలుపునిచ్చారు. విద్యార్థి, యువజన, మహిళా, కర్షక, కార్మిక, మేధావి వర్గాల కోసం సీపీఐ నిర్మించిన ప్రజాసంఘాలు నిరంతరం పోరాటం కొనసాగించాలని ఆయన దిశానిర్దేశం చేశారు.బూటకపు ఎన్‌కౌంటర్ల పేరిట మావోయిస్టులను కొట్టి చంపి బీజేపీ మానవ హననాలకి తెరలేపుతోందని ఆయన ఆరోపించారు. ఎన్కౌంటర్ పేరుతో జరుగుతున్న ఈ హత్యలపై ప్రజాస్వామ్యవాదులు రోడ్లపైకి రావాలని పిలుపునిచ్చారు. కమ్యూనిస్టు పార్టీ ఎన్నో త్యాగాలు చేసినట్లు, భవిష్యత్తులో బీజేపీ దుర్మార్గ రాజకీయాలను తిప్పికొట్టేందుకు మరింత త్యాగాలకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.జాతాకు నాయకత్వం వహిస్తున్న బాల నరసింహ మాట్లాడుతూ%8% నూరేళ్ల సీపీఐ అధికార కాంక్ష కోసం కాదు, ప్రజల సమస్యల పరిష్కారమే ఏకైక అజెండాగా ముందుకు సాగిందని అన్నారు. స్వార్థ రాజకీయాలు చేస్తున్న పార్టీల నుంచి ప్రజలు విసిగిపోయి, నిరంతరం ఉద్యమించే సీపీఐ వైపు మొగ్గుచూపుతున్నారని వ్యాఖ్యానించారు. చదువు పూర్తయ్యాక యువతకు ఉద్యోగాలు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, కానీ పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.కార్యక్రమంలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి తంద్రి సురేష్, వైరా ఇన్‌ఛార్జ్ ఎర్రబాబు, రాష్ట్ర సమితి సభ్యుడు చంద్ర నరేందర్, మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు, ఎల్లంకి మధు, షేక్ నాగుల మీరా, పొన్నగంటి వెంకటేశ్వర్లు, యాస రోశయ్య, కొండ వీరయ్య, గుడిమెట్ల సీతయ్య, కంచర్ల రాఘవేంద్రరావు, గొల్ల మల్లసామేలు, పసుపులేటి పవన్ తదితరులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా పాల్గొన్నారు.

# దిగజారుడు మాటలు సమంజసం కాదు

### రాజమౌళి వ్యాఖ్యలను ఖండించిన
### వి హెచ్ పి ప్రచార ప్రముఖ పగుడాకుల బాలస్వామి

**మక్తల్ నవంబర్ 21 సమయజ్యోతి**

రామబంటు ఆంజనేయుడి విషయంలో అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆస్కార్ అవార్డు విన్నర్. ప్రముఖ దర్శకుడు రాజమౌళి స్థాయిని మరిచి ప్రవర్తించారని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రచార ప్రముక్ పగుడాకుల బాలస్వామి ఆరోపించారు. తాను నాస్తికుడినని, దేవుడిపై విశ్వాసం లేదంటూనే ఆంజనేయస్వామి ప్రస్తావన తీసుకువచ్చి హిందుత్వాన్ని కించపరిచేలా మాట్లాడటం తో తన స్థాయిని తాను తగ్గించుకున్నాడని పేర్కొన్నారు.ఇటీవల వారణాసి సినిమా పేరు ప్రకటన సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆంజనేయస్వామిని విమర్శించినట్టు మాట్లాడి హిందువుల మనోభావాలను గాయపరిచారన్నారు. సినీరంగంలో అత్యున్నత అవార్డు ఆస్కార్ అందుకున్న వ్యక్తి..స్థాయిని మరిచి దిగజారి మాట్లాడటం సమంజసం కాదన్నారు. తన సినిమాలలో ధర్మం గురించి, భారతీయ ఇతిహాసాల గురించి, హిందూత్వం గురించి చూపించడం కేవలం డబ్బుల కోసమేనా అని ప్రశ్నించారు. సమాజంలో ప్రముఖమైన వ్యక్తులు తమను తాము మార్కెటింగ్ చేసుకోవడం కోసం హిందుత్వాన్ని విమర్శించడం ఫ్యాషన్ గా మారిపోయిందని బాలస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో ఘాటుగా స్పందించారు.ఆస్కార్ అవార్డు గెలుచుకున్న వ్యక్తి మాటలు చీఫ్ పబ్లిసిటీ కోసం ఉపయోగించడం చూస్తే ఆ వ్యక్తిపై జాలి వేస్తోందని ఎద్దేవా చేశారు. సమాజంలో పరపతి గల వ్యక్తులు హుందాగా వ్యవహరించాల్సింది పోయి, దిగజారుడు మాటలు మాట్లాడటం వారి అపరిపక్వతకు నిదర్శనమని విమర్శించారు. సినిమా పేరు విడుదల చేసే క్రమంలో టెక్నికల్ ఇష్యూ కు.. ఆంజనేయస్వామికి ముడి పెట్టడం రాజమౌళి అజ్ఞానాన్ని సూచిస్తుందని అన్నారు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, ఆంజనేయుడు, సీతామాత.. ఇలా దేవుళ్ళ పేరుతో సినిమాలు తీసి వ్యాపారం చేసుకునే వ్యక్తులు దేవుళ్ళని విమర్శిస్తూ, మార్కెటింగ్ చేసుకోవడాన్ని హిందూ సమాజం హర్షించదన్నారు. నాస్తికత్వం అంటే హిందూ దేవి దేవతలను అవమానించడం కాదు అనే విషయం రాజమౌళి గుర్తు చేసుకోవాలన్నారు. ఉన్నతమైన వ్యక్తులు కొన్ని విషయాలు నచ్చకపోయినా.. బహటంగా మాట్లాడకూడదు అని విచక్షణ లేని రాజమౌళి హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని బాలస్వామి డిమాండ్ చేశారు. రంగుల ప్రపంచంలో రాటు తేలుతున్న రాజమౌళి.. హిందూ దేవుళ్లను కేవలం ధన దాహానికి ఉపయోగించుకుంటున్నారని మండిపడ్డారు. భక్తి ముసుగులో హిందుత్వాన్ని తెరపై చూపించి సొమ్ము చేసుకోవడం సిగ్గుచేటు అన్నారు. ఆకాశంపై ఉమ్మి వేస్తే ఏం జరుగుతుందో. ఆంజనేయస్వామి విమర్శించిన రాజమౌళికి అదే జరుగుతుందని స్పందించారు. ఆంజనేయ స్వామి భక్తులకు, హిందూ సమాజానికి రాజమౌళి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



# అండర్ 19 విభాగంలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలోకి సర్గం మహేష్

### అభినందించిన పుడమి ఫౌండేషన్ చైర్మన్ వెంకటాపతిరాజు.



**మక్తల్ నవంబర్ 21సమయజ్యోతి**

చిన్నప్పటినుండి క్రికెట్ పై ఉన్నటువంటి మక్కువతో చురుకుగా వ్యాయామం చేయడంతో పాటు క్రికెట్లో అత్యున్నత ప్రతిఫలం కనపరచడం చూసి గౌడ్ ట్రైనింగ్ తీసుకొని రాష్ట్రస్థాయిలో అండర్ 19 క్రికెట్ కు సెలెక్ట్ కావడం జరిగింది. స్కాలర్ జూనియర్స్ కాలేజీలో చదువుకుంటూ ఆత్రుత ప్రతిభను కనపరిచిన మహేష్ ను పుడమి ఫౌండేషన్ చైర్మన్ వెంకటపతి రాజు శాలువాతో సన్మానించడం జరిగింది.. వెంకటపతి రాజు మాట్లాడుతూ పేద అట్టడుగు వర్గాల విద్యార్థులు విద్యారంగం తో పాటు క్రీడల్లో కూడా మంచి ప్రావిణ్యతను సాధించి అత్యున్నత స్థాయికి ఎదగాలని అన్నారు.. మక్తల్ పట్టణానికి చెందిన మహేష్ దేశానికే ప్రాతినిధ్యం వహించాలని ఆశిస్తూ, కష్టపడి మరింత ముందుకు వెళ్లాలని కోరారు. ఈ క్రమంలో మహేష్ కు పుడమి ఫౌండేషన్ వెన్నుదన్నుగా ఉంటుందని తెలియజేశారు.కార్యక్రమంలో పాల్గొన్నవారు.పుడమి ఫౌండేషన్ ఈసీ మెంబర్ ప్యాట పవన్ కళ్యాణ్. కడెచుర్ ఆంజనేయులు. శ్రీను. ఎల్లలింగ.తదితరులు పాల్గొన్నారు.

# 24 గంటల్లోనే దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ మండల కేంద్రంలో హరిహర ఎలక్ట్రానిక్స్ అండ్ ఎంటర్ ప్రైజెస్ దుకాణంలో గత మంగళవారం రాత్రి దొంగతనం ఘటన జరగగా, పోలీసులు 24 గంటల్లోనే కేసును చేదించడం విశేషం. ఈ మేరకు సీఐ శ్రీధర్ రెడ్డి పోలీస్ స్టేషన్ లో సమావేశం ఏర్పాటు చేసి ప్రకటన చేశారు. గ్రామంలోని సీసీ కెమెరాలు ఆధారంగా దర్యాప్తు చేయడం జరిగిందని, మరోసారి దొంగతనానికి ప్రయత్నిస్తుండగా నిందితులైన సుంకేట తేజ, మీసాల అజయ్ పట్టుకున్నట్లుగా పేర్కొన్నారు. దొంగలించిన సొత్తును 11 ఎలక్ట్రానిక్ ఐటమ్స్ రికవరీ చేసి వారిని ఆర్మూర్ కోర్టుకు రిమాండ్ చేసినట్లుగా వివరించారు. తేజ అనే వ్యక్తి గతంలోనూ దొంగతనాలు చేశాడని, దొంగతనానికి వినియోగించిన మీసాల అజయ్ వాహనాన్ని సీజ్ చేసినట్లుగా తెలిపారు. విలువైన సొత్తు దొంగతనం కాకుండా గ్రామాల్లో వ్యవసాయ రైతులు పనులకు వెళ్లే ముందు విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలనే లేదా తగిన జాగ్రత్తలు పాటించాలని, ప్రజలు సాధ్యమైనంత వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. దొంగతనం కేసును 24 గంటల్లో చేదించిన ఎస్ఐ కే శైలందర్ ను కానిస్టేబుల్ మహిపాల్, రమేష్, హెూమ్ గార్డ్ నవీన్ సిబ్బందిని సిపి అభినందించారు.





# ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కరువు...

## కృష్ణ నదిలో ఇసుక రీచ్ పాయింటును అధికారులు గుర్తించాలి...

## మాజీ సర్పంచ్ చెవిటోళ్ల అమ్రేష్

**సమయజ్యోతి న్యూస్ కృష్ణ.... నారాయణపేట జిల్లా**



మండలంలోని కృష్ణ నదిలో ఇసుక రీచ్ ను అధికారులు వెంటనే ప్రారంభించాలని మాజీ సర్పంచ్ అమ్రేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం అమ్రేష్ మాట్లాడుతూ మండల పరిధిలోని ఉన్న అన్ని గ్రామ పంచాయతిలకు ఇసుక అందాలంటే కృష్ణ నదికి రీచ్ పాయింట్ ను వెంటనే అధికారులు ప్రారంభించి అర్హులైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇసుక అందుబాటులో ఉంటేనే నిర్మాణ పనులు వేగవంతంగా జరగడానికి అవకాశం ఉంటుందని అన్నారు. అలాగే వివిధ గ్రామాల ప్రజలు పక్క మండలం నుండి దాదాపుగా ఇరవై కిలో మీటర్ల దూరం కావడం వలన పేద ప్రజలకు ఆర్థిక భారంగా మారుతుందని అధికారులు ఆలోచన చేసి మా కృష్ణ మండలంలో గతంలో ఉన్న మాదిరిగానే ఇప్పుడు కూడ అలాగే రీచ్ పాయింట్ ఏర్పాటు చేసి మండలం వ్యాప్తంగా ఇసుకను సరఫరా చేసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు వేగవంతంగా అవ్వడానికి అధికారులు సహకరించి మండలాన్ని మరింతగా అభివృద్ధిలో ముందుకు పోవడానికి కృషి చేయాలని బిఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

# సీతారామపురం కాలనీలో భూ ఆక్రమణలపై ఉక్కుపాదంఎమ్మెల్యే జిఎంఆర్ తీవ్ర ఆగ్రహం

**సమయజ్యోతి న్యూస్ రాంచంద్రాపురం**

పటాన్చెరు డివిజన్ పరిధిలోని సీతారామపురం కాలనీలో చోటు చేసుకుంటున్న భూ ఆక్రమణలపై పూర్తిస్థాయి సర్వే నిర్వహించి కబ్జాదారులపై ఉక్కుపాదం మోపుతామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు శుక్రవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిహెచ్ఎంసి రెవెన్యూ నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ రెండు దశాబ్దాల క్రితం పటాన్చెరు డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీతారామపురం కాలనీలో గత కొన్ని సంవత్సరాలుగా అంతర్గత రహదారులు పార్కులు ప్రార్థన స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయని స్థానికులు ఫిర్యాదులు చేశారని తెలిపారు కాలనీని ఏర్పాటు చేసిన డెవలపర్లు ప్రభుత్వానికి రిజిస్టర్ చేయవలసిన రహదారులు ప్రార్థన స్థలాలు పార్కుల స్థలాలను సైతం బై నెంబర్లు వేసి రిజిస్ట్రేషన్లు చేస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని తెలిపారు చివరకు కాలనీ సరిహద్దులలో గల చెరువులు కాలువలను సైతం ఆక్రమించి ప్లాట్లు అభివృద్ధి చేస్తున్నారని ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లారు 1998వ సంవత్సరంలో మొదటి లేఔట్ తో ప్రారంభించి నేటి వరకు మూడు లేవుట్లుగా తయారు చేయడ మైనదాని తెలిపారు రాబోయే రోజుల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తె అవకాశాలు ఉన్నందున పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి ఆక్రమణలపై ఉక్కు పాదం మోపాలని అధికారులను ఆదేశించారు కబ్జాలకు కారకులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని సూచించారు ఈ సమావేశంలో ఎమ్మార్వో రంగారావు జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్ నీటి పారుదల శాఖ డిఈ రామస్వామి తదితరులు పాల్గొన్నారు



# పిల్లల హక్కుల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి.

## రాష్ట్ర చైల్డ్ కమిషన్ చైర్పర్సన్ సీత దయాకర్ రెడ్డి

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

పిల్లల రక్షణ,భద్రత,విద్య,ఆరోగ్యం,సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్పర్సన్ సీత దయాకర్ రెడ్డి అన్నారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదిలాబాద్,నిర్మల్ జిల్లాల బాలల భద్రత,బాల్య వివాహాల నియంత్రణ,పాక్సో చట్టం అమలు,చైల్డ్ ప్రొటెక్షన్ వ్యవస్థపై అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషన్ చైర్పర్సన్ మాట్లాడుతూ,పిల్లలకు రక్షణ,విద్య,ఆరోగ్యం,గౌరవంతో జీవించే హక్కులు ఉన్నాయని,ఈ హక్కులను కాపాడటం ప్రభుత్వం మాత్రమే కాకుండా సమాజం మొత్తం పాలుపంచుకోవాల్సిన బాధ్యత ఉందని స్పష్టం చేశారు.జిల్లాలో ఇంకా బాల్య వివాహాలు నమోదవడం ఆందోళన కరమని పేర్కొన్న ఆమె,సమాచారం వచ్చిన వెంటనే తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు గ్రామస్థాయిలో పర్యవేక్షణ బలోపేతం చేయాలని,బాల్య వివాహ నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని సూచించారు.అలాగే హాస్టళ్లు,ఆశ్రమాలు, పాఠశాలల్లో పిల్లలపై వేధింపులు, దుర్వినియోగం, నిర్లక్ష్యంపై జీరో టాలరెన్స్ విధానంతో వ్యవహరించాలని సూచించారు.స్మార్ట్ ఫోన్లు,సోషల్ మీడియా వినియోగం పెరిగిన నేపథ్యంలో పిల్లలు సైబర్ మోసాలు,అనారోగ్యకర ఆన్లైన్ గేమ్స్ ప్రభావానికి గురవుతున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ఆన్లైన్ ప్రవర్తనను గమనించాలని,వారు ఏ యాప్స్ వాడుతున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు అనే అంశాలపై అవగాహన తప్పనిసరి అని సూచించారు.బాలల అత్యవసర సమస్యల



పరిష్కారానికి చైల్డ్లైన్ 1098 సేవలను ప్రజలు విస్తృతంగా వినియోగించుకోవాలని కోరారు.పాక్సో చట్టం అమలు,బాల కార్మిక నిర్మూలన,సీపీఎస్ బలోపేతంపై అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ,జిల్లాలో చిన్నారుల రక్షణకు సమగ్ర చర్యలు చేపడుతున్నట్టుగా తెలిపారు.ఆపరేషన్ స్మైల్,ఆపరేషన్ ముస్కాన్ ద్వారా ఇప్పటి వరకు మొత్తం 354 మంది చిన్నారులను గుర్తించి,డ్రాప్అవుట్ పిల్లలను బడిలో చేర్పించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు.షీ టీమ్,భరోసా సెంటర్,ఆరోగ్య పాఠశాల కార్యక్రమం ద్వారా కళాజాత బృందాల సహాయంతో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.జిల్లాలో బాల్య వివాహాల నియంత్రణ కోసం పటిష్ట చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.ఇప్పటి వరకు 83 పాక్సో కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.బడిబాట ప్రోగ్రాం కింద కెజీబీవీలు,పాఠశాలలు,భవిత కేంద్రాల్లో మరుగుదొడ్లు,భవనాలు,పెయింటింగ్ వంటి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. 70 శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరుగుతున్నాయని,వైద్య సేవల నాణ్యతను మరింత పెంచే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని కలెక్టర్ వివరించారు. విద్య,ఆరోగ్య విభాగాల పురోగతిని ఈ సందర్భంగా కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తర్వాత నిర్మల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్,ఇంఛార్జి జిల్లా సంక్షేమ అధికారి ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ,జిల్లాలో 31 సెక్టర్లలో 931 అంగన్వాడీలు, 0%-%6 ఏళ్ల పిల్లలకు సేవలు అందిస్తున్నాయని తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ ద్వారా 57 కేసులు నమోదు చేసి విచారణ జరిపామని తెలిపారు.డ్రాప్అవుట్ పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించడం జరిగిందని అన్నారు.2023 నుంచి ఇప్పటివరకు 44 బాల్య వివాహ కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.120 పొక్సో కేసుల్లో పరిహారం అందించడం జరిగిందని అన్నారు.పాఠశాలల్లో గుడ్ టచ్,బ్యాడ్ టచ్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, కళాజాత బృందాల ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నామని తెలిపారు.బాల కార్మికులను పనిలో పెట్టుకున్నవారిపై కేసులు నమోదు చేశామని,రక్షిత వాతావరణం కల్పించి బాల కార్మికులను పాఠశాలల్లో చేర్పించామన్నారు.గ్రామాల్లో బాల్య వివాహ నిరోధక కమిటీలు ఏర్పాటు చేసి,బాల్య వివాహాల పరిణామాలపై వాల్ పెయింటింగ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.జిల్లాలో బలశక్తి,అమ్మ రక్షిత కార్యక్రమాల పురోగతిని వివరించారు. అనంతరం కమిషన్ చైర్ పర్సన్,సభ్యులను శాలువా,జ్ఞాపికలతో కలెక్టర్ సత్కరించారు.అంతకుముందు పట్టణ కేజీబీవి,రిక్షా కాలనీ లోని అంగన్వాడీ కేంద్రాన్ని బాలల కమిషన్ బృందం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేసారు.ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు వందన గౌడ్,అపర్ణ,సరిత,ప్రేమలత,వచన్ కుమార్,ఆదిలాబాద్,నిర్మల్ ఏఎస్పీ లు సురేందర్ రావు,అవినాష్ కుమార్,జిల్లా సంక్షేమ అధికారి మిల్కా,డిఎమ్ అండ్ ఎచ్,ఓ రాథోడ్ నరేందర్,నిర్మల్ డిఇఓ బోజన్న,ప్రోగ్రాం కోర్డినేటర్ డా.సౌమ్య, విద్యా,సంక్షేమ,వైద్యారోగ్య,పోలీస్,శాఖల అధికారులు, సీడబ్ల్యూసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కబడ్డీ క్రీడలను ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

పటాన్చెరు మండల పరిధిలోని భానూరు గ్రామంలో ఆర్కే స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అండర్ 14 అండర్ 17 కబడ్డీ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ పటాన్చెరు నియోజకవర్గంలో క్రీడల అభివృద్ధికి ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు వివిధ క్రీడా పోటీల్లో జిల్లా రాష్ట్ర జాతీయ స్థాయి పోటీలకు వేదికగా నిలుస్తూ క్రీడాకారులకు అండగా ఉంటున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో సిఐ విజయ్ కృష్ణ సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి వెంకట్ రెడ్డి గోపాల్ కార్యక్రమ నిర్వాహకులు రామకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



# చీరలు పంపిణీ చేసిన కార్పొరేటర్ పుష్పానగేష్

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

శుక్రవారం రామచంద్రాపురం డివిజన్ శ్రీనివాస్ నగర్ కాలనీ మండల్ ప్రైమరీ హెల్త్ సెంటర్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆశావర్కర్ లకు ఏర్పాటు చేసిన చీరల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు రామచంద్రాపురం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేష్ వారికి చీరలను పంపిణీ చేశారు వారితో సహచర కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి డాక్టర్ కల్పన ఆశా వర్కర్స్ దవాఖానా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# పట్టణంలో జిల్లా అధ్యక్షురాలు సురేఖమ్మ జన్మదిన వేడుక

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి మందమర్రి**

పట్టణంలో మంచిర్యాల జిల్లా డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు జన్మదిన వేడుకలను పీసీసీ మెంబర్ నూకల రమేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల, ప్రజల మధ్య కేక్ కట్ చేసి స్వీట్ పంచుతూ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూకల రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి సురేఖమ్మ ఎనలేని సేవలు చేశారాని జిల్లాలో మూడు నియోజకవర్గాలను అత్యధిక మెజారిటీతో కైవసం చేసుకున్నారని, దీనికి సురేఖమ్మ చేసిన కృషి చాలా ఉందన్నారు. భారత్ జోడో యాత్ర, ఆజాద్ కి గౌరవ్ యాత్ర, రాజీవ్ సద్భావన యాత్ర వంటి యాత్రలో జిల్లాలో వందల కిలోమీటర్లు పాదయాత్ర చేసి పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారని అన్నారు. కార్యకర్తలను కాపాడుకుంటూ, పేద బడుగు బలహీనవర్గాల కోసం అహర్నిశలు కృషి చేసే సురేఖమ్మ భవిష్యత్తులో ఉన్నత పదవులు అవలంబించాలని ఈ సందర్భంగా కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎండి ముజాహిద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిద్ధం జనార్ధన్, సీనియర్ జిల్లా నాయకులు నర్సోజీ, యువజన కాంగ్రెస్ నాయకులు నరేందర్, రంజిత్, నవీన్, కిరణ్, సతీష్, సురేష్, అనిరుద్, సంతోష్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# నేడు ఆత్మకూరు కు రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి రాక.



**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆత్మకూరు వనపర్తి జిల్లా.**

రాష్ట్ర పాడి పరిశ్రమల మత్స్య, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి శనివారం ఉదయం 11 గంటలకు ఆత్మకూరు మండల కేంద్రం లోని దయాలసిస్ సెంటర్ ను, ఓపెన్ జిమ్ సెంటర్ ను ప్రారంభిస్తారు. అనంతరం బాలకృష్ణాపూర్ గ్రామంలో మహిళలకు ఇందిరమ్మ చీరలను మంత్రి పంపిణీ చేస్తారని ఆత్మకూరు మార్కెట్ చైర్మన్ ఎం.డి. రహమతుల్లా ఒక ప్రకటనలో తెలిపారు.

# వసతి గృహం విద్యార్థులకు కేటీఆర్ దుప్పట్లు పంపిణీ

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలము పోతుగల్ ఎస్సీ వసతి గృహంలో శుక్రవారం 62 మంది విద్యార్థులకు కేటీఆర్ వితరణ చేసిన దుప్పట్లు క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులు కార్యకర్తలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బి సురేందర్ రావు, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, ఎఎంసీ మాజీ చైర్మన్ ఏ శ్రీనివాసు, నాయకులు నరసింహారెడ్డి, నల్ల నరసయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.




# నూతన బోర్వెల్ ప్రారంభించిన కార్పొరేటర్ పుష్పానగేష్

సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం

డివిజన్ లో ఎక్కడ లోపాలు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రతి కాలనీ లో సమస్యలు స్వయంగా తెలుసుకుని పరిష్కరిస్తున్న రామచంద్రాపురం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేష్ శుక్రవారం రామచంద్రాపురం డివిజన్ శ్రీ సాయి నగర్ కాలనీ లో నూతన బోర్వెల్ ప్రారంభించారు కాలనీ కమ్యూనిటీ హాల్ టాయిలెట్స్ ట్రాన్స్ఫార్మర్ శంకుస్థాపన కార్యక్రమన్ని పెద్ద ఎత్తున జరిపారు కాలనీ అధ్యక్షులు వీర్శెట్టి ఆధ్వర్యంలో కాలనీ వాసులతో మహిళామణులతో కలిసి మంగళహారతులతో పూలమాలలతో కార్పొరేటర్ కు స్వాగతం పలికారు అనంతరం కాలనీ వాసులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొన్నారు అనంతరం కాలనీ అధ్యక్ష కార్యవర్గ సభ్యులు కాలనీ సమస్యల పై వినతిపత్రం ఇచ్చారు తమ కాలనీ సమస్యలు అడిగి తెలుసుకొని సమస్యలను పరిష్కరిస్తున్నందుకు కాలనీ వాసులు మహిళలు కార్పొరేటర్ కు ఎంతగానో కృతజ్ఞత వ్యక్తం చేస్తూ కార్పొరేటర్ ను ఘనంగా సన్మానించారు వారితో ఏఈ దివ్య గోవర్ధన్ రెడ్డి బ్రహ్మరాజు భాస్కర్ నాగేశ్వర్ రావు శంకర్ నాగరాజు చంద్రమౌళి రెడ్డి సురేష్ మాధవి చంపావతి అనిత అనసూయ విజయ సుజాత లత తదితరులు పాల్గొన్నారు



# కలెక్టర్ కు శుభాకాంక్షలు తెలియజేసిన ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

సమయ జ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో నవంబర్ 21.

జలసంచాయ్- జనభాగీదారీ అవార్డును జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఇటీవలి న్యూఢిల్లీలో కేంద్ర జల శక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ చేతుల మీదుగా స్వీకరించినందున, శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్లోని తన చాంబర్లో ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. జిల్లాకు ప్రతిష్టాత్మకమైన అవార్డు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. డిఆర్డిఓ విజయలక్ష్మిని ఎమ్మెల్యే సన్మానించి, అభినందించారు. అంతకుముందు పలువురు ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు కలెక్టర్ ను సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ%ొ%జిల్లాకు ప్రతిష్టాత్మక అవార్డు రావడంలో అధికారుల కృషి విలువైనదని అన్నారు. ముమ్ముందు రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తూ జిల్లా జాతిని మరింత నిలిపేలా తోడ్పాటును అందించాలని తెలిపారు.



# తెలంగాణ ఆర్య వైశ్య కార్పొరేషన్ నిర్మల్ జిల్లా ఇన్‌చార్జ్‌గా పి.విగ్న్య తేజ నియామకం




సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో నవంబర్ 21.

నిర్మల్ పట్టణానికి చెందిన పి. విగ్న్య తేజ తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ నిర్మల్ జిల్లా ఇన్‌చార్జ్‌గా అధికారికంగా నియమితులయ్యారు. ఈ నియామక పత్రాన్ని హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వా సుజాత గుప్తా ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన విగ్న్య తేజ, తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఆర్య వైశ్య సమాజానికి సమర్థవంతంగా చేరుకునేలా కృతనిశ్చయంతో పనిచేస్తానని తెలిపారు. సమాజ అభివృద్ధి కార్యక్రమాలను బలోపేతం చేయడంతో పాటు, సాగుతున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను విస్తరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# కొనుగోలు కేంద్రాల్లో లారీలు అందుబాటులో ఉండాలి: అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తరలింపుకు అవసరమైన లారీలను అందుబాటులో ఉండాలని కాంట్రాక్టర్లను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలంలోని తాడూర్, పాపయ్యపల్లి, ఓబులాపూర్, సారంపల్లి, రాళ్లపేట, కస్బేకట్కూర్, చీర్లవంచ ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. ముందుగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు, వసతులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ధాన్యం తేమ శాతం, కొనుగోళ్లను పరిశీలించారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కనీస వసతులు కల్పించాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహ కులను ఆదేశించారు. పరిశీలనలో తహసీల్దార్ జయంత్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు



# అంబేద్కర్ కళాభవన్ లో ఉర్దూ ఘర్ నిర్మాణం చేయరాదని ఎస్సీ జాతీయ కమిషన్ కు ఫిర్యాదు.

## అంబేద్కర్ జాతర కమిటీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు రాయకంటి రాందాస్ మాదిగ.

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి మహబూబ్ నగర్ జిల్లా.

మహబూబ్ నగర్ మండలం. మహబూబ్నగర్ మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో జిల్లా కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కళాభవన్ ఖాళీ స్థలంలో ఉర్దూగర్ నిర్మాణం కై 15 కోట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించిందని మైనార్టీ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ అభ్యర్థుల కొత్వాల్, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యొన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ కుల సంఘాల సమైక్య కార్యచరణ లేని నకిలీ సంఘంతో మమేకమై వారికి అంబేద్కర్ భవనం ఖాళీ స్థలంలో రాష్ట్ర కార్యాలయం షెడ్డు నిర్మానించుకోవడానికి మున్సిపల్ కమిషనర్ అనుమతితో స్థలాన్ని పరిశీలించారు. ఎవరి స్థలం ఎవరికిస్తున్నారు. అంబేద్కర్ కళాభవన్ స్థలంలో మైనార్టీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ప్రీ మెట్రిక్ హాస్టల్ బాయ్స్ ఇరిగేషన్, ఐబి నక్ష ప్లాన్ ను సవరించి అధికారులు, రాజకీయ నాయకుల ఒత్తిడికి తలొగ్గి స్థలాన్ని ఆక్రమించేలా 2011 సంవత్సరంలో షాదిఖానగా మారప్పుడు చేసి ఇప్పుడు ఉర్దూగర్ నిర్మాణంతో ఒక మతానికి సంబంధించిన నిర్మాణాన్ని చేయడానికి జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. దీనిని దళిత బహుజన సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. అంబేద్కర్ కళాభవన ఆవరణలో మతపరమైన నిర్మాణాలు మతపరమైన నిర్మాణాలు చేపట్టకుండా సమసమాజ నిర్మాణాలు విద్యాపరమైన కల ప్రదర్శన భవనాలు ఉండాలి. అంబేద్కర్ కళాభవన్ నుండి ఎంట్రీ ఉంది కాబట్టి భవిష్యత్తులో మతపరమైన ఘర్షణలకు దారితీస్తుందని అన్నారు. అంబేద్కర్ కళాభవన్ ఎదురుగనే వర్క్అంబేద్కర్ కళాభవన్ ఎదురుగనే వక్ఫ్ బోర్డ్ భూములు ఉన్నాయి కనుక అక్కడే ఉర్దూగర్ నిర్మాణం చేయాలని మా విన్నపం. జిల్లా కలెక్టర్ జిల్లా, సంబంధిత అధికారులు దళిత సంఘాలను మానసికంగా గురిచేస్తున్నాయి. వినతి పత్రాల ద్వారా 1. అక్యూ పేషన్ సర్టిఫికేట్ 1994 -1995, 2. ప్రొసీడింగ్ కాపీ, అవార్డు కాపీలను దళిత బహుజన సంఘాలు కోరితే ప్రభుత్వ అధికారులు ద్వంద వైఖరిని అవలంబిస్తున్నారు. మా దగ్గర ఎలాంటి పత్రాలు లేవని దాటవేస్తున్నారు. జిల్లా కలెక్టర్ కూడా తమ బాధ్యతను విస్మరిస్తున్నారు. 1994 సంవత్సరంలో అప్పటి జిల్లా కలెక్టర్ రైమాండ్ పీటర్ ఇరిగేషన్ ఐబి వారి దగ్గర అంబేద్కర్ కళాభవన్ జిల్లా కేంద్రంలో మహబూబ్ నగర్ లో ఎడ్యుకేషన్ పర్పస్ కోసం స్థలంను కేటాయించడం జరిగింది. పి. చంద్రశేఖర్ ఎమ్మెల్యే 1995లో అంబేద్కర్ కళాభవన్ స్థలంలో పి చంద్రశేఖర్ ఎమ్మెల్యే చే తేదీ 30 డిసెంబర్19 95లో కలెక్టర్ రైమండ్ పీటర్ తో ఫౌండేషన్ వేయించడం జరిగింది. 1998 సంవత్సరంలో జిల్లా కలెక్టర్ జి. కృష్ణయ్య ఒకరికి ఇచ్చిన స్థలంలో ఇంకొకరికి ఎలా ఇస్తారు? ఐబీ లో ఎక్కువ స్థలం ఉందనుకొని ఇచ్చినారేమని దీనికి సూత్రధారి ఒబేదుల్లా కొత్వాల్. పేద పిల్లలు, తల్లిదండ్రులేని పిల్లల హాస్టల్ కోసం కేటాయించిన స్థలంలో షాదిఖానాకు అనుమతులు ఎవరిచ్చారని వారు ప్రశ్నించారు. ఇప్పుడు ఉర్దూగర్ ఒక మతానికి సంబంధించిన నిర్మాణం ఎట్లా అవుతుంది. అంబేద్కర్ కళాభవనంలో సమావేశాలు జరిగే సమయంలో వచ్చే వాహనంలో తో ప్రజలకు ఇబ్బందికరంగా ఉంటుంది. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని మెయిన్ రోడ్డుకు వక్ఫ్ భూములు ఉన్నవి అక్కడ ఉర్దూగర్ నిర్మించుకోవచ్చని అన్నారు. 2002 సంవత్సరంలో జిల్లా కలెక్టర్ కె. మధుసూదన్ రావు అంబేద్కర్ కళాభవనంను తేది 07- ఆగస్టు2002 రోజున ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులమీదుగా అంబేద్కర్ కళాభవన్ ప్రారంభించడం జరిగిందని అన్నారు. అంబేద్కర్ కళాభవనం స్థలంలో ఉర్దూగర్ నిర్మాణ పనులు చేపట్టారాదని ప్రజా ప్రతినిధులకు, వివిధ రాజకీయ పార్టీల రాష్ట్ర నాయకులకు వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది. అయినా మాకు సరైన న్యాయం జరగలేదు అందుకే అంబేద్కర్ కళాభవనం విషయంలో మీ ద్వారా మాకు చట్టపరంగానే న్యాయం జరగాలని కోరుతున్నాం. అవసరమైతే ఎస్సీ జాతీయ



కమిషన్ సభ్యులు క్షేత్రస్థాయిలో అంబేద్కర్ కళాభవన్ పర్యవేక్షించాలని కోరారు. అంబేద్కర్ కళాభవన్ స్థలంలో ఉర్దూగర్ నిర్మాణ పనులు నిలిపి వేయాలని కోరుతూ ఎస్సీ జాతీయ కమిషన్ కు శుక్రవారం పిర్యాదు చేయడం జరిగింది.



# రైతుల ఖాతాలో సన్నవడ్ల బోనస్.. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి వనపర్తి జిల్లా

సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ధాన్యం విక్రయించిన రైతులకు సన్నవడ్ల 500 బోనస్ డబ్బులు శుక్రవారం విడుదల చేసిందని జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల శ్రీనివాసరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

# పాఠశాలకు జలశుద్ధి యంత్రం వితరణ



సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడెం వాస్తవ్యులు చిట్నేని మాధవి వెంకటేశ్వరరావు, మోహినికుంట ప్రాథమిక పాఠశాలకు జలశుద్ధి యంత్రాన్ని వితరణ చేశారు. దాత ఉదారతను కొనియాడుతూ ఉపాధ్యాయ బృందం, వెంకటేశ్వరరావును సన్మానించింది. ఈ సందర్భంగా నాయకులు కల్వకుంట్ల గోపాలరావు, విద్యాసాగర్ రావు, చిట్నేని ఆంజనేయరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# డిఆర్ డిఏ పిడి సాయా గౌడ్, ఏపిఓ లకు జాతీయ అవార్డుల ప్రధానం

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

హైదరాబాదులో శుక్రవారం ఉత్తమ స్వయం సహాయక సంఘాల తోపాటు ఆయా సంఘాలను దిశా నిర్దేశం చేసిన డిఆర్డిఏ పిడి, ఏపీఓలకు జాతీయ పురస్కారాలు అందజేసి అభినందించారు. ఈ నేపథ్యంలోనే సీఈవో సి.యస్.రెడ్డి, ఆర్థిక ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షులు జి చిన్నారెడ్డి చేతులమీదుగా డిఆర్డిఏ పిడి సాయా గౌడ్ ను, గతంలో ఆర్మూర్ మండలంలో పనిచేసిన ఏపీఎం గంగారాం (బాల్కొండ)కు పురస్కారాలు అందజేసి వారి సేవలను అభినందించారు.



# అంతరిక్ష ప్రయాణమే సులువు

## బెంగళూరు రోడ్లు, ట్రాఫిక్‌పై శుభాంశు శుక్లా వ్యాఖ్యలు

### వైరల్‌లగా మారి నెట్టింటో పెద్ద ఎత్తు చర్చ

**బెంగళూరు,నవంబర్21(సమయజ్యోతి):**

బెంగళూరులో రోడ్ల దుస్థితి , ట్రాఫిక్ సమస్యలపై విమర్శల వర్షం కొనసాగుతూనే ఉన్నది. బయోకాన్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా, ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో మోహన్‌దాస్ వంటి ప్రముఖులు కూడా ఈ సమస్యలను లేవనెత్తారు. ఇక ఆన్‌లైన్ ట్రక్కింగ్ స్టార్టప్ బ్లాక్‌బక్ సీఈవో రాజేశ్ యాబాజీ ఏకంగా తమ ఆఫీస్‌ను బెంగళూరు నుంచి మార్చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ జాబితాలో వ్యోమగామి శు భాన్షు శుక్లా కూడా చేరారు. అంతరిక్షంలో ప్రయాణించ డమే తేలిక..అంటూ బెంగళూరు ట్రాఫిక్‌పై వ్యోమగామి శుభాన్షు శుక్లా కామెంట్ చేశారు. అంతరిక్షయానంపై తాను చేసే ప్రసంగ సమయంతో పోలిస్తే బెంగళూరు రహదారులపై ప్రయాణం మూడు రెట్లు అధికమని వ్యోమగామి శుభాన్షు శుక్లా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారయి. గురువారం బెంగళూరు టెక్నాలజీ సమ్మిట్ లో 'ఫ్యూచర్ మేకర్స్ కాంక్లేవ్'కు హాజరయ్యే క్రమంలో మారతహళ్లి నుంచి మూడు గంటలపాటు ప్రయాణం చేయాల్సి వచ్చిందని శుక్లా పేర్కొన్నారు. ఇందులో మూడో వంతు సమయంలోనే తాను ప్రసంగాన్ని పూర్తి చేశానన్నారు. గత జూన్‌లో 'యాగ్జియం మిషన్' ద్వారా చేపట్టిన అంతరిక్ష ప్రయాణంపై ఆయన మాట్లాడుతూ అంతరిక్షంలో అడుగుపెట్టాక మన గుండెపై మోటారు వాహనం ప్రయాణించినట్లు ఉంటుందన్నారు. అక్కడి పరిస్థితులకు అలవాటు పడేందుకు కనీసం వారం రోజులు పడుతుందని వివరించారు. భూమికి వచ్చాక రెండు వారాలపాటు మన శరీరం అదుపు తప్పే ఉంటుందని తన అనుభవాన్ని వివరించారు. ఈ ప్రయాణం భారతీయ అంతరిక్ష విజయానికి ప్రతీక అని తెలిశాక గర్వంగా ఉందన్నారు. మనకు, మన అంతరిక్ష ప్రగతికి హద్దుల్లేవని ప్రకటించారు. అంతరిక్షం నుంచి భారతదేశం ఎలా కనపడుతుందో శుభాన్షు వీడియో రూపంలో చూపారు. ఈ సందర్భంగా ఆయన బెంగళూరు రోడ్లు, ట్రాఫిక్ సమస్యపైనా చేసిన కామెంట్స్ వైరల్‌గా మారాయి. దేశ ఐటీ రాజధానిలో జరిగిన బెంగళూరు టెక్నాలజీ సమ్మిట్ లో 'ఫ్యూచర్ మేకర్స్ కాంక్లేవ్'కు శు భాన్షు శుక్లా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు తాను మారతహళ్లి నుంచి ఎగ్జిబిషన్ సెంటర్‌కు మూడు గంటలు ప్రయాణం చేయాల్సి వచ్చింది. ఇందులో మూడో వంతు సమయంలో నే తాను ప్రసంగాన్ని పూర్తి చేశానంటూ వ్యాఖ్యానించారు. మారతహళ్లి నుంచి బీఈఎస్ వేదిక అయిన బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్‌కు మధ్య 34 కిలోమీటర్ల దూరం ఉంటుంది. సాధారణంగా ఒక గంటలో ప్రయాణించవచ్చు.

# బంగ్లాదేశ్‌లో భూ ప్రకంపనలు

## కోల్‌కతా పరిసరాల్లోనూ ప్రభావం

**ఢాకా,నవంబర్21(సమయజ్యోతి):**

పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో భారీ భూప్రకంపనలు సంభవించాయి. రిక్టర్ స్కేలుపై భూప్రకంపనల తీవ్రత 5.2 మాగ్నిట్యూడ్‌గా నమోదు అయింది. శుక్రవారం ఉదయం 10 గంటల 8 నిమిషాల ప్రాంతంలో ఘోరాశల్ దగ్గర భూప్రకంపనలు సంభవించాయి. యునైటెడ స్టేట్స్ జియోలాజికల్ సర్వే ప్రకారం.. నార్సింగ్డికి 14 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉంది. ఇక, బంగ్లాదేశ్‌లో భూకంపం రావటంతో కోల్‌కతాతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో భూమి స్వల్పంగా కంపించింది. ఇళ్లలోని ఫ్యాన్లతో పాటు ఇతర వస్తువులు అటు, ఇటు ఊగాయి. దీంతో జనం భయపడిపోయారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. పెద్ద సంఖ్యలో జనం వీధుల్లోకి వచ్చి చేరారు. అయితే, భూ ప్రకంపనల కారణంగా ఎవరైనా చనిపోయారా? లేక గాయాలు అయ్యాయా? అన్న దానిపై ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. భూ ప్రకంపనలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియ రావాల్సి ఉంది.బంగ్లాదేశ్‌లో భూ ప్రకంపనలకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఓ వీడియోలో ఢాకాలోని బద్దా లింక్ రోడ్ ఏరియాలోని ప్రజలు పెద్ద సంఖ్యలో వీధిలోకి వచ్చి నిలబడ్డారు. పక్కన ఉన్న అపార్ట్‌మెంట్స్ స్వల్పంగా కంపిస్తూ ఉన్నాయి. జనం భయంభయంగా అటు, ఇటు చూస్తూ ఉన్నారు. కొంతమంది వాటిని వీడియో తీస్తూ ఉన్నారు.

# అల్ ఫలా యూనివర్శిటీ కార్యకలాపాలపై నిఘా

## ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ ఏర్పాటు చేస్తూ ఆదేశం

**న్యూఢిల్లీ,నవంబర్21(సమయజ్యోతి):**

అల్ ఫలా యూనివర్శిటీ కార్యకలాపాలపై నిఘా కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్)ను ఏర్పాటు చేసినట్లు ఫరీదాబాద్ పోలీసులు శుక్రవారం తెలిపారు. ఇద్దరు అసిస్టెంట్ కమిషనర్స్ ఆఫ్ పోలీస్, ఇన్‌స్పెక్టర్ మరియు ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లతో కూడిన సిట్‌యూనివర్శిటీ కార్యకలాపాలపై సమగ్ర నివేదికను రూపొందిస్తోందని అన్నారు. ఫరీదాబాద్‌లోని అల్ ఫలా యూనివర్శిటీ వ్యవహారాలను దర్యాప్తు చేయడానికి సిట్‌ను ఏర్పాటు చేశామని, అన్ని అంశాలను పరిశీలిస్తున్నామని ఫరీదాబాద్ పోలీస్ ప్రతినిధి తెలిపారు. ఈ కేసుకు సంబంధించి యూనివర్శిటీకి చెందిన పలువురు వైద్యులను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.ర్యాప్తు సంస్థలు క్యాబ్ డ్రైవర్, మతాధికారి, ఉర్దూ ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. క్యాబ్ డ్రైవర్ ధౌజ్ గ్రామానికి చెందినవారు కాగా, మిగిలిన ఇద్దరు నుహ్ జిల్లాకు చెందిన వారని పేర్కొన్నాయి. సోహ్నా సమీపంలోని రాయ్‌పూర్ గ్రామంలోని షాహిజామా మసీదు నుండి వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి.

# ఎన్‌కౌంటర్లపై మావోల ఆగ్రహం

## 23న భారత్ బంద్‌కు పిలుపు

### అధికార ప్రతినిధి అభయ్ పేరిట లేఖ విడుదల

**రాయపూర్,నవంబర్21(సమయజ్యోతి):**

మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, ఆ పార్టీ అగ్రనేత హిడ్మాతో పాటు పలువురిని పోలీసులు క్రూరంగా హత్య చేసి ఎన్‌కౌంటర్‌గా చిత్రీకరించారంటూ మావోయిస్టు పార్టీ ఆరోపించింది. అందుకు నిరసనగా నవంబర్ 23వ తేదీన భారత్ బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ మేరకు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట శుక్రవారం లేఖ విడుదల చేసింది. పోలీసుల క్రూర హత్యకు నిరసనగా దేశవ్యాప్తంగా బంద్‌కు పిలుపు ఇచ్చినట్లు వివరించింది.నవంబర్ 18వ తేదీ ఉదయం అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం అటవీ ప్రాంతం సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హిడ్మా, ఆయన భార్య రాజేతోపాటు పలువురు మావోయిస్టులు మృతి చెందారు. వారి మృతదేహాలకు రంప చోడవరం ఏరియా ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించి.. ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లాలోని పువ్వర్తి గ్రామానికి తరలించారు. ఈ మృతదేహాలకు హిడ్మా కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఏడాది మేలో ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 28 మంది మావోయిస్టులు మరణించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో పార్టీ అగ్రనేత సంబాల కేశవరావు అలియాస్ బసవరాజు మరణించారు. ఈ ఎన్‌కౌంటర్‌ను నిరసిస్తూ.. జూన్ 10వ తేదీన భారత్ బంద్‌కు మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హిడ్మాతోపాటు పలువురు మావోయిస్టులు మృతి చెందడంతో.. నవంబర్ 23వ తేదీ ఆదివారం భారత్ బంద్‌కు పార్టీ పిలుపునిచ్చింది. 2026, మార్చి నెలాఖారు నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలిస్తామని కేంద్రం ప్రకటించింది. మావోయిస్టులు లొంగిపోయి.. జన జీవన స్రవంతిలో కలిసి దేశాభివృద్ధికి పాటుపడాలని కేంద్రం పిలుపునిచ్చింది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో మావోయిస్టులు పూర్తిగా తుడిచి పెట్టుకుపోయారు. ఛత్తీస్‌గఢ్‌లో వీరి ప్రాబల్యం అధికంగా

# హమాస్ తరహాలో దాడులు.. ఆయుధాల సమీకరణ

## ఆయుధాగారాలుగా ఆస్పత్రుల ఎంపిక

## ఎన్ఐఎ దర్యాప్తులో వెల్లడవుతున్న కుట్రలు

**న్యూఢిల్లీ,నవంబర్21(సమయజ్యోతి):**

ఢిల్లీ పేలుడు ఘటనపై అధికారులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తులో భాగంగా అరెస్టయిన టెర్రర్ వైద్యులను విచారిస్తున్నారు. ఈ విచారణలో వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ కుట్రలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఇజ్రాయెల్‌పై 2023 అక్టోబర్ 7న హమాస్ ఉగ్రవాదులు జరిపిన దాడి తరహాలో ఢిల్లీలోని రద్దీ ప్రదేశాల్లో దాడులకు కుట్ర పన్నినట్లు తేలిన విషయం తెలిసిందే. తాజాగా మరో విషయం వెలుగులోకి వచ్చింది. హమాస్ తరహాలోనే ఆయుధాలను దాచేందుకు ఈ వైట్ కాలర్ ఉగ్ర ముఠా ఆసుపత్రులను ఎంచుకున్నట్లు తేలింది. ఇజ్రాయెల్‌తో యుద్ధం సమయంలో గాజాలోని పలు ఆసుపత్రుల కింద హమాస్ స్థావరాలు బయటపడిన సంగతి తెలిసిందే. పెద్ద ఎత్తున పేలుడు పదర్థాలు, ఆయుధాలను ఆసుపత్రుల కింద డంప్ చేసినట్లుగా ఐడీఎఫ్ గుర్తించింది. అదే తరహాలో జమ్ము ఆసుపత్రుల కింద ఆయుధ డంప్‌ను ఏర్పాటు చేసేందుకు వైట్ కాలర్ టెర్రర్ కుట్ర పన్నినట్లు అధికారులు గుర్తించారు. ఢిల్లీ పేలుడు, ఫరీదాబాద్ ఉగ్ర మాడ్యూల్‌తో సంబంధం ఉన్న వైద్యులు మొహమ్మద్ షకీల్, అదిల్ అహ్మద్ రాథర్, షాహీన్ సయీద్‌ను దర్యాప్తు అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్న విషయం తెలిసిందే. వీరిలో షకీల్, షాహీన్ ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. ఇక అహ్మద్ రాథర్ మాత్రం జమ్ము కశ్మీర్ అనంత్‌నాగ్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఉద్యోగి. అతడిని విచారించగా ఈ ఆయుధ డంప్ కుట్ర విషయం బయటపడింది. విదేశాల నుంచి ఇంపోర్ట్ చేసుకున్న ఆయుధాలను దాచేందుకు అనంత్‌నాగ్, శ్రీనగర్, బారాముల్లా, బుద్గాం, నౌగమ్‌లోని ఆసుపత్రులను ఈ ఉగ్ర మాడ్యూల్ పరిశీలించినట్లు దర్యాప్తులో తేలినట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. మరోవైపు ఈ కేసు దర్యాప్తులో హమాస్ తరహాలో డ్రోన్లతో దాడులకు కుట్ర పన్నినట్లు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఎర్ర కోట వద్ద ఈ నెల 10న ఆత్మాహుతి దాడికి ముందు ఈ ఉగ్ర ముఠా భారీ ఆయుధాలతో కూడిన డ్రోన్లతో రద్దీ ప్రదేశాల్లో దాడులు చేయాలని ప్రణాళిక రచించింది. ఇజ్రాయెల్‌పై 2023 అక్టోబర్ 7న హమాస్ ఉగ్రవాదులు జరిపిన దాడి తరహాలో దాడులకు పాల్పడాలని వీరు ప్రయత్నించారు. సూసైడ్ బాంబర్, డాక్టర్ ఉమర్ ఉన్ నబీతో కలిసి పని చేసిన జసిర్ బిలాల్ వానీ వురపు డానిష్ ఈ భయానక వివరాలను వెల్లడించాడు. ఇతనిని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) బృందం శ్రీనగర్‌లో అరెస్ట్ చేసింది. కారు బాంబు పేలుడుకు ముందే, డ్రోన్లకు భారీ ఆయుధాలను అమర్చి, రాకెట్లను తయారు చేసి, రద్దీ ప్రదేశాల్లో దాడులకు పాల్పడేందుకు సాంకేతిక సహకారాన్ని డానిష్ అందించాడని ఎన్ఐఏ ఓ ప్రకటనలో తెలిపింది. సూసైడ్ బాంబర్ ఉమర్‌తో సహ కుట్రదారుగా డానిష్ పని చేసినట్లు తెలిపింది. మీడియా కథనాల ప్రకారం, పెద్ద బ్యాటరీలతో అత్యంత శక్తిమంతమైన బాంబులను తీసుకెళ్లగలిగే డ్రోన్లను తయారు చేయడానికి డానిష్ ప్రయత్నించాడు. ఆయుధాలతో కూడిన డ్రోన్లను తయారు చేయడంలో అతనికి అనుభవం ఉంది. రద్దీ ప్రదేశాల్లో డ్రోన్ల దాడి చేయాలని నిందితులు ప్రయత్నించారు.

# ఇందిరానగర్ స్కూల్ టాప్ 3

## ఇక్కడికి రావాలంటే ఎంతో ఉత్సాహం కలుగుతుంది

## స్కూల్‌లో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభించిన హరీష్ రావు

**సిద్దిపేట,నవంబర్21(సమయజ్యోతి):**




సిద్దిపేట పట్టణంలోని ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. రాష్ట్రంలో టాప్ 10 స్కూల్స్‌లో ఇందిరానగర్ టాప్ 3 లో ఉందని హరీశ్‌రావు తెలిపారు. ఇంకొంచెంఫెసిలిటీస్ ఇవ్వగలిగితే ఇంకా ముందుకెళ్తారని అన్నారు. పాఠశాల అభివృద్ధికి ల్యాబ్, డైనింగ్ హాల్ కావాలని అడిగారని.. అవి నెల రోజుల్లోనే అందిస్తానని తెలిపారు. అవసరమైతే తన సొంత డబ్బులతో చేస్తానని.. లోటు మాత్రం రానియ్యనని పేర్కొన్నారు. నేను ఏది చేయాలనుకున్నా కూడా ఫస్ట్ చేయగలిగింది ఇందిరానగర్ స్కూల్‌కు మాత్రమేనని స్పష్టం చేశారు. నేనెప్పుడూ ఈ స్కూల్‌కి వచ్చినా ఒక కొత్త శక్తిగా తిరిగి వెళ్తాను.. ఇది ఒక గొప్ప భావన అని హరీష్ రావు అన్నారు. ఇంత బాగా తీర్చి దిద్దినందుకు, విద్యార్థులను ఇంత బాగా ప్రోత్సహిస్తున్నందుకు ఉపాధ్యా యులకు అభినందనలు తెలిపారు. సిద్దిపేటకు ఉపాధ్యాయులు రావాలని కొందరు అనుకుంటారు, కానీ ఇందిరా నగర్ రావాలంటే చాలామంది భయపడతారని హరీశ్‌రావు అన్నారు. కానీ ఇక్కడికి వచ్చిన ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు అభినందనలు అని అన్నారు. ఇష్టంతో పనిచేస్తున్నారు కాబట్టి ఇంతటి ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. నేను సహకారం మాత్రమే చేయగలుగుతాను.. కానీ ఆ విజయం మన ఉపాధ్యాయుల పట్టుదల, కృషి తోనే సాధ్యమని చెప్పారు. నిజంగా విద్యార్థులు, తల్లిదండ్రుల పక్షాన మా ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని అన్నారు. సిద్దిపేటలో ఫార్మసీ కాలేజ్ కట్టించామని. దానికి మన ఎగ్జిబిషన్ సొసైటీ వాళ్ల సహకరంతో నా సొంత డబ్బులతో ఆరు ఎకరాల స్థలం కొని బీ ఫార్మసీ కళాశాల కట్టించానని హరీశ్‌రావు తెలిపారు. సిద్దిపేటలో రెండు మెడికల్ కాలేజీలు, రెండు నర్సింగ్ కాలేజీలు, రెండు పారామెడికల్ కాలేజీలు, నాలుగు పాలిటెక్నిక్ కాలేజీలు, ः÷ూఇ అగ్రికల్చర్ ఇలా అన్ని విద్యాలయాలు ఉన్నాయని అన్నారు. ఇక్కడ విద్యార్థులు విద్యతో పాటు జాతీయస్థాయి క్రీడల్లో రాణిస్తున్నారని తెలిపారు. జి.ఖ.ఊ.÷ూ ఇందిరానగర్ నుంచి మహమ్మద్ అనాస్ నేషనల్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో కెప్టెన్‌గా ఉండటం చాలా గర్వకారణమని పేర్కొన్నారు. ప్రతి మ్యాచ్‌లో రన్నర్ అయ్యాడని.. ప్రతి మ్యాచ్‌లో గోల్ కొట్టి ప్రతిష్ట పెంచాడని. మన స్కూల్ విద్యార్థి ఇంద్రానగర్ విద్యార్థి అని అన్నారు. ఈ సంవత్సరం స్కాలర్‌షిప్‌లో మొత్తం 45 మందికి సీట్లు వస్తే.. సిద్దిపేట నుంచి కేవలం ఇందిరానగర్ నుంచే 16 మందికి సీట్లు వచ్చాయన్నారు. అంటే దాని ముందు టీచర్ మరియు విద్యార్థుల డెడికేషన్ ఉందని తెలిపారు. ఆటో డ్రైవర్ పిల్లలు, ఆటో కార్మికుల పిల్లలు, కూలీల పిల్లలు టాప్‌లో ఉండటం మనకు గర్వకారణమని చెప్పారు. 260 మంది టెన్త్ స్టూడెంట్స్ ఉన్నారని అన్నారు. ఈ సంవత్సరం కూడా 600 మార్కుల్లో 550 పైగా సాధించిన వారు 16 మంది ఉన్నారని.. 550 మార్కులకు పైగా ఎంతమంది తెచ్చుకుంటే అందరికీ నేను క్యాష్ ప్రైజ్ ఇస్తానని ప్రకటించారు. క్యాష్ ప్రైజ్ తో పాటు సిల్వర్ మెడల్ ఇస్తానని తెలిపారు. టీవీలు చూడొద్దు, ఫోన్ వాడొద్దు, ఫంక్షన్స్‌కి వెళ్లొద్దని.. చదువులో ఏకాగ్రత సాధించి భవిష్యత్తుకి అడుగులు వేయండని సూచించారు. త్వరలోనే మీ అమ్మానాన్నలకు ఉత్తరం రాస్తానని అన్నారు. ముఖ్యమంత్రి ఆఫీస్ నుంచి కూడా రికమండేషన్స్ రావడం ఇదే ఇందిరానగర్ స్కూల్ గొప్పదనమని అన్నారు. భవిష్యత్ లో ఇంకా ఏమి కావాలన్నా నేను అన్ని విధాలా అండగా ఉంటానని తెలిపారు. ఎవరైతే మంచిగా చదువుకుంటారో, ఎవరైతే స్కూల్‌కి సెలవులు పెట్టకుండా రెగ్యులర్‌గా వస్తారో వారికి ప్రత్యేకంగా ఒక బస్సు పెడతానని తెలిపారు. అందులో నుంచి కొందరిని అసెంబ్లీకి తీసుకెళ్లి చూపిస్తానని చెప్పారు.

# నేడు ఓయూలో జాబ్‌మేళా

**హైదరాబాద్,నవంబర్21(సమయజ్యోతి):**

ఉస్మానియా యూనివర్సిటీ లోని ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో మిత్రా ఏరిన ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ నెల 22 న శనివారం ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నది. ఉస్మానియా యూనివర్సిటీ, ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నారు. మిత్రా ఏరిన ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ లోని ,(టెక్నీషియన్ / సర్వీస్ అడ్వైజర్ )25 పోస్టులను ఈ జాబ్ మేళా ద్వారా భర్తీ చేయనున్నారు. డిగ్రీ చేసిన యువతి యువకులకు18 నుండి 30 సంవత్సరాల వయసు వారికి మాత్రమే ఈ జాబ్ మేళాలో అవకాశం కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డిప్యూటీ చీఫ్ ఒక ప్రకటనలో తెలియజేసింది. రూ.15,000 నుండి రూ.25,000 వేలవరకు వేతనం ఉండే ఈ టెక్నీషియన్ / సర్వీస్ అడ్వైజర్స్ ఉద్యోగాలకు మరిన్ని వివరాలకు 7799884996, 7799464344 నంబర్లను సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు. విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ తో ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరో వద్ద నేరుగా నవంబర్ 22 ,2025 న హాజరు కావాలని ప్రకటనలో పేర్కొన్నారు.

# భారీగా పెరిగిన యాదాద్రి ఆదాయం

## కార్తీకంలో 20 లక్షల 52 వేల మంది దర్శనం

**యాదాద్రి,నవంబర్21(సమయజ్యోతి):**

కార్తీక మాసం నేపథ్యంలో యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామిని భారీగగా భక్తులు దర్శించుకున్నారు. దేవాలయంలో భక్తుల రద్దీ ఎప్పటిలాగే భారీ స్థాయిలో నమోదైంది. ఈ మాసంలో స్వామివారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య 20 లక్షల 52 వేల దాటింది. భక్తుల సంఖ్య పెరగడంతో దేవాలయ ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. ఈ కార్తీక మాసంలో యాదాద్రికి వచ్చిన మొత్తం ఆదాయం రూ.17 కోట్లు 62 లక్షలు 33 వేల 331. గతేడాది ఇదే కాలంలో వచ్చిన ఆదాయం రూ. 14 కోట్లు 30 లక్షలు 69 వేల 481. అంటే ఈసారి గతేడాదితో పోలిస్తే రూ. 3 కోట్లు 31 లక్షలు 63 వేల 850 అదనపు ఆదాయం స్వామివారి దేవాలయానికి వచ్చింది. అధిక భక్తులు, సేవలు, విరాళాలు, ప్రసాద అమ్మకాల కారణంగా ఆదాయం పెరిగిందని దేవస్థానం అధికారులు పేర్కొంటున్నారు. కార్తీక మాసంలో యాదాద్రి యాత్రకు భక్తుల విశ్వాసం, ఆసక్తి ఏ స్థాయిలో ఉందో ఈ సంఖ్యలు మరోసారి రుజువు చేస్తున్నాయి.





# నిఖత్ జరీన్ పోలీస్ శాఖకు గర్వకారణం

## గోల్డ్ మెడల్ సాధించినందుకు డిజిపి అభినందనలు

హైదరాబాద్,నవంబర్21(సమయజ్యోతి):

ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ గోల్డ్ మెడల్ సాధించడం పట్ల తెలంగాణ డీజీపీ బీ. శివధర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ స్పెషల్ పోలీస్ డీఎస్పీ నిఖత్ జరీన్‌ను అభినందించారు. మహిళల 51 కేజీల ఫైనల్స్‌లో తన ప్రత్యర్థిపై 5-0 తేడాతో ఘన విజయం సాధించడం ఆమె సామర్థ్యానికి, అంకితభావానికి నిదర్శనమని కొనియాడారు. 'గోల్డ్ మెడల్ సాధించి తెలంగాణ పోలీస్ శాఖకు గర్వకారణంగా నిలిచిన నిఖత్ జరీన్‌ను అభినందిస్తున్నాను. క్రీడల్లో అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పిన నిఖత్ విజయం ఇతర క్రీడాకారులకు ఆదర్శం' అని పేర్కొన్నారు. తెలంగాణ పోలీస్ కుటుంబం తరపున నిఖత్ జరీన్ భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డీజీపీ ఆకాంక్షించారు. ఇదిలావుంటే సీఐడీ విభాగంలో నేర విశ్లేషణ, సాంకేతికత కోసం క్రైమ్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ ఎనాలసిస్ పేరుతో ప్రత్యేక వింగ్‌ను ఏర్పాటు చేసినట్టు డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎంపిక చేసిన జిల్లాల్లో 'సేఫ్ విలేజ్' కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు రాష్ట్రంలోని పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తీవ్రమైన నేరాలు, ఆర్థిక నేరాలు, బాలలకు సంబంధించిన నేరాలపై లోతుగా చర్చించారు. రాష్ట్రంలోని ఏడు జిల్లాల పరిధిలో 'సేఫ్ విలేజ్ ప్రోగ్రాం'ను విస్తృతంగా నిర్వహించనున్నట్టు తెలిపారు.

# ట్రేడ్ లైసెన్స్ ఫీజులో మోసం

## అన్నపూర్ణ, రామానాయుడు స్టూడియోలకు నోటీసులు

హైదరాబాద్,నవంబర్21(సమయజ్యోతి):

అన్నపూర్ణ స్టూడియో, రామానాయుడు స్టూడియోలకు జిహెచ్ఎంసి నోటీసులు జారీ చేసింది. ఇరు సంస్థలు ట్రేడ్ లైసెన్స్ ఫీజ్ తక్కువగా చెల్లిస్తున్నాయని, వ్యాపార విస్తీర్ణం తక్కువ చూపిస్తూ భారీగా ట్యాక్స్ ఎగవేస్తున్నట్లు జిహెచ్ఎంసి అధికారులు గుర్తించి శుక్రవారం నోటీసులిచ్చారు. పూర్తి స్థాయిలో ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాలంటూ జిహెచ్ఎంసి అధికారులు నోటీసులిచ్చారు. తెలుగు రాష్టాల్లో పరిచయం అవసరం లేని అన్నపూర్ణ, రామానాయుడు సంస్థలు ట్యాక్స్ ఎగవేస్తున్నాయంటూ వార్తలు రావడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఇంతవరకు ఆ రెండు సంస్థల నుండి ఎలాంటి స్పందన రాలేదు. అన్నపూర్ణ స్టూడియో లక్షా 92 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో వ్యాపారం చేస్తూ కేవలం 8 వేల100 చదరపు అడుగులకు మాత్రమే ట్యాక్స్ పే చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అన్నపూర్ణ స్టూడియో రూ. 11 లక్షల 52 లక్షలు ఫీజు చెల్లించాల్సి ఉండగా, కేవలం రూ.49 వేలు మాత్రమే చెల్లిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రామానాయుడు స్టూడియో 68 వేల చదరపు అడుగుల్లో వ్యాపారం చేస్తూ? కేవలం 19 వందల చదరపు అడుగులకు ట్యాక్స్ పే చేస్తోందని.. రూ. 2 లక్షల 73 వేలు చెల్లించాల్సిన రామానాయుడు స్టూడియోస్ కేవలం 7 వేల 600 మాత్రమే చెల్లిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

# ఇంట్లోనే గంజాయి మొక్కల పెంపు

## పోలీసులకు దొరికిన యువకుడు

అచ్చంపేట,నవంబర్21(సమయజ్యోతి):

బహిరంగ ప్రదేశాల్లో నిషేదిత గంజాయి పండిస్తే పోలీసులకు దొరికిపోతామన్న భయంతో ఓ యువకుడు ఏకంగా ఇంట్లోనే గంజాయి సాగును మొదలు పెట్టాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఎట్టకేలకు పోలీసులకు దొరికి పోయాడు. పోలీసులు దాడి జరిపి ఆ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన నాగర్ కర్నూల్ జిల్లాలో చోటు చేసుకుంది. జిల్లాలోని అచ్చంపేట మండలం పల్కపల్లి గ్రామంలో నాగనులు మధు అనే యువకుడు గంజాయికి బానిసగా మారి ఇంట్లోనే గంజాయి మొక్కలు పెంచుతున్నాడు. గంజాయి సాగు, అక్రమ రవాణాపై , విక్రయాలపై పోలీసులు గట్టి నిఘా వేయడంతో పాటు తనిఖీలు, దాడులు చేస్తూ గంజాయిని పట్టుకుంటున్నారు.ఈ క్రమంలో సమాచారం అందుకున్న పోలీసులు గ్రామంలోని మధు ఇంటిపై దాడి జరిపి గంజాయి మొక్కను గుర్తించి యువకుడిని అదుపులోకి తీసుకున్న స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హైదరాబాద్,నవంబర్21(సమయజ్యోతి):

ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిశారు. ఈ నెల 23 లోపు పార్టీ ఫిరాయింపు ఆరోపణలపై వివరణ ఇవ్వాలని స్పీకర్ నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో ఆయన కలిశారు. పార్టీ ఫిరాయింపు ఫిర్యాదులకు సమాధానాలు ఇవ్వాల్సిందిగా ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ మరోసారి నోటీసులు జారీ చేశారు. ఈ నెల 23వ తేదీలోగా సమాధానాలను అఫిడవిట్ రూపంలో స్పీకర్ కార్యాలయంలో అందజేయాలని వాటిలో సూచించారు. గత ఆగస్టులో ఫిర్యాదులొచ్చిన 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు జారీ చేశారు. వారిలో దానం, కడియం మినహా మిగిలిన ఎనిమిది మంది తమ సమాధానాలను అఫిడవిట్ రూపంలో అసెంబ్లీ కార్యదర్శికి దాఖలు చేశారు.ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తక్షణమే వివరణ ఇవ్వాలని కోరుతూ స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ గురువారం మరోసారి నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఎమ్మెల్యే కడియం శ్రీహరి కలిశారు. ఈ నెల 23వ తేదీ లోపు ఫిరాయింపు ఆరోపణలపై వివరణ ఇవ్వాలని నోటీసుల్లో స్పీకర్ పేర్కొన్నారు. దీంతో వివరణ ఇచ్చేందుకు మరింత సమయం కావాలని స్పీకర్‌ను కడియం శ్రీహరి కోరారు. ఢిల్లీ నుండి రాగానే స్పీకర్‌ను దానం నాగేందర్ కలవనున్నారు. దానం నాగేందర్ మరింత సమయం కోరుతాడా లేదా రాజీనామా చేస్తాడా అనే అంశంపై సందిగ్ధత నెలకొంది.

# వరుస చోరీలకు పాల్పడుతున్న నలుగురు అరెస్ట్

నరసరావుపేట,నవంబర్21(సమయజ్యోతి):

పల్నాడు జిల్లా నరసరావుపేటలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నలుగుర్ని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.80 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను పల్నాడు జిల్లా ఎస్పీ కృష్ణారావు శుక్రవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. నిందితులు నరసరావుపేట పట్టణం, గ్రామీణ ప్రాంతాలతోపాటు వినుకొండలో ఆరు చోట్ల చోరీలకు పాల్పడ్డారని తెలిపారు. సిమెంట్ పనులు చేసుకొని జీవించే వారి ఇళ్లనే లక్ష్యంగా చేసుకొని రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. ఈ నెల 4 నుంచి 9 వరకు వరుస దొంగతనాలకు పాల్పడ్డారని, బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు చెప్పారు.

# స్థానిక సంస్థల ఎన్నికల కసరత్తువేళ

## తెలంగాణలో భారీగా ఐపిఎస్‌ల బదిలీ - పలు జిల్లాలకు కొత్త ఎస్పీల నియామకం

హైదరాబాద్,నవంబర్21(సమయజ్యోతి):

తెలంగాణలో స్థానిక ఎన్నికలకు రంగం సిద్ధంచేస్తున్న వేళ ప్రభుత్వం భారీ ఎత్తున పోలీస్ అధికారులను బదిలీ చేసింది. పలు జిల్లాలకు కొత్త ఎస్పీలను నియమించింది. డిసెంబర్‌లో స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నోటిఫికేషన్ వస్తే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. దీంతో ముందుగానే ప్రభుత్వం ఐపిఎస్‌లను బదిలీ చేసినట్లు అర్థం అవుతోంది. ప్రస్తుతం ఉన్న వారిలో చాలామందిని బదిలీ చేసింది. ఈ క్రమంలో మొత్తం 32 మంది ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అడిషనల్ డీజీగా జయేంద్రసింగ్ చౌహాన్, సీఐడీ డీజీగా పరిమళ హన నూతన్ జాకబ్, పోలీసు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా చేతన్ మైలబత్తుల, మహేశ్వరం జోన్ డీసీపీగా కే నారాయణ రెడ్డి, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీగా పీవీ పద్మజలు నియమితులయ్యారు. ఇక నాగర్‌కర్నూల్ ఎస్పీగా సంగ్రామ్ సింగ్, హైదరాబాద్ సౌత్ జోన్ డీసీపీగా కిరణ్ ప్రభాకర్, మహబూబాబాద్ ఎస్పీగా శబరీష్, కుమ్రంభీం ఆసిఫాబాద్ ఎస్పీగా నిఖిత, టీజీ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీగా గిరిధర్, వికారాబాద్ ఎస్పీగా స్నేహా మిశ్రా బదిలి అయ్యారు. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా గైక్వాడ్ వైభవ్, ములుగు ఎస్పీగా కేకన్ సుధీర్ రామ్‌నాథ్, జయశంకర్ భూపాలపల్లి ఎస్పీగా సంకీర్త్, గవర్నర్ ఏడీసీగా పాటిల్ కాంతిలాల్ సుభాష్, పెద్దపల్లి డీసీపీగా రామ్ రెడ్డి, మల్కాజ్‌గిరి డీసీపీగా సీహెచ్ శ్రీధర్, భద్రాద్రి కొత్తగూడెం అడిషనల్ ఎస్పీగా అవినాష్ కుమార్, భువనగిరి అడిషనల్ ఎస్పీగా కంకణాల రాహుల్ రెడ్డి, జగిత్యాల అడిషన్ ఎస్పీగా శేషాద్రిని రెడ్డి, ములుగు అడిషనల్ ఎస్పీగా శివం ఉపాధ్యాయ, ఆదిలాబాద్ అదనపు ఎస్పీగా మౌనిక, ఏటూరు నాగారం ఏఎస్పీగా మనన్ భట్, నిర్మల్ ఏఎస్పీగా సాయికిరణ్, వేములవాడు ఏఎస్పీగా రుత్విక్ సాయి, సత్తుపల్లి ఏసీపీగా యాదవ్ వసుంధర, టీజీ ట్రాన్స్‌కో ఎస్పీగా శ్రీనివాస్, వనపర్తి ఎస్పీగా సునీత నియామకం అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# ప్రభుత్వ వైఫల్యాలు ఎత్తి చూపినందుకే కక్షసాధింపు

## కెటిఆర్‌పై విచారణకు అనుమతి ఇందులో భాగమే

## మండిపడ్డ మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్

హైదరాబాద్,నవంబర్21(సమయజ్యోతి):

అనునిత్యం ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్నందుకే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ సర్కారు కక్ష సాధిస్తున్నదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. ఫార్ములా- ఈ రేస్ కేసులో కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి ఇవ్వడం కక్ష సాధింపు చర్య అని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతీకార రాజకీయదాడిలో భాగంగా కేటీఆర్‌పై ఈ కార్ రేస్ కేసును తెరపైకి తెచ్చాడని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. కేంద్రంలోని బీజేపీతో చీకట్లో చేతులు కలిపి బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నారని, ఫార్ములా ఈ కేసులో చట్టపరమైన స్థిరత్వం, వాస్తవ ఆధారాలు, సాక్ష్యాలు లేవు, ఫార్ములా ఈ రేస్‌పై గతంలో లైడిటెక్టర్ టెస్ట్‌కు సిద్ధమని కేటీఆర్ చేసిన సవాల్‌కు రేవంత్ రెడ్డి తోకముడిచాడని ఆరోపించారు. ౦ండేండ్లుగా ఫార్ములా ఈ రేస్‌పై విచారణ పేరిట సాగదీస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం సాధించింది ఏమీ లేదని ఆయన అన్నారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను నిలువరించేందుకు మరోసారి ఈ-కార్ రేస్ కేసు పేరిట కుట్రలను తెరపైకి తెచ్చిందని హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచిన కేటీఆర్‌పై రేవంత్‌రెడ్డి అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా పెట్టుకుని రెండు జాతీయ పార్టీలు పని చేస్తున్నాయని ఆరోపించారు. కేటీఆర్‌ను ప్రజాక్షేత్రంలో ఎదుర్కొనే దమ్ములేకే కుట్రలకు తెగబడుతున్నాయని మాజీ మంత్రి మండిపడ్డారు.దేశంలో కాంగ్రెస్, బీజేపీలు కేంద్రంలో బద్ధ శత్రువులు కానీ, తెలంగాణలో మాత్రం వారిది అన్నదమ్ముల అనుబంధం అని అన్నారు. ప్రాంతీయ పార్టీలను, యువ నాయకత్వాన్ని రాజకీయంగా నిర్మూలించడం, ప్రాంతీయ పార్టీలను బలహీనపరచడమే జాతీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీ ఎజెండా అని ఆరోపించారు. నిన్నటికి నిన్న బీహార్‌లో ఆర్జేడీని కాంగ్రెస్, బీజేపీలు కలిసి మట్టికరిపించాయని, అలాగే యూపీలో సమాజ్‌వాదీ పార్టీని, కర్ణాటకలో జేడీఎస్‌ను, ఢిల్లీలో ఆప్‌ను, మహారాష్ట్రలో ఎన్సీపీ, శివసేనలను ఇంకా అనేక ప్రాంతీయ పార్టీలను పూర్తిగా బలహీన పరిచాయని గుర్తు చేశారు.దేశంలో యువ నాయకత్వం ఎదుగుదలను నిరోధించడమే మోదీ-బీజేపీల ఎజెండా. అందుకే అఖిలేష్ యాదవ్, తేజస్వీ యాదవ్, కేటీఆర్, ఉదయనిధి స్టాలిన్ వంటి యువ నేతలను బీజేపీ టా÷-గ్గ÷ట్ చేసిందని, ఉత్తరాదిలో అనుసరించిన వ్యూహాన్నే తెలంగాణలోనూ బీజేపీ-కాంగ్రెస్ పార్టీలు అనుసరిస్తున్నాయని, అందులో భాగంగానే తెలంగాణలో కేసీఆర్ కుటుంబాన్ని ఇబ్బందులు పెట్టేందుకు జాతీయ స్థాయిలో బద్ధ విరోధులు ఆప్తమిత్రులు అయ్యారు. దర్యాప్తు సంస్థలను గుప్పిట్లో పెట్టుకొని బీఆర్ఎస్ నేతలపై రాజకీయ ప్రేరేపిత కేసులు పెడుతున్నారు. ఈ క్రమంలోనే ఫార్ములా ఈ- రేస్‌ను పదే పదే తెరపైకి తెస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ పేరుతో కేసీఆర్‌ను వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.స్థానిక ఎన్నికల నేపథ్యంలోనే రేవంత్, బీజేపీలు కలిసి మళ్లీ ఈ-కార్ రేస్‌ను తెరపైకి తీసుకువచ్చారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసింది. 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని నమ్మించి గొంతుకోసింది. ఇచ్చిన హామీని తుంగలో తొక్కి, మాటమార్చి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం సాధ్యం కాదని తేల్చేసింది. రాజ్యాంగబద్ధంగా కాకుండా, పార్టీ పరంగా బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని బీసీ సమాజాన్ని తడిగుడ్డతో గొంతుకోసింది కాంగ్రెస్ ప్రభుత్వం. అటు బీసీ రిజర్వేషన్ల కోసం బీఆర్ఎస్ పార్టీ ప్రత్యక్ష పోరాటం చేస్తున్నది. అందుకే డైవర్షన్ రాజకీయాలు, డ్రామాల పాలిటిక్స్‌కు స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఈ-రేస్‌ను తెరపైకి తీసుకువచ్చారని అన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ద్రోహంపై, రేవంత్ నయవంచక పాలనపై ప్రజల్లో చర్చ జరగకుండా మీడియా అటెన్షన్ మొత్తం ఈ-రేస్ చుట్టే ఉండాలని రేవంత్ కుట్రలు చేస్తున్నాడని రేవంత్ రెడ్డి మండిపడ్డారు.

# పత్తి, సోయాబిన్ కొనుగోళ్లలో నిర్లక్ష్యం

## అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళన

## జాతీయ రహదారి 44 పై ధర్నా

ఆదిలాబాద్,నవంబర్21(సమయజ్యోతి):

ఆదిలాబాద్ జిల్లాలోని పత్తి ,సోయాబిన్ కోనుగోళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న వైఖరిని నిరసిస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. హైదరాబాద్ -నాగపూర్ జాతీయ రహదారి 44 పై నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు భారీగా తరలివచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసనగా జాతీయ రహదారిపై బైఠాయించిన రైతులు నిరసన తెలిపారు. పంటల కొనుగోలలో రెండు ప్రభుత్వాలు నిబంధనల పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని నాయకులకు తెలిపారు. సీసీఐ తేమశాతం పేరిట పత్తిని మద్దతు ధరతో కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. రైతులకు మద్దతు ధర లభించకపోవడంతో మధ్య దళారులకు విక్రయించి పత్తి క్వింటాలుకు రూ.1500 చొప్పున నష్టపోతున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు ఏడు క్వింటాళ్లు మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తుందని, మిగిలిన పత్తిని రైతులు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారని తెలిపారు. సోయాబీన్ కొనుగోలు సైతం పలు నిబంధనలు అమలు చేస్తున్నారని, వేలిముద్ర తప్పనిసరి చేయడంతో రైతులు పంటను అమ్ముకునే పరిస్థితి లేదని వాపోయారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న సోయాబిన్ పంటను మార్క్ ఫెడ్ కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారులకు విక్రయించిన నష్టపోతున్నారని తెలిపారు. పంటల కొనుగోలులో నిబంధనలు ఎత్తివేసే వరకు ఆందోళన నిర్వహించనునట్లు అఖిలపక్షం నాయకులకు తెలిపారు. రైతుల ఆందోళన ఫలితంగా జాతీయ రహదారిపై వాహనాలు ఎక్కడికి అక్కడ నిలిచిపోయాయి.

# హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

## స్వాగతం పలికిన గవర్నర్, సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,నవంబర్21(సమయజ్యోతి):

ఒకరోజు పర్యటనకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్ చేరుకున్నారు. ఐదరాబాద్ బేగంపేట విమానాశ్రయంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో కలి ముర్ముకు సిఎం రేవంత్ రెడ్డి స్వాగతం పలికారు. అలాగే రాష్ట్రపతికి స్వాగతం పలికిన వారిలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, హైదరాబాద్ సీపీ సజ్జనార్, తదితరులు ఉన్నారు. తిరుపతి నుంచి నేరుగా హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతి తిరిగి శనివారం పుట్టపర్తి వెళ్లనున్నారు.

# స్పోర్ట్స్ విజేతలతకు సిఎం రేవంత్ అభినందనలు

హైదరాబాద్,నవంబర్21(సమయజ్యోతి):

4వ ఇఎంఆర్ఎస్ నేషనల్ స్పోర్ట్స్ మీట్-2025లో ఓవరాల్ ఛాంపియన్ షిప్ ను సాధించిన తెలంగాణ విద్యార్థులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇఎంఆర్ఎస్ నేషనల్ స్పోర్ట్స్ మీట్-2025లో రికార్డ్-బ్రేకింగ్ మెడల్స్ సాధించిన తెలంగాణ అథ్లెటిక్స్, ఆర్చరీ, స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్, బాక్సింగ్, జూడో, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, టైక్వాండో, యోగా, షూటింగ్, చెస్ ఇతర ఈవెంట్లలో అన్ని రాష్టాల్రకంటే అత్యధికంగా 230 పతకాలను తెలంగాణ సాధించింది. నవంబర్ 15న ఒడిశాలో జరిగినఈ పోటీల్లో తెలంగాణలోని 23 సంస్థలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.. దేశవ్యాప్తంగా ఈ జాతీయ క్రీడా పోటీల్లో 22 రాష్టాల్రలోని 499 సంస్థలకు చెందిన 5,500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తం 22 ఈవెంట్లలో పోటీలు నిర్వహించగా ఇందులో వ్యక్తిగత ఈవెంట్లు - 15, జట్టు ఈవెంట్లు 07, తెలంగాణ తరపున ఈ జాతీయ ఈవెంట్‌లో 23 పాఠశాలలకు చెందిన 580 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వ్యక్తిగత, జట్టు ఈవెంట్లలో అత్యుత్తమ ప్రదర్శనను తెలంగాణ విద్యార్థులు ప్రదర్శించారు.మొత్తం 714 పాయింట్లతో అద్భుతమైన ఛాంపియన్‌షిప్‌ను తెలంగాణ కైవసం చేసుకున్నది .
ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి కేసు

# డ్రైవర్‌కు ఫోన్ చేసిన పరామర్శించిన పొన్నం

## కారు డ్రైవర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు

రాజన్నసిరిసిల్ల,నవంబర్21(సమయజ్యోతి):

జిల్లాలో కారుకు సైడ్ ఇవ్వలేదని ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ఓ వ్యక్తి దాడి చేసిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. పెద్దాయనను కాలితో తన్నుతూ దాడి చేసిన కారు డ్రైవర్‌పై సర్వత్రా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ దాడిపై రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. దాడికి గురైన ఆర్టీసీ డ్రైవర్ బాలరాజుతో ఫోన్లో మాట్లాడారు. ఈ సందర్భంగా బాలరాజు కంటతడి పెట్టుకున్నారు. మంత్రితో ఫోన్లో మాట్లాడుతూనే తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు.'ఇన్నేళ్లుగా ఎలాంటి రీమార్క్ లేకుండా పని చేశా. బెస్ట్ డ్రైవర్‌గా అవార్డు కూడా అందుకున్నా సార్. నా తప్పు లేకున్నా నన్ను కొట్టాడు. తాగి వచ్చి తలపై కొట్టాడు... కాళ్లతో తన్నాడు' అంటూ బాలరాజు కన్నీటి పర్యంతమయ్యారు. దీంతో ఆయనను ఫోన్లోనే ఓదార్చారు మంత్రి. ధైర్యంగా ఉండాలని.. దాడి చేసిన వ్యక్తిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ డ్రైవర్‌కు మంత్రి పొన్నం భరోసా ఇచ్చారు. మరోవైపు ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన కారు డ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లాలోని చిన్నకోడూరు మండలం గంగాపూర్‌కు చెందిన శ్రీకాంత్ బుధవారం నాడు ఇల్లంతుకుంట మండలం వల్లంపట్ల నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. అతడి ముందు ఆర్టీసీ బస్సు వెళ్తోంది. అయితే తన కారుకు సైడ్ ఇవ్వలేదన్న కోపంతో బస్సును చేజ్ చేసి ఆపి మరీ బస్సులోకి వచ్చి డ్రైవర్ బాలరాజుపై విరుచుకుపడ్డారు. డ్రైవర్‌పై ఇష్టం వచ్చినట్లు దాడి చేశాడు. కాళ్లతో తన్నుతూ విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. పక్కనే ఉన్న ప్రయాణికులు కారు డ్రైవర్‌ను ఆపేందుకు ప్రయత్నించినప్పటికీ పట్టించుకోలేదు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ దాడి దృశ్యాలను బస్సులోని కొందరు వ్యక్తులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో ఆ వీడియో వైరల్‌గా మారింది.

# పంచాయితీ రిజర్వేషన్లపై కసరత్తు

### నేడు జివో విడుదల చేయనున్న పంచాయితీరాజ్ శాఖ

### ఒకటి రెండు రోజుల్లో రిజర్వేషన్లు ఖరారు

**హైదరాబాద్,నవంబర్21(సమయజ్యోతి):**

పంచాయితీ ఎన్నికలకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఈ క్రమంలో మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. గ్రామ పంచాయతీలు, వార్డుల రిజర్వేషన్ల విధి విధానాలు పంచాయతీరాజ్ శాఖ ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు శనివారం జీవో ఇవ్వనుంది. రిజర్వేషన్లు 50శాతం మించకుండా కొత్త రిజర్వేషన్లను సిఫార్సు చేస్తూ డెడికేటెడ్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి గురువారం నివేదిక సమర్పించింది. డెడికేటెడ్ కమిషన్ సిఫార్సులను సర్క్యులేషన్ విధానంలో రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. మంత్రుల వద్దకు ఫైలు పంపించి ఆమోదిస్తున్నట్లు సంతకాలు తీసుకున్నారు. ఈ క్రమంలో పంచాయతీలు, వార్డుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లపై విధివిధానాలు ఖరారు చేస్తూ పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేయనుంది. జీవోకు అనుగుణంగా ఎంపీడీవోలు వార్డులకు, ఆర్డీవోలు సర్పంచి పదవులకు రిజర్వేషన్లు ఖరారు చేస్తారు. రాజకీయ పార్టీల సమక్షంలో లాటరీ పద్ధతిలో మహిళలకు సీట్లు కేటాయించనున్నారు. శని, ఆదివారాల్లో జిల్లాల యంత్రాంగం రిజర్వేషన్ల పక్రియ పూర్తి చేయనుంది. రిజర్వేషన్లు ఖరారు చేసిన తర్వాత పంచాయతీ ఎన్నికలకు సంసిద్ధత వ్యక్తం చేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ప్రభుత్వం లేఖ రాయనుంది. ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నామని, పిటిషన్‌పై విచారణ ముగించాలని ఈనెల 24న హైకోర్టుకు ప్రభుత్వం, ఎస్ఈసీ తెలపనున్నాయి. హైకోర్టు అంగీకరిస్తే అదే రోజు లేదా మరుసటి రోజు షెడ్యూలు విడుదల చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం భావిస్తోంది. మొత్తానికి ఇటీవల కేబినేట్‌లో ఆమోదించిన మేరకు డిసెంబర్ రెండోవారంలో నోటిఫికేషన్ విడుదల కానుంది.

# దళారుల నుంచి మత్స్యకారులకు విముక్తి

### ఉచిత చేపపిల్లలను పంపిణీలో పోచారం

**నిజామాబాద్,నవంబర్21(సమయజ్యోతి):**

చేపిల్లల పంపిణీతో చెరువులపై దళారుల పెత్తనం పోయిందని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారంశ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఇప్పుడు వారే స్వయంగా చేపలను పెంచుకుని ఆర్థికంగా ఎదిగే అవకాశం వచ్చిందన్నారు. ఇంతకాలం కొంత మంది దళారులు మత్స్య కార్మికుల శ్రమను దోపిడీ చేసారని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. వర్ని మండలంలోని జలాల్పూర్‌లోని పెద్ద చెరువులో ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్‌తో కలిసి చేప పిల్లలను విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ..గతంలో మత్స్యకారులకు చేప పిల్లలను కొని చెరువులో విడుదల చేసే ఆర్థిక స్థోమత లేకపోవడంతో దళారులు పెట్టుబడులు పెట్టి చెరువులపైన పెత్తానం చెలాయించేవారన్నారు. శ్రమ మత్స్యకారులది.. లాభం దళారులకు చెందేదన్నారు. ప్రభుత్వం దళారులకు అడ్డుకట్ట వేసేందుకు వందశాతం రాయితీపై చేప పిల్లలను పంపిణీ చేస్తుందన్నారు. దళారులకు చేపలను విక్రయించొద్దని, స్వయంగా కార్మికులు చేపలు పట్టి విక్రయించాలని సూచించారు. అనంతరం జాకోరా ఎత్తిపోతల పథకం పనులు, సిద్దాపూర్ జలాశయ నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. పనులు త్వరగా పూర్తిగా చేయించాలని అధికారులకు సూచించారు. ఈ సబ్ కలెక్టర్ వికాస్ మహో, జిల్లా మత్స్యశాఖ అధికారి అంజనేయ స్వామి, పీసీసీ డెలిగేట్ డాక్టర్ రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# స్వదేశీ వినియోగం పెరగాలి

### ఆత్మనిర్భర భారత్ వర్క్‌షాపులో రామ్

**హైదరాబాద్,నవంబర్21(సమయజ్యోతి):**

భారతదేశంలో స్వదేశీ వస్తువుల వినియోగం పెరగాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు సూచించారు. ప్రజల ఆలోచనా స్వదేశీ వస్తువులని వినియోగించేలా ఉండాలని కోరారు. భారతదేశం ఇతర దేశాల వస్తువుల మీద ఆధారపడకూడదని ఆత్మనిర్భర్ భారత్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారని గుర్తుచేశారు. శు క్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆత్మనిర్భర్ భారత్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో రామచంద్రరావు, బీజేపీ నేతలు చంద్రశేఖర్ తివారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడారు. యూఏఈ ఇండియా ఐడియాజీ ఉన్నవారికి కాంగ్రెస్ నిన్న ఇందిరా గాంధీ అవార్డులు ఇవ్వడం దుర్మార్గమని మండిపడ్డారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా మనమందరం ముందుకెళ్లాలని సూచించారు. చైనా, అమెరికా తమ ఉత్పత్తులను పెంచి.. ప్రపంచ దేశాలను తమ గుప్పిట్లో పెట్టుకున్నాయని విమర్శించారు. గతంలో మాదిరిగా ఇప్పుడు ఎవరి మీద భారతదేశం ఆధారపడే పరిస్థితి లేదని తెలిపారు. ఆపరేషన్ సింధూర్ స్వదేశీ ఆయుధాలతో జరిగిందని.. అందుకే ఈ ఆపరేషన్ అంత సక్సెస్ అయ్యిందని రామచంద్రరావు పేర్కొన్నారు.



# ఎపి టెన్త్ పరీక్షల తేదీలు విడుదల

### మార్చి 16వ నుంచి ఏప్రిల్ 1వ వరకు షెడ్యూల్

**అమరావతి,నవంబర్21(సమయజ్యోతి):**

ఆంధ్రప్రదేశ్ పదోతరగతి పరీక్షల షెడ్యూల్ విడుదలయ్యింది. ఈమేరకు రాష్ట్ర ఎస్ఎస్‌సీ బోర్డు వివరాలను వెల్లడించింది. 2026 మార్చి 16వ తేదీ నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు ఏపీ టెన్త్ ఎగ్జామ్స్ జరుగనున్నాయి. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని ప్రకటించింది. 16న ఫస్ట్ లాంగ్వేజ్, 18న సెకెండ్ లాంగ్వేజ్, 20న ఇంగ్లీష్, 23న మ్యాథ్స్, 25న భౌతికశాస్త్రం, 28న జీవశాస్త్రం, 30న సాంఘిక శాస్త్రం, 31న ఫస్ట్ లాంగ్వేజ్ (పేపర్2), ఏప్రిల్ 1న సెకెండ్ లాంగ్వేజ్ పేపర్2 పరీక్షలు జరుగుతాయని అధికారులు ప్రకటించారు. ఈ మేరకు ఏపీ ఎస్ఎస్‌సీ బోర్డు అధికారులు ఇవాళ(శుక్రవారం) ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు అధికారులు.

# మక్తల్ నూతన ఎంఈఓ కు సన్మానించిన రుద్రసముద్రం- మాజీ సర్పంచ్

**మక్తల్ నవంబర్ 21 సమయజ్యోతి**

మక్తల్ నూతన ఎంఈ ఓ అమీరుద్దీన్ సన్మానించి నా రుద్రసముద్రం గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మీ %ఆ%శ్రీనివాస్ గౌడ్ ఆంజనేయులు స్కూల్ అడ్జెషన్ విషయం టీచర్ల కొరత మరియు 9, 10, అబ్జెషన్ విషయంలో ఇన్చార్జ్ ఎంఈఓ కలిసి టీచర్ల కొరత ఉంది కాబట్టి డిప్టేషన్ రద్దుచేసి మా గ్రామ టీచర్ ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ ఎం స్వప్న మేడం ను డిప్యూటేషన్ రద్దుచేసి ఎం పి యు పి ఎస్ రుద్ర సముద్రం పాఠశాలకు పంపించండి అని మరియు విద్య వాలెంటర్లన్ పాపించగలరు అని గ్రామస్తుల లక్ష్మీ శ్రీనివాస్ గౌడ్, ఆంజనేయులు మాట్లాడడం జరిగినది, అందుకు ఎంఈఓ సానుకూలంగా స్పందించి డివో నుంచి ఆర్డర్ కాపీ తీసుకురండి అని చెప్పి సానుకూలంగా స్పందించడం జరిగినది, అందుకు గ్రామం తరపు నుంచి సన్మానం చేయడం జరిగింది.



# చేపలు పట్టడం మా కుల వృత్తి, మా కుల వృత్తిని మాకు కేటాయించే వరకు ఉద్యమం ఆగదు.

## ఆనంద్ గారా.

**సమయజ్యోతి మంగపేట ప్రతినిధి.**

మంగపేట మండల కేంద్రంలో ప్రపంచ మత్స్యకార దినోత్సవం వేడుకలు బొర్రాయి సెంటర్ లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ మత్స్యకార రాష్ట్ర ఉపాధ్యక్షులు గారా ఆనంద్ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం అయన మాట్లాడుతూ కొన్ని ఏళ్లుగా చేపలను పట్టుకొని అమ్ముకొని జీవనం కొనసాగిస్తున్న ఒడ బలిజ, బెస్త ముదిరాజ్ తదితర కులాల కుటుంబాలు ఈరోజు వీధిన పడ్డాయి. తెలంగాణ ప్రభుత్వం తరతరాలుగా చేపల వృత్తినే నమ్ముకొని బ్రతికే మాకు చెరువుల మీద చేపలు పట్టుకునే హక్కులను కాలరాస్తున్నారు. చెరువుల ను నమ్ముకొని బ్రతుకుతున్న ఒడ బలిజ బెస్త ముదిరాజ్ కులస్తులను కాదని ఒక కులానికి మాత్రమే చేపలు పట్టాలని ప్రభుత్వంవారికి చేపలు పట్టడం నేర్పి వాళ్ళనే చేపలు పట్టుకొనే వృత్తికి గుత్తాధిపత్యం కల్పించి మాకు దక్కవలసిన హక్కులను వారికి అప్పజెప్పడం దారుణం ,ఇది ఎక్కడి న్యాయం .మేము ఈ గడ్డపైన పుట్టాము ,ఇక్కడే బ్రతుకుతున్నాము, చెరువుల పైన చేపలు పట్టుకునే హక్కులను మమ్ముల్ని కాదని వారికి హక్కుల్ని కల్పించడం, ప్రభుత్వం సొసైటీలు ఇవ్వడం సబ్సిడీలు ఇవ్వడం విడ్డూరం గా ఉంది ఇవన్నీ దృష్టిలో ఉంచుకొని మాకు దక్కవలసిన, పొందవలసిన హక్కులను వేరే కులం వాళ్ళు కాలరాస్తుంటే చూస్తూ ఊరుకోం మా భూములు, మా చెరువులు ,మా చేపలు పట్టుకునే ,మాకు హక్కులు మాకు దక్కేవరకు అలుపెరుగని పోరాటం చేస్తాం. మత్స్యకారుల ఉద్యమానికి బీసీ సంఘాలు మద్దతు తెలపడం మాకు చాలా సంతోషం, మా మత్స్యకార ఉద్యమాన్ని ఇంకా బలోపేతం చేస్తూ చెరువుల మీద ఒడ బలిజ బెస్త ముదిరాజ్ బిడ్డలకు హక్కులను పొందే వరకు పోరాటం చేస్తామన్నారు .ఈ కార్యక్రమంలో మండల బీసీ సంఘం అధ్యక్షులు కొడెం నరేష్ ,కార్యదర్శి ఎగ్గడి అర్జున్ తాళ్లూరి మధుకర్, మహేష్ సూతి వెంకటేశ్వర్లు, బెస్త (గంగ పుత్ర) సంఘం జిల్లా అధ్యక్షులు మాటూరి ఏడుకొండలు, ఒడ బలిజ మండల ప్రధాన కార్యదర్శి పుల్లూరు తిరుపతి కళల రాంబాబు అన్నారావు శివయ్య బీసీ గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గాజుల ఈశ్వరయ్య పబ్బోజు సత్యనారాయణచారి పలు కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# గురుకుల పాఠశాలలో విషాదం

### ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

**ఏలూరు,నవంబర్21(సమయజ్యోతి):**

ఏలూరు జిల్లాలోని జంగారెడ్డిగూడెంలో విషాదం అలుముకుంది. తరగతి గదిలోనే విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగారెడ్డిగూడెం మండలం జొన్నవారిగూడెం గ్రామానికి చెందిన పొడపాటి కావ్య (15).. జంగారెడ్డిగూడెం పట్టణంలోని గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. శుక్రవారం పాఠశాలలో భోజన విరామ సమయంలో విద్యార్థులందరూ భోజనం చేసేందుకు వెళ్లగా.. ప్లేట్ తెచ్చుకునేందుకు కావ్య తిరిగి తరగతి గది వద్దకు వెళ్లింది. భోజనం చేసేందుకు కావ్య ఎంతకీ రాకపోవడంతో.. తీసుకొచ్చేందుకు తోటి విద్యార్థులు వెళ్లారు. అయితే కావ్య.. తరగతి గదిలో చున్నీతో ఫ్యానుకు ఉరివేసుకొని ఉండడాన్ని గమనించి కేకలు వేశారు. వెంటనే స్పందించిన ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే విద్యార్థిని మృతి చెందిందని వైద్యులు నిర్ధరించారు. ఘటనా స్థలాన్ని జంగారెడ్డిగూడెం సీఐ సుభాష్, ఎస్సై వీరప్రసాద్ పరిశీలించారు. తోటి విద్యార్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. కావ్య తండ్రి గంగాధర్ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తల్లి ఉష దయాలసిస్ పేషెంట్ కావడంతో కొంతకాలంగా చికిత్స పొందుతున్నారు. విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

# అక్రమార్జన కేసులో సూర్యకళ అరెస్ట్

**అమరావతి,నవంబర్21(సమయజ్యోతి):**

అక్రమార్జన కేసులో రాష్ట్ర వైద్య మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్ మల్లాది వెంకట సూర్యకళను అవినీతి నిరోధకశాఖ అధికారులు అరెస్టు చేశారు. అక్రమంగా ఆస్తులు కూడబెట్టారనే అభియోగాలపై వచ్చిన సమాచారం మేరకు హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడలోని సూర్యకళకు చెందిన, బంధువుల ఇళ్లల్లో సోదాలు జరిపారు. నాలుగు చోట్ల ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. ఇంకా ఈ సోదాలు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, వ్యవసాయ భూములకు సంబంధించి 27 డాక్యుమెంట్లను గుర్తించారు. వివిధ బ్యాంకుల్లో రూ. 2కోట్ల వరకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు కనుగొన్నారు. సూర్యకళ నివాసంలో రూ. 9లక్షల నగదు, బంగారం, వెండి ఆభరణాలు, రెండు కార్లను గుర్తించారు. వీటి విలువ రూ. 6 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేశారు. సూర్యకళను అరెస్టు చేసినట్లు ఏసీబీ అధికారులు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి జరుగుతుంటే ఆ సమాచారాన్ని ఏసీబీ టోల్ ఫ్రీ నెంబరు 1064 లేదా ఏసీబీ మెబైల్ నెంబరు 9440440057 లేదా ఏసీబీ ఈ మెయిల్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు.

# మంగళగిరిలో సూరత్ తరహా డైమండ్ ఫ్యాక్టరీ

### జ్యువెలరీ ఎగ్జిబిషన్ ప్రారంభంలో మంత్రి భరత్

**విజయవాడ,నవంబర్21(సమయజ్యోతి):**

గుజరాత్‌లోని సూరత్ తరహాలో గుంటూరు జిల్లా మంగళగిరి కేంద్రంగా రత్నాల ఫ్యాక్టరీ నెలకొల్పేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. మంత్రి నారా లోకేశ్ చొరవతో ఈ ఫ్యాక్టరీ, క్లస్టర్ ఏర్పాటు కోసం 12 ఎకరాలు కేటాయించినట్లు చెప్పారు. విజయవాడలో ఏపీ బులియన్, గోల్డ్, సిల్వర్ అండ్ డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్, చెన్నైలోని యునైటెడ్ ఎగ్జిబిషన్ సంయుక్తంగా శుక్రవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తున్న బీ2బీ జ్యూయలరీ ఎగ్జిబిషన్‌ను మంత్రి భరత్ లాంఛనంగా ప్రారంభించారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి విచ్చేసిన జ్యూయలరీ వర్తకులను ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రంలో పరిపాలన గాడిలో పడినందునే చాలా మంది వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు ఏపీ వైపు వస్తున్నారని భరత్ అన్నారు. జ్యూయలరీ మార్కెట్‌లోకి ఎందరు వచ్చినా లాభదాయకంగానే ఉంటుందని, ప్రతి ఒక్కరికీ ఒక్కో రకమైన ప్రత్యేకత ఉంటుందన్నారు. అమరావతిలో త్వరలోనే లక్ష చదరపు అడుగుల కన్వెన్షన్ సెంటర్‌ను అన్ని వసతులు, ఆధునిక టెక్నాలజీతో ప్రారంభించనున్నామని చెప్పారు. ఇందుకు పది ఎకరాల స్థలాన్ని కేటాయించాల్సిందిగా మున్సిపల్‌శాఖ మంత్రిని కోరామన్నారు. ఇలాంటి ప్రదర్శనల ద్వారా వివిధ ప్రాంతాల అత్యాధునిక నగల డిజైన్ల గురించి వ్యాపారులంతా తెలుసుకోగలుగుతారన్నారు. ప్రాంతీయ జ్యూయలర్స్ ఎక్కడికో వెళ్లకుండా వారి ప్రాంతంలోనే నగలు కొనుగోలు చేసుకునే అవకాశం ఉంటుందని ఏపీ బులియన్ గోల్డ్ సిల్వర్, డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కపలవాయి విజయకుమార్ అన్నారు.

# కుప్పంలో సంజీవని ప్రాజెక్టు అమలు

### యూనివర్సల్ హెల్త్ స్కీమ్‌పై ఆరా


### మూడేళ్లలో 17 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి

### అధికారులతో సమీక్షించిన సిఎం చంద్రబాబు

### మత్స్యకారులకు బాబు శుభాకాంక్షలు

**అమరావతి,నవంబర్21(సమయజ్యోతి):**

సంజీవని ప్రాజెక్టును జనవరి నుంచి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ప్రారంభించనున్నారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మేరకు వైద్యారోగ్య శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. కుప్పంలో సంజీవని ప్రాజెక్టు అమలు, యూనివర్సల్ హెల్త్ స్కీమ్‌పై చర్చించారు. తొలివిడతలో చేపట్టనున్న ఆదోని, మదనపల్లి, మార్కాపురం, పులివెందుల మెడికల్ కాలేజీల నిర్మాణంపై కూడా చర్చించారు. విద్యార్థులు, ప్రజలు, సామాజిక ప్రయోజనం కోసం వీటిని ప్రభుత్వ పీపీపీ ప్రాతిపదికన నిర్మిస్తోంది. దీంతో బోధనాసుపత్రులు వేగంగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. ఇదిలావుంటే ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా మత్స్యకార సోదరులకు, ఆక్వా రైతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. సుదీర్ఘ సముద్ర తీరం, డెల్టా ప్రాంతం, సరస్సులు, రిజర్వాయర్లు మనల్ని బ్లూ ఎకానమీలో దేశంలోనే ముందు నిలిపాయని గుర్తుచేశారు. రాష్ట్ర జీఎస్డీపీలోనూ మత్స్య రంగానిదే అగ్ర వాటా అని పేర్కొన్నారు దీనికి మరింత మద్దతిచ్చేలా మత్స్యకారులకు, ఆక్వారైతులకు ప్రోత్సాహకాలు ఇస్తున్నామని వెల్లడించారు. వేట నిషేధ సమయంలో 'మత్స్యకారుల సేవలో' పథకం కింద ఒక్కొక్కరికి రూ.20 వేలు ఆర్థిక సాయంగా ఇచ్చినట్లు తెలిపారు. గంగపుత్రులు కోరుకున్నట్టుగా 217 జీవో రద్దు చేసి సొసైటీలకే హక్కు కల్పించినట్లు వివరించారు. ఆక్వా రంగాన్ని ఆంధ్రప్రదేశ్‌కు ఆశాకిరణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు. మరోవైపు టిడ్కో, గృహనిర్మాణ శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. మూడేళ్లలో 17 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు స్పష్టం చేశారు. ప్రతి 3 నెలలకోసారి సామూహిక గృహప్రవేశాలు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వచ్చే ఉగాది నాటికి 5 లక్షల మంది లబ్దిదారులకు ఇళ్ల తాళాలు అప్పగించాలన్నారు. లబ్దిదారుల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని తెల్పిచెప్పారు. గత ప్రభుత్వ కక్షసాధింపుతో నిలిపివేసిన ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్ బిల్లులు వచ్చేలా కేంద్రంతో సంప్రదించాలని సీఎం సూచించారు.



# నాగార్జున సాగర్ కుడికాలువకు గండి

## అధికారులను అప్రమత్తం చేసిన మంత్రులు - యుద్ధ ప్రాతిపదికన గండి పూడ్చివేత చర్యలు

**అమరావతి,నవంబర్21(సమయజ్యోతి):**

నాగార్జున సాగర్ కుడికాలువ గండిపై ఇరిగేషన్ అధికారులను మంత్రి నిమ్మల రామానాయుడు అప్రమత్తం చేశారు. సమీప గ్రామాల్లోకి నీరు వెళ్లకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు చెప్పారు. గండి పడటానికి గల కారణాలను నివేదిక రూపంలో అందించాలని ఇరిగేషన్ అధికారులను మంత్రి నిమ్మల ఆదేశించారు. అధికారులు యుద్ధ ప్రాతిపదికన గండి పూడ్చుతున్నారు. ఆందోళన వద్దని గ్రామస్తులకు సూచిస్తున్నారు. మధ్యాహ్నం కల్లా గండి పూడ్చి వేత పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. అలాగే పల్నాడు జిల్లాలో నాగార్జునసాగర్ కుడికాలువ కట్టకు గండి పడిన ఘటనపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. అధికారులు అప్రమత్తమై నష్టాన్ని గణనీయంగా తగ్గించారని పేర్కొన్నారు. గండిని పూడ్చేయటంతో ఇప్పుడు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. ఇకపై పూర్తి అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. పల్నాడు జిల్లాలో నాగార్జునసాగర్ కుడికాలువ కట్టకు గురువారం అర్ధరాత్రి గండిపడింది. ఎస్కేప్ ఛానల్ వద్ద కట్టకు గండి పడటంతో నాగులేటి వాగుకు ప్రవాహం పెరిగింది. దీంతో వాగు పరీవాహక ప్రాంత ప్రజలు భయాందోళన చెందారు. ఈక్రమంలో అధికారులు అప్రమత్తమై శుక్రవారం ఉదయం గండిని పూడ్చారు.నాగార్జున సాగర్ కుడికాలువ కట్టకు గండి పడింది. కారంపూడి ఎస్కేప్ ఛానల్ వద్ద అర్ధరాత్రి వేళ కట్టకు గండి పడింది. కాలువకు గండి పడటంతో నాగులేటి వాగుకు ప్రవాహం అంతకంతకూ పెరుగుతూ పోతోంది. వీరుల తిరునాళ్లలో ఏర్పాటు చేసిన దుకాణాల్లోకి నీరు చేరింది. వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో సమీప ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలీక బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. సమాచారం అందుకున్న స్థానిక అధికారులు హుటాహుటిన గండిపడ్డ చోటుకు చేరుకున్నారు. గండిని పూడ్చే పనులు చేపట్టారు. ప్రాజెక్టు వద్దే నీటిని నిలుపుదల చేయాల్సి ఉందని స్థానిక అధికారులు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. గుర్తు తెలియని వ్యక్తులు కట్టను ధ్వంసం చేసి ఉండొచ్చని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# భూహక్కుల కమిటీ ముందు రావాల్సిందే

## జగన్ మీడియాకు మాజీ స్పీకర్ యనమల సూచన

**అమరావతి,నవంబర్21(సమయజ్యోతి):**

సభాహక్కుల కమిటీకి జగన్ మీడియా ఎందుకు భయపడుతోందని తెదేపా సీనియర్ నేత యనమల రామకృష్ణుడు ప్రశ్నించారు. తప్పుడు వార్తలు రాసి.. ఇప్పుడు ప్రొసీడింగ్స్‌ను అడ్డుకుంటారా అని ప్రశ్నించారు. సాక్షిలో తప్పుడు వార్తలపై అసెంబ్లీకి వచ్చి వివరణ ఇవ్వొచ్చన్నారు. ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతుల పేరుతో రూ.కోట్ల ప్రజాధనాన్ని వృథా చేశారంటూ శాసనసభ, సభాపతిని చులకన చేసేలా సాక్షిలో కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. ఇకపోతే గురువారం హైదరాబాద్‌లో నాంపల్లి సీబీఐ కోర్టుకు హాజరయ్యే సమయంలో జగన్ బలప్రదర్శన చేసిన తీరును కూడా యనమల తప్పుబట్టారు. కోర్టుకు హాజరు కావాలంటే, నేరస్థుడిగా ఆరోపించబడిన వ్యక్తి ప్రజలకు ఇబ్బంది కలిగించాల్సిన అవసరం లేదు. ఆయన చర్యలు న్యాయస్థానాన్ని బెదిరించేలా ఉన్నాయి. 2029లో జగన్ అధికారం చేపట్టి ప్రజల ఆస్తులను దోచుకుంటాడు అన్నట్లుగా ఆయన అనుచరుల నినాదాలు ఉన్నాయని యనమల అన్నారు.

# వీరవల్లిలో ప్రత్యేక సేవా కార్యక్రమం

## రైతులకు పనిముట్లు అందించిన తానా సభ్యులు

**విజయవాడ,నవంబర్21(సమయజ్యోతి):**

రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. రైతు కోసం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి రైతులకు ఎంతో సాయపడుతోంది. తాజాగా, వీరవల్లిలో ప్రత్యేక సేవా కార్యక్రమాన్ని తానా విజయవంతంగా నిర్వహించింది. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులకు రూ. 20 లక్షల విలువైన పవర్ స్ప్రేయర్లు, పరజాలు, భద్రతా కిట్లు అందజేసింది. ఈ కార్యక్రమానికి కార్మిక శాఖ మంత్రి వాసంసెట్టి సుభాష్, కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ, గన్నవరం ఎమ్మెల్యే వెంకటరావు యర్లగడ్డ, గన్నవరం మార్కెట్ యార్డ్ చైర్మన్ గుడవల్లి నరసయ్య లాంటి ప్రముఖులు హాజరయ్యారు. తానా అధ్యక్షుడు నరేన్ కొడాలి, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ లావు, ట్రెజరర్ రాజా కసుకుర్తి నాయకత్వంలో, పురుగు మందులు తగ్గించడానికి ఉపయోగపడే ఆధునిక పవర్ స్ప్రేయర్లు, కోత అనంతరం పంటలను వర్షం, గాలి వంటి సమస్యల నుండి రక్షించే పరజాలు పంపిణీ చేశారు. గ్రామ రైతులు తానా చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసిస్తూ పేద, మధ్య తరగతి రైతులు, వ్యవసాయ కార్మికుల జీవితాల్లో ఇవి ఎంతో ఉపయోగకరమని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథులుగా పాల్గొన్న నాయకులు.. తానా ట్రెజరర్ రాజా కసుకుర్తితో పాటు ఇతర నాయకుల సేవాస్ఫూర్తిని అభినందించారు. భారతీయ రైతుల సంక్షేమం కోసం ప్రవాస భారతీయ సంస్థ చేస్తున్న ఈ సేవ 'అమూల్యమైనది, మాతృభూమికి గొప్ప సేవ' అని పేర్కొన్నారు. స్థానిక తానా వాలంటీర్, రైతు నాయకుడు శ్రీధర్ కలపాల కార్యక్రమాన్ని సమన్వయం చేస్తూ, పాల్గొన్న అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. రైతులు ప్రపంచాన్ని పోషించే వారు కాబట్టి, ఇలాంటి సేవలు చాలా అవసరమని తెలిపారు. గ్రామంలోని పలువురు రైతులు, రైతు సంఘం నాయకులు అళ్ళ గోపాలకృష్ణ, బుజ్జి గుండపనేని, శ్రీనివాస్ వెములపల్లి ఈ కార్యక్రమంలో పాల్గొని తానాకు కృతజ్ఞతలు తెలిపారు..

# మద్యం కుంభకోణంలో రిమాండ్ పొడిగింపు

**అమరావతి,నవంబర్21(సమయజ్యోతి):**

ఏపీ మద్యం కుంభకోణం కేసులో నిందితుల రిమాండ్ ముగియడంతో అధికారులు వారిని విజయవాడ జిల్లా జైలు నుంచి ఏసీబీ కోర్టుకు తరలించారు. రాజ్ కెసిరెడ్డి, సజ్జల శ్రీధర్ రెడ్డి, అనిల్ చోక్రా, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వెంకటేశ్ నాయుడు, బూనేటి చాణక్యను జిల్లా జైలు నుంచి న్యాయస్థానానికి తీసుకువచ్చారు. గుంటూరు జైలు నుంచి మరో ఇద్దరు నిందితులు నవీన్ కృష్ణ, బాలాజీ కుమార్ యాదవ్‌ను హాజరుపరిచారు. ఈక్రమంలో ఏపీ మద్యం కేసు నిందితులకు న్యాయస్థానం డిసెంబర్ 5 వరకు రిమాండ్ పొడిగించింది. డిఫాల్ట్ బెయిల్ పొందిన నిందితులు మినహా మిగతా వారికి రిమాండ్ పొడిగించింది.

# మావోలు అద్దెకున్న ఇళ్ల పరిశీలన

## కేబుల్ పనికోసం వచ్చినట్లుగా గుర్తింపు

## ఆరా తీసిన స్థానిక పోలీసులు

**ఏలూరు,నవంబర్21(సమయజ్యోతి):**

ఏలూరులో మావోయిస్టుల అరెస్టు నేపథ్యంలో వారు నివసించిన ఇంటి పరిసర ప్రాంతంలోని స్థానికులను పోలీసులు విచారించారు. ఈ సందర్భంగా పలు కీలకాంశాలు వెలుగులోకి వచ్చాయి. వీరంతా కేబుల్ పని చేస్తామంటూ ఇల్లు అద్దెకు దిగారు. నెలకు రూ. 10 వేలు చొప్పున అద్దె చెల్లిస్తామంటూ ఆ ఇంట్లోకి మావోయిస్టులు దిగారు. ఆ ఇంట్లో భారీగా మనుషులు ఉన్నా.. వారిలో ఇద్దరు మాత్రమే బయటకు వచ్చి.. ఆహారం తీసుకువచ్చే వారని స్థానికులు వెల్లడించారు. మిగిలిన వారంతా ఇంట్లోనే ఉండేవారని చెప్పారు. అక్టోబర్ 26వ తేదీన మావోయిస్టులు ఇల్లు అద్దెకు తీసుకున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇంటి యజమానిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మావోయిస్టులు ఇల్లు వెతుక్కుంటూ స్వయంగా వారే వచ్చారా? లేకుంటే ఎవరైనా మధ్యవర్తిత్వం వహించారా? అలా అయితే ఆ మధ్యవర్తిత్వం వహించిన వాళ్లు ఎవరనే కోణంలో పోలీసులు.. ఆ ఇంటి యజమానిని ప్రశ్నిస్తున్నారు. వంబర్ 18వ తేదీ తెల్లవారుజామున అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రంప చోడవరం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా, ఆయన భార్య రాజేతోపాటు పలువురు మావోయిస్టులు మరణించారు. అదే రోజు రాష్ట్రంలో వివిధ జిల్లాల్లోని ప్రధాన నగరాలు విజయవాడ, కాకినాడ, ఏలూరుల్లో మొత్తం 50 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని కోర్టులో హాజరుపరిచారు. వారికి కోర్టు రిమాండ్ విధించింది. ఈ నేపథ్యంలో పోలీసులు వారి నుంచి కీలక సమాచారాన్ని రాబట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

# వీరఘట్టంలో మంత్రి అచ్చన్న పర్యటన

## రైతు సేవా కార్యక్రమాలతో చైతన్యం

**మన్యం,నవంబర్21(సమయజ్యోతి):**

వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం మన్యం జిల్లా వీరఘట్టానికి విచ్చేశారు. అక్కడ సమీక్షా సమావేశానికి హాజరవుతున్న సందర్భంగా వీరఘట్టం పట్టణంలో నిమ్మక జయకృష్ణ, టీడీపి నియోజకవర్గ మాజీ ఇంచార్జి నిమ్మక పాండురంగ, తోటపల్లి ప్రాజెక్ట్ చైర్మన్ పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు, మండల టీడీపి అధ్యక్షులు ఉదయ్ భాస్కర్, పట్టణ పార్టీ అధ్యక్షులు జామి లక్ష్మి నారాయణ, కళింగ వైశ్య డైరెక్టర్ తూముల రమేష్, నీటి సంఘ అధ్యక్షులు చింత ఉమా, గౌరునాయుడు, బల్ల హరి, జంపు శేఖర్, మత్స వెంకటరమణ, లింగాల చంటి, చుక్కా శ్రీను, ఇషాక్ తదితరులు కలిసి మంత్రికి సాదర స్వాగతం పలికారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ..మీకోసం.. రైతన్నా' పేరుతో ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సిఎం చంద్రబాబు ఆదేశాలతో పలు వ్యవసాయ కార్యక్రమాలు చేపట్టబోతున్నట్లు వెల్లడించారు. వ్యవసాయంలో పంచ సూత్రాల విధానాన్ని అమలు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారని తెలిపారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు అనే పంచ సూత్రాలతో వ్యవసాయరంగం అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ప్రతి రైతుకి, అతని కుటుంబ సభ్యులకు దీనిపై అవగాహన కల్పించాలని నిర్ణయించామని చెప్పారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, రైతు సేవ కేంద్రాల సిబ్బందితో సహా 10 వేల మందితో సిఎం చంద్రబాబు గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ' పంచ సూత్రలపై రైతులతో పాటు పశుపోషకులు, పౌల్ట్రీ, గొర్రెల పెంప కందారులు, ఆక్వా, ఉద్యాన, పట్టు పరిశ్రమ రైతులకు అవగాహన కల్పించాలన్నారు. డిసెంబరు 3న రైతు సేవా కేంద్రాల పరిధిలో శిక్షణా కార్య శాలలు నిర్వహించాలని ఆదేశించారు. రైతులకు వ్యవసాయ గిట్టుబాటు అయ్యేలా అధునిక పద్దతులతో పంటలకు మరింత విలువను జోడించేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. రైతు బజార్లలోను ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను మరింత ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమాల ద్వారా రైతులను చైతన్యం చేస్తామని మంత్రి అచ్చన్నాయుడు తెలిపారు.



# పోలి పాడ్యమి సందర్భంగా దీపాలవెలుగు

**విజయవాడ,నవంబర్21(సమయజ్యోతి):**

కార్తిక మాసం ముగింపులో భాగంగా పోలి పాడ్యమి వేడుకలను తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. తెల్లవారుజామునే పుణ్యస్నానాలు ఆచరించి పూజలు నిర్వహించారు. అనంతరం అరటి డొప్పలలో దీపాలను ఉంచి నీటిలో విడిచిపెడుతున్నారు. దీంతో చెరువులు, నదులు దీప కాంతులతో వెలిగిపోతున్నాయి. స్థానిక శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

# మావోయిస్ట్ అగ్రనేతల విడుదలపై విచారణ

## పోలీసుల వద్ద ఉన్నారనే ఆధారాలు లేవు

## హెబియస్ కార్పస్ పిటిషన్‌పై హైకోర్టు స్పష్టీకరణ

**అమరావతి,నవంబర్21(సమయజ్యోతి):**

మావోయిస్టు అగ్రనేతల ఆచూకీ కోసం ఏపీ హైకోర్టులో దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై శుక్రవారం మరోసారి విచారణ జరిగింది. మావోయిస్ట్ పార్టీ కీలక నేతలు దేవ్ జీ, రాజిరెడ్డి... పోలీసుల వద్ద ఉన్నారనేందుకు ప్రాథమిక ఆధారాలు లేవని.. వ్యాజ్యంలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు ధర్మాసనం తేల్చిచెప్పింది. పోలీసుల వద్ద ఆ ఇద్దరు అగ్రనేతలు ఉన్నారనే దానిపై ఆధారాలు లభిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు పిటిషనర్లకు వెసులుబాటు కల్పించింది. ఆపై మావోయిస్ట్ నేతల బంధువులు వేసిన పిటిషన్‌పై విచారణను ధర్మాసనం మూసివేసింది. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు దేవ్ జీ, మల్లా రాజిరెడ్డిని కోర్టులో హాజరుపరచాలని పోలీసులను ఆదేశించాలని కోరుతూ రాజారెడ్డి కుమార్తె స్నేహలత, దేవ్ జీ సోదరుడు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. దీనిపై గురువారం హైకోర్టులో విచారణ జరిగిన విషయం తెలిసిందే. మావోయిస్టు కీలక నేతలు తమ ఆధీనంలో ఉన్నారని పోలీసులు ప్రెస్‌స్టేట్‌మెంట్ ఇచ్చారని పిటిషనర్ తరపు న్యాయవాది తెలుపగా.. ఆధారాలు సమర్పించాలని కోర్టు ఆదేశించింది. దీంతో నేటి విచారణలో పోలీసుల ప్రెస్ స్టేట్‌మెంట్‌కు సంబంధించిన వీడియోను పిటిషనర్ల తరుపు న్యాయవాది కోర్టుకు సమర్పించారు. వీడియోను చూసిన ధర్మాసనం.. సెక్యూరిటీ సిబ్బంది తమ అదుపులో ఉన్నారని పోలీసులు చెప్పినట్లు గుర్తించింది. దేవ్ జీ గురించి మీడియా ప్రతినిధులు అడగ్గా.. తమ ఆధీనంలో లేరని పోలీసు ఉన్నతాధికారులు చెప్పినట్లు వీడియోలో ఉందని న్యాయస్థానం గుర్తించింది. దీంతో దేవ్ జీ, రాజిరెడ్డిలు పోలీసుల నిర్బంధంలో ఉన్నట్లు ప్రాథమిక ఆధారాలు లేవని ధర్మాసనం నిర్ధారించింది. ఈ వ్యాజ్యంలో తాము జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టం చేస్తూ.. పిటిషన్‌ను క్లోజ్ చేసింది.

# విశాఖ భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ

## సమగ్ర భూ సర్వే అంశాలపై అధికారులతో సమీక్ష

## శాసనసభపక్ష ఫిర్యాదుల కమిటీ చైర్మన్ రఘురామ కృష్ణరాజు

**విశాఖపట్నం,నవంబర్21(సమయజ్యోతి):**

విశాఖపట్నంలో భూ సంబంధిత సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, రాష్ట్ర శాసనసభపక్ష ఫిర్యాదుల కమిటీ చైర్మన్ రఘురామ కృష్ణరాజు సూచించారు. శుక్రవారం విశాఖపట్నం కలెక్టరేట్‌లో సమగ్ర భూ సర్వే అంశాలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు రఘురామ కీలక సూచనలు చేశారు. ఈ సమావేశానికి సభ్యులు కొణతాల రామకృష్ణ, పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు, శాసన సభ డిప్యూటీ సెక్రటరీ రాజ్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ విభాగ కమిషనర్ ఆర్. కూర్మనాథ్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, విశాఖ, భీమిలి ఆర్డీవోలు సుధాసాగర్, సంగీత్ మాధుర్, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రఘురామ కృష్ణంరాజు మాట్లాడారు. విశాఖపట్నంలో భూముల రీసర్వేలో ప్రజల నుంచి వస్తున్న ఇబ్బందులపై చర్చించినట్లు తెలిపారు. రీసర్వేలో తమ కమిటీకి స్థానికుల నుంచి పలు ఫిర్యాదులు వచ్చాయని.. వీటిని పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రీసర్వేలో తమ కమిటీ కొన్ని సూచనలు చేసిందని తెలిపారు. భూ సమస్యలను రీసర్వే ద్వారా పరిష్కరించడానికి ఒక సంవత్సరం గడువు పెంచమని ప్రభుత్వానికి సూచించామని అన్నారు. ప్రజలు గందరగోళానికి గురికాకుండా పారదర్శకమైన రీతిలో రీ-సర్వే జరగాలని రఘురామ రాజు ఆదేశించారు. భూముల రీసర్వేను 6,688 గ్రామాల్లో పూర్తి చేశామని ఏపీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డుల విభాగం డైరెక్టర్ ఆర్. కూర్మనాథ్ తెలిపారు. రీసర్వేలో 7 లక్షల ఫిర్యాదులు వచ్చాయని.. 3 లక్షల కేసులు పరిష్కరించలేనివిగా ఉన్నాయని వివరించారు. ఇప్పటికే ప్రజల నుంచి వచ్చిన రెండు లక్షల ఫిర్యాదులను పరిష్కరించామని చెప్పుకొచ్చారు. 7200 గ్రామాల్లో రీసర్వే చేయాల్సి ఉందని కూర్మనాథ్ పేర్కొన్నారు.

# గౌహతి మైదానం నాకు చాలా ఇష్టం

## నా వన్డే అరంగేట్రం ఇక్కడే జరిగింది - భారత కెప్టెన్ రిషభ్ పంత్ వ్యాఖ్య



భారత్, సౌతాఫ్రికా మధ్య జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో రెండవ మ్యాచ్ రేపటి నుంచి గౌహతిలో ప్రారంభం కానుంది. మొదటి టెస్ట్ కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరిగింది. ఆ మ్యాచ్‌లో సౌతాఫ్రికా 30 పరుగుల తేడాతో గెలిచింది. ఈడెన్ గార్డెన్స్ పిచ్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో గౌహతి పిచ్ కూడా స్పిన్నర్లకు అనుకూలంగా ఉంటుందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయంపై భారత కెప్టెన్ రిషభ్ పంత్ ఒక పెద్ద స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఈసారి పిచ్ మెరుగ్గా ఉంటుందని తాను ఆశిస్తున్నానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రెండవ టెస్ట్ మ్యాచ్ ప్రారంభానికి ముందు జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో రిషభ్ పంత్ మాట్లాడారు. “ఈ మైదానం (గౌహతి) నాకు చాలా ఇష్టం అని ముందుగా చెప్పాలనుకుంటున్నాను. నా వన్డే అరంగేట్రం ఇక్కడే జరిగింది. అంతేకాదు టెస్ట్ టీమ్‌కు కెప్టెన్‌గా నా అరంగేట్రం కూడా ఈ మైదానంలోనే మొదలవుతోంది. అందుకే ఈ స్థలం నాకు, అలాగే గౌహతి మొత్తానికి చాలా ప్రత్యేకం. ఎందుకంటే ఇక్కడ తొలిసారి టెస్ట్ మ్యాచ్ జరుగుతోంది” అని పంత్ భావోద్వేగంగా చెప్పారు. పిచ్ గురించి మాట్లాడుతూ.. పంత్ సానుకూలత వ్యక్తం చేశారు. “పిచ్ విషయానికి వస్తే ఈసారి పిచ్ మెరుగ్గా ఉంటుందని నేను అనుకుంటున్నాను. ముఖ్యంగా బ్యాటింగ్‌కు ఇది బాగా అనుకూలించే అవకాశం ఉంది. కొన్ని రోజుల తర్వాత పిచ్ టర్న్ అయ్యే అవకాశం ఉంది. కానీ నా ఉద్దేశంలో ఇది ఒక మంచి టెస్ట్ మ్యాచ్‌గా ఉంటుంది” అని పంత్ నమ్మకంగా చెప్పారు. అంటే మొదటి రోజు నుంచే పిచ్ స్పిన్నర్లకు పట్టు ఇవ్వకుండా.. బ్యాట్స్‌మెన్‌లకు కూడా అవకాశం ఇస్తుందని పంత్ టీమ్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించినందుకు పంత్ ఈ సందర్భంగా బీసీసీఐకి మరోసారి ధన్యవాదాలు తెలిపారు. “కొన్నిసార్లు మనం పెద్ద మ్యాచ్ గురించి ఎక్కువగా ఆలోచిస్తే దాని వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. అందుకే నేను ఎక్కువగా ఆలోచించదలుచుకోలేదు. మొదటి టెస్ట్ మాకు బాగా ఆడలేదు. అందుకే రెండవ టెస్ట్‌లో గెలవడానికి అవసరమైనదంతా చేస్తాం” అని పంత్ పేర్కొన్నారు. కోల్‌కతా ఓటమిని మర్చిపోయి.. ఈ టెస్ట్‌లో ఎలాగైనా గెలిచి సిరీస్‌ను సమం చేయాలని టీమిండియా పట్టుదలగా ఉంది.

# కెప్టెన్ గా రిషబ్ పంత్

## రెండో టెస్ట్ నుంచి శుభమన్ గిల్ అవుట్

శుభ్‌మన్ గిల్ అధికారికంగా భారత్ దక్షిణాఫ్రికా రెండో టెస్ట్ నుంచి వైదొలిగాడు. కోల్‌కతాలో జరిగిన మొదటి టెస్ట్ రెండో రోజున మెడ నొప్పి కారణంగా మైదానాన్ని వీడాడు. అతని నొప్పి చాలా ఎక్కువగా ఉండటంతో ఆసుపత్రికి తీసుకెళ్లాల్సి వచ్చింది. అతను రెండో ఇన్నింగ్స్‌లో కూడా బ్యాటింగ్ చేయలేకపోయాడు. గువాహటిలో జట్టుతో చేరిన గిల్ ఆడటంపై ముందే సందేహం ఉంది, కానీ ఇప్పుడు ఒక ప్రకటన విడుదల చేసి దీన్ని ధృవీకరించింది. అతని స్థానంలో రిషబ్ పంత్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. తన ప్రకటనలో,”దక్షిణాఫ్రికాతో జరిగిన మొదటి టెస్ట్‌లో మెడ నొప్పికి గురైన టీమ్ ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్, గువాహటిలో జరిగే రెండో టెస్ట్ నుంచి వైదొలిగాడు. గిల్ కోల్‌కతా టెస్ట్ రెండో రోజున మెడ నొప్పికి గురయ్యాడు. ఆట ముగిసిన తర్వాత పరీక్షల కోసం ఆసుపత్రికి తీసుకెళ్లారు. అతన్ని పరిశీలనలో ఉంచారు. మరుసటి రోజు డిశ్చార్జ్ చేశారు. అతను నవంబర్ 19, 2025న గువాహటికి వెళ్ళాడు. దురదృష్టవశాత్తు, అతను రెండో టెస్ట్‌లో ఆడటానికి పూర్తిగా ఫిట్‌గా లేడు. తన గాయం గురించి మరింత పరీక్షల కోసం ముంబైకి వెళ్తాడు. గిల్ లేకపోవడంతో రిషబ్ పంత్ రెండో టెస్ట్‌లో జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు.” టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదికల ప్రకారం.. శుభ్‌మన్ గిల్ ప్రస్తుతం ముంబైలో రెండు నుంచి మూడు రోజులు విశ్రాంతి తీసుకుని, ఆ తర్వాత ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ దినషా పర్దివాలా నుంచి మెడ నొప్పికి సంబంధించి ప్రత్యేక సలహా తీసుకోనున్నాడు. కోల్‌కతాలో జరిగిన తొలి టెస్ట్ మ్యాచ్‌లోనే గిల్‌కు గాయమైంది. మ్యాచ్ రెండవ రోజున బ్యాటింగ్‌కు వచ్చిన వెంటనే, కొన్ని బంతులు ఎదుర్కొన్న తర్వాత మెడలో తీవ్రమైన అసౌకర్యాన్ని అనుభవించాడు. ఫిజియో వచ్చి పరీక్షించిన తర్వాత, అతను రిటైర్డ్ హర్ట్‌గా మైదానం వీడాల్సి వచ్చింది. గాయం తీవ్రత దృష్ట్యా, అతన్ని వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఆ మ్యాచ్‌లో అతను మళ్లీ ఆడలేదు. జట్టుతో కలిసి గువహాటి వచ్చినా, చివరకు రెండో టెస్ట్‌కు దూరమయ్యాడు. శుభ్‌మన్ గిల్ దూరమవడంతో అతని స్థానంలో వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ జట్టు కెప్టెన్సీని చేపట్టనున్నారు. అయితే ప్లేయింగ్ ఎలెవన్‌ను ఎంపిక చేయడంలో గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని జట్టు మేనేజ్‌మెంట్‌కు కొన్ని ముఖ్యమైన సవాళ్లు ఎదురవుతున్నాయి. శుభ్‌మన్ గిల్ నాలుగో స్థానంలో సాయి సుదర్శన్ లేదా నితీష్ కుమార్ రెడ్డిలలో ఒకరికి అవకాశం దక్కవచ్చు. అదనపు స్పిన్నర్ అక్షర్ పటేల్‌ను బెంచ్‌కే పరిమితం చేసే అవకాశం ఉంది. మ్యాచ్‌కు ముందు జరిగిన నెట్ ప్రాక్టీస్‌లో కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్, సాయి సుదర్శన్ మాత్రమే పాల్గొన్నారు. గిల్ తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకుని టెస్ట్‌లో ఆడాలనుకున్నప్పటికీ, జట్టు యాజమాన్యం అతని భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎటువంటి రిస్క్ తీసుకోవడానికి సిద్ధంగా లేదు. దక్షిణాఫ్రికాతో భారత జట్టు నవంబర్ 29 నుంచి వన్డే సిరీస్ కూడా ఆడాల్సి ఉంది. అయితే గిల్ ప్రస్తుతం మెడ నొప్పితో బాధపడుతున్నందున, ఆ వన్డే సిరీస్‌లో అతను పాల్గొంటాడా లేదా అనే విషయంపై ఇంకా అధికారికంగా ఎటువంటి స్పష్టత లేదు.



# మెహరూబ్ హసన్ మెరుపు ఇన్నింగ్స్



రైజింగ్ స్టార్స్ ఆసియా కప్ 2025లో తొలి సెమీ-ఫైనల్ మ్యాచ్?లో బంగ్లాదేశ్ %ూ% జట్టు బ్యాటింగ్ చూసి క్రికెట్ అభిమానులు ఆశ్చర్యపోయారు. 18 ఓవర్లు ముగిసేసరికి బంగ్లాదేశ్ స్కోరు 160 మార్కును కూడా దాటదేమో అనిపించింది. కానీ చివరి రెండు ఓవర్లలో బంగ్లా బ్యాట్స్‌మెన్ చూపించిన మెరుపు దాడితో ఆ లెక్కలన్నీ తారుమారు అయ్యాయి. కేవలం చివరి 12 బంతుల్లోనే 50 పరుగులు రాబట్టడంతో బంగ్లాదేశ్ %ూ% జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 194 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఈ అనూహ్య విధ్వంసానికి కారణం మెహరూబ్ హసన్ మెరుపు ఇన్నింగ్స్.సాధారణంగా టీ20 క్రికెట్‌లో 19వ ఓవర్ అత్యంత కీలకం. ఈ ఓవర్‌ను వేసిన భారత బౌలర్ నమన్ ధీర్ బంగ్లా బ్యాట్స్‌మెన్ మెహరూబ్ హసన్ చేతిలో దారుణంగా దెబ్బతిన్నాడు. ఈ ఓవర్‌ను మెహరూబ్ సిక్సర్‌తో ప్రారంభించాడు. ఆ తర్వాత మూడవ, నాల్గవ బంతుల్లో వరుసగా మరో రెండు సిక్సర్లు కొట్టాడు. ఐదో బంతిని ఫోర్ కొట్టిన మెహరూబ్, ఆఖరి బంతిని కూడా మళ్లీ సిక్సర్‌గా మలిచాడు. ఈ ఓవర్‌లో మొత్తం 28 పరుగులు వచ్చాయి. 19వ ఓవర్‌లో 28 పరుగులు వచ్చిన తర్వాత, చివరి ఓవర్‌లో కూడా బంగ్లాదేశ్ బ్యాట్స్‌మెన్ ఏమాత్రం తగ్గలేదు. చివరి ఓవర్ బౌలింగ్ చేసిన వైశాఖ్ విజయ్ కుమార్ కూడా భారీగా పరుగులు సమర్పించుకున్నాడు. ఈ ఓవర్‌లో మొత్తం 22 పరుగులు వచ్చాయి. యాసిర్ అలీ రెండు ఫోర్లు, ఒక సిక్సర్ కొట్టగా, చివరి బంతికి మెహరూబ్ హసన్ మళ్లీ సిక్సర్ కొట్టాడు. దీంతో 18 ఓవర్లలో 144 పరుగుల వద్ద ఉన్న బంగ్లాదేశ్ %ూ% స్కోరు, చివరి రెండు ఓవర్లలో 50 పరుగులు రావడంతో 194 పరుగులకు చేరుకుంది. ఈ భారీ స్కోరు సాధించడంలో ఇద్దరు బంగ్లాదేశ్ బ్యాట్స్‌మెన్లు ముఖ్యపాత్ర పోషించారు. ఓపెనర్ హబీబుర్ రెహమాన్ సోహన్ 46 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్ల సాయంతో అత్యధికంగా 65 పరుగులు చేసి ఇన్నింగ్స్‌కు స్థిరత్వం అందించాడు. చివరిలో బ్యాటింగ్‌కు వచ్చిన మెహరూబ్ హసన్ కేవలం 18 బంతుల్లోనే 6 సిక్సర్ల సాయంతో అజేయంగా 48 పరుగులు చేసి భారత బౌలర్లను చిత్తుచేశాడు. బంగ్లాదేశ్ బ్యాట్స్‌మెన్ల ధాటికి భారత బౌలర్లు చాలా ఖరీదైన ప్రదర్శన ఇచ్చారు. నమన్ ధీర్ 2 ఓవర్లలో 33 పరుగులు (ఎకానమీ 16.50), వైశాఖ్ విజయ్ కుమార్ 4 ఓవర్లలో 51 పరుగులు, రమన్‌దీప్ సింగ్ 2 ఓవర్లలో 29 పరుగులు సమర్పించుకున్నారు. గుర్జప్నీత్ సింగ్ 2 వికెట్లు తీసినప్పటికీ, అతను కూడా 9.75 ఎకానమీతో 4 ఓవర్లలో 39 పరుగులు ఇచ్చాడు.

# ఆఖరికి వైడ్ బాల్‌తో గెలిచి ఫైనల్‌కు వెళ్లిన బంగ్లాదేశ్



రైజింగ్ స్టార్స్ ఆసియా కప్ 2025లో తొలి సెమీ-ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠకు పరాకాష్టగా నిలిచింది. ఈ మ్యాచ్‌ను ఒక సాధారణ క్రికెట్ మ్యాచ్ అని కాకుండా ట్విస్టులు, ఉత్కంఠ, చివరికి ఊహించని ఫలితం ఇచ్చిన డ్రామా సినిమా అని చెప్పవచ్చు. మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 194 పరుగులు చేయగా, దానికి సమాధానంగా టీమిండియా %ూ% కూడా సరిగ్గా 194 పరుగులే చేసి మ్యాచ్‌ను టై చేసింది. అయితే, సూపర్ ఓవర్ లో మాత్రం భారత్‌కు దారుణ అనుభవం ఎదురైంది. ఆఖరికి ఒకే ఒక్క వైడ్ బాల్ కారణంగా బంగ్లాదేశ్ అద్భుత విజయం సాధించి ఫైనల్‌లోకి అడుగుపెట్టింది. ఈ ఓటమితో టోర్నమెంట్‌లో భారత్ ప్రయాణం ముగిసింది. 195 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన భారత్ %ూ% జట్టుకు ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ, ప్రియాన్ష్ ఆర్య మంచి ఆరంభాన్ని ఇచ్చారు. వైభవ్ సూర్యవంశీ (15 బంతుల్లో 38 రన్స్), ప్రియాన్ష్ ఆర్య (23 బంతుల్లో 44 రన్స్) మెరుపు ఇన్నింగ్స్‌లతో దూసుకుపోయారు. ఆ తర్వాత కెప్టెన్ జితేష్ శర్మ కూడా 23 బంతుల్లో 33 పరుగులు చేసి పోరాడాడు. చివరి 6 బంతుల్లో భారత్‌కు గెలవడానికి 16 పరుగులు అవసరం కాగా, అశుతోష్ మూడవ బంతికి సిక్సర్, నాలుగో బంతికి ఫోర్ కొట్టి ఉత్కంఠను పెంచాడు. ఆఖరి బంతికి హర్ష్ దూబే 3 పరుగులు తీయడంలో విజయం సాధించడంతో స్కోరు 194 పరుగుల వద్ద నిలిచి మ్యాచ్ టై అయింది. మ్యాచ్ టై అవ్వడంతో విజేతను నిర్ణయించడానికి సూపర్ ఓవర్ అనివార్యమైంది. అయితే ఈ చిన్న పోరాటంలో భారత జట్టు దారుణంగా విఫలమైంది.



**- పూర్తిగా ఆధిపత్యం కనిపించిన బౌలర్లు**

**172 పరుగులకే ఇంగ్లాండ్ ఆలౌట్**

**ఇంగ్లాండ్? నడ్డివిరిచిన మిచెల్ స్టార్క్**

**- 7 వికెట్లతో ఆదరహో అనిపించుకున్న స్టార్క్**

**ఇంగ్లాండ్? బౌలర్లు దీటుగా సమాధానం**

**- ఆసీస్ మొదటి ఇన్నింగ్స్?లో 123-9**

**బెన్ స్టోక్స్ ధాటికి కుదేలైన ఆసీస్ బ్యాటర్లు**

**- స్టోక్స్ కేవలం 6 ఓవర్లలోనే 5 వికెట్లు**

**రసవత్తరంగా సాగుతున్న యాషెస్ సిరీస్**

యాషెస్ సిరీస్ 2025లో పెర్త్ వేదికగా జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్ మొదటి రోజు అసాధారణ రీతిలో చరిత్ర సృష్టించింది. ఈ రోజు మొత్తం బౌలర్ల ఆధిపత్యమే నడిచింది. ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ 7 వికెట్లతో విజృంభించగా.. ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ కేవలం 6 ఓవర్లలోనే 5 వికెట్లు పడగొట్టడంతో టెస్ట్ క్రికెట్‌లో అరుదైన రికార్డు నమోదైంది. మొదటి రోజు ఆటలో ఏకంగా 19 వికెట్లు నేలకూలాయి. యాషెస్ సిరీస్ చరిత్రలో గత 100 ఏళ్లలో టెస్టు మ్యాచ్ తొలి రోజున 19 వికెట్లు పడటం ఇదే మొదటిసారి. అంతకుముందు 1909లో ఓల్డ్ ట్రాఫర్డ్ మైదానంలో తొలి రోజు 18 వికెట్లు నేలకూలాయి. పెర్త్‌లో ఒక టెస్ట్ మొదటి రోజు అత్యధిక వికెట్లు పడటం కూడా ఇదే తొలిసారి. గతంలో 2024లో భారత్-ఆస్ట్రేలియా మ్యాచ్‌లో 17 వికెట్లు పడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ జట్టు మిచెల్ స్టార్క్ (7 వికెట్లు) విధ్వంసకర బౌలింగ్ వల్ల 172 పరుగులకే ఆలౌట్ అయింది. హ్యారీ బ్రూక్ (52), ఓలీ పోప్ (46) మాత్రమే కొంత పోరాటాన్ని చూపగా.. మిగతా బ్యాటర్లు స్టార్క్ ధాటికి తలవంచారు. ఇంగ్లండ్‌ను స్వల్ప స్కోరుకే పరిమితం చేసిన తర్వాత, బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా పరిస్థితి మరింత దయనీయంగా మారింది. రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా కేవలం 123 పరుగులకే 9 వికెట్లు కోల్పోయి బ్యాక్‌ఫుట్‌లో పడింది. ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ తన బౌలింగ్‌తో మెరిశాడు. బెన్ స్టోక్స్ కేవలం 6 ఓవర్ల స్పెల్‌లో 23 పరుగులు మాత్రమే ఇచ్చి ఏకంగా 5 కీలక వికెట్లు పడగొట్టాడు. ఆసీస్ బ్యాటర్లు స్టీవ్ స్మిత్ (17), ట్రావిస్ హెడ్ (21), కామెరూన్ గ్రీన్ (24)తో పాటు మరో ఇద్దరు కీలక బ్యాటర్లను స్టోక్స్ పెవిలియన్ చేర్చాడు. జోఫ్రా ఆర్చర్ కూడా జోస్యం చేసి జేక్ వెదెరాల్డ్‌ను (0) తొలి బంతికే ఔట్ చేయగా, లబుషేన్ (9), ఖవాజా (2) తక్కువ స్కోరుకే ఔటయ్యారు. రోజు ఆట ముగిసే సమయానికి నాథన్ లయన్ (3), బ్రెండన్ డాగెట్ (0) క్రీజులో ఉన్నారు. కెప్టెన్ స్టోక్స్ స్పెల్ కారణంగా ఆస్ట్రేలియా తమ తొలి ఇన్నింగ్స్‌లో కూడా ఆధిక్యాన్ని సాధించడంలో విఫలమైంది.


# వైభవ్ సూర్యవంశీ చితక్కొట్టాడు



ఖతార్ రాజధాని దోహాలో జరుగుతున్న ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2025 సెమీ ఫైనల్ మ్యాచ్‌లో మరోసారి భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ చితక్కొట్టాడు. శుక్రవారం (నవంబర్ 21) ఇండియా-ఏ, బంగ్లాదేశ్-ఏ జట్ల మధ్య జరిగిన ఈ మ్యాచ్‌లో వైభవ్ అద్భుతమైన బ్యాటింగ్‌తో బంగ్లాదేశ్ బౌలర్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీశాడు. వైభవ్ ఇన్నింగ్స్ మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఈ సెమీఫైనల్ మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ మరోసారి మెరుపు వేగంతో బ్యాటింగ్ చేశాడు. ఈ మ్యాచ్‌లో అతను అర్ధ సెంచరీ చేయలేకపోయినా తన దూకుడుతో భారత ఇన్నింగ్స్‌కు బలమైన ఆరంభం ఇచ్చాడు. వైభవ్ సూర్యవంశీ కేవలం 15 బంతుల్లో 38 పరుగులు చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో వైభవ్ సూర్యవంశీ 4 సిక్సర్లు, 2 ఫోర్లు బాదాడు. వైభవ్ 253.33 అనే అత్యంత ప్రమాదకరమైన స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేయడం విశేషం. బంగ్లాదేశ్ బౌలర్ అబ్దుల్ గఫార్ సక్లైన్ నాలుగో ఓవర్ నాలుగో బంతికి వైభవ్‌ను ఔట్ చేయడంతో అతని విధ్వంసం ముగిసింది.

# ప్రభాస్ అభిమానులకు ఇక పండగే

## 23న రాజాసాబ్ నుంచి పాట విడుదల




యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ అభిమానులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ది రాజా సాబ్' సినిమాకు సంబంధించిన కీలక అప్‌డేట్ విడుదలైంది. హారర్ చిత్రాల దర్శకుడు మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ మాస్ ఎంటర్‌టైనర్ 'ది రాజా సాబ్' నుంచి మొట్టమొదటి పాట విడుదల తేదీని చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ మూవీ ఫస్ట్ సింగిల్ రెబల్ సాబ్ ను నవంబర్ 23న విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. ఈ సినిమాకు థమన్ సంగీతం అందిస్తుండగా.. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నాడు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, జరీనా వాహేబ్, రిద్ధి కుమార్ కథానాయికలుగా నటిస్తుండగా బోమన్ ఇరానీ, సంజయ్ దత్ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు.

# భన్సాలీ ప్రొడక్షన్ నుంచి మరో లవ్ స్టోరీ

బాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థలు జీ స్టూడియోస్, భన్సాలీ ప్రొడక్షన్స్ కలిసి ఒక భారీ ప్రాజెక్ట్‌ను నిర్మించబోతున్నాయి. ఈ ప్రాజెక్ట్‌కి 'దో దీవానే షెహర్ మే' అనే టైటిల్‌ను ఖరారు చేయగా.. ఇందులో బాలీవుడ్ నటుడు సిద్దాంత్ చతుర్వేది, మృణాల్ ఠాకూర్ జంటగా నటించబోతున్నారు. లవ్ స్టోరీగా రాబోతున్న ఈ చిత్రంకి రవి ఉద్యవార్ దర్శకత్వం వహిస్తుండగా.. సంజయ్ లీలా భన్సాలీ, ప్రేరణ సింగ్, ఉమేష్ కుమార్ బన్సాల్, భరత్ కుమార్‌లు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది ఫిబ్రవరి 26న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి అనౌన్స్‌మెంట్ వీడియోను పంచుకుంది చిత్రయూనిట్. ఈ టీజర్ చూస్తుంటే మెట్రో లవ్‌స్టోరీగా ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది.



# అనుష్కలా అన్ని పాత్రలు చేయగలగాలి

## అరుంధతి పాత్ర చాలా ఇష్టం అన్న భాగ్యశ్రీ

అరుంధతీ'లో అనుష్క చేసిన తరహా పాత్రలంటే ఇష్టం అని నటి భాగ్యశ్రీ భోర్సే అన్నారు. రామ్ పోతినేని హీరోగా నటించిన 'ఆంధ్రా కింగ్ తాలుకా' చిత్రంలో ఆమె కథానాయికగా నటించారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలోమహేష్ బాబు.పి దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 27న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే విలేకర్లతో మాట్లాడారు. నాకోసం ఎలాంటి కథలు రాసి పెట్టి ఉన్నాయో నాకు తెలియదు. వచ్చిన ప్రతి క్యారెక్టర్‌కి వందశాతం న్యాయం చేసేలా పని చేస్తా. వెర్సటైల్ యాక్ట్రెస్‌గా పేరు తెచ్చుకోవాలని కోరిక. ' అలాంటి పాత్రలు నాకూ వస్తాయని ఆశిస్తున్నా' అని భాగ్యశ్రీ భోర్సే అన్నారు. సినిమాలో మహాలక్ష్మి క్యారెక్టర్‌లో కనిపిస్తాను. కాలేజ్ గోయింగ్ గర్ల్. సాగర్‌తో ప్రేమలో ఉంటుంది. అంతకుమించి ఇప్పుడు ఎక్కువ క్యారెక్టర్ గురించి రివీల్ చేయకూడదు. కథకు ఈ పాత్ర చాలా ఇంపార్టెంట్.. అదేంటి అనేది తెరపైనే చూడాలి. నా పాత్రను ఆడియన్స్ తప్పకుండా గుర్తుపెట్టుకుంటారు. ఇందులో ప్రేమ కథ చాలా స్వచ్ఛంగా ఉంటుంది. లవ్ స్టోరీ, డైలాగ్స్ చాలా బ్యూటిఫుల్‌గా ఉంటాయి. రామ్‌తో పనిచేయడం అమేజింగ్ ఎక్స్‌పీరియన్స్. అతని ఎనర్జీకి మ్యాచ్ చేశానని అనుకుంటున్నాను. సినిమా ఓ ఇంపార్టెంట్ సీన్‌ను దర్శకుడు వివరించారు. ఆ సన్నివేశాన్ని నేను ఎలా అనుకుంటున్నానో చేసి చూపిస్తానని దర్శకుడిని రిక్వెస్ట్ చేశా. నేను చేసింది అందరికీ నచ్చింది. అంత క్రియేటివ్ స్పేస్ ఇవ్వడం ఆనందం కలిగించింది. నిర్మాత సంస్థ కూడా అంతే స్పేస్ ఇచ్చింది. కాంప్రమైజ్ కాకుండా సినిమా తీశారు. ఈ సినిమాలో తులసీ, రావు రమేశ్, మురళి శర్మ వంటి అద్భుతమైన ఆర్టిస్టలతో పని చేశా. వారి నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నా. ఉపేంద్రగారితో నాకు ఒక్క సీనే ఉంది. ఆయన వెరీ హంబుల్, డౌట్ టు ఎర్త్ యాక్టర్. ఆయనతో వర్క్ చేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది.అభిమానం అనేది డివైన్ ఎమోషన్. నేను నార్త్ నుంచి సౌత్ కొచ్చినప్పుడు ఇక్కడ ప్రేక్షకులు చూపించిన అభిమానానికి ఒక స్టార్‌ని ఇంతగా అభిమానిస్తారా అన్నది ప్రత్యక్షంగా చూశా. చాలా గొప్ప ఎమోషన్ అది. ఎలాంటి రిలేషన్ లేకుండా పరిచయం లేకుండా ఒక వ్యక్తిని అంతలా ఎలా అభిమానిస్తారని ఆశ్చర్యపోయా. మహేశ్ ఈ కథ చెప్పిన తర్వాత అభిమానం అన్నదానికి ఆన్సర్ దొరికింది. రెండు సినిమాలకే మంచి పేరు, ఫ్యాన్ ఫాలోయింగ్ పెరిగింది అంటుంటే చాలా ఆనందంగా ఉంది. ఆర్టిస్ట్‌కు మాత్రమే ఆ అదృష్టం ఉంటుంది. అందరూ తమ అమ్మాయిగా అభిమానాన్ని చూపించారు. ఆ అభిమానం మరింత పొందాలని కోరుకుంటున్నట్లు భాగ్యశ్రీ వెల్లడించింది.

# కొత్త తరానికి కొత్త కథ..

# ప్రేమంటే..

ప్రమోషన్ మొదలైన నాటినుంచి 'ప్రేమంటే' సినిమాపై ఆడియన్స్‌లో ఓ పాజిటీవ్ వైబ్ క్రియేటైంది. దానికి తోడు లియోన్ జేమ్స్ పాటలు కూడా జనబాహుళ్యంగా బాగా వినిపిస్తున్నాయి. ఖర్చును వెనుకాడని నిర్మాతలు పుస్కూర్ రామ్మోహన్‌రావు, జాన్వీ నారంగ్ ఈ చిత్రానికి నిర్మించడం.. యువతరానికి ఆకట్టుకునే ప్రియదర్శి, ఆనంది ఇందులో జంటగా నటించడం సినిమాపై ఆడియన్స్‌లో ఆసక్తి పెరగడానికి కారణాలని చెప్పొచ్చు. ఎట్టకేలకు శు క్రవారం 'ప్రేమంటే' విడుదలైంది. అభిప్రాయాలు కలవక పెళ్లికి దూరంగా ఉంటున్న అమ్మాయి రమ్య(ఆనంది). సమస్యల కారణంగా పెళ్లి వద్దనుకుంటున్న అబ్బాయి మదన్మోహన్ అలియాస్ మది(ప్రియదర్శి). వీరిద్దరూ అనుకోకుండా ఓ పెళ్లిలో కలుస్తారు. వారి కలయిక ప్రేమగా, ఆ తర్వాత పెళ్లిగా పరిఢమిల్లుతుంది. తొలి నెల వారి వైవాహిక జీవితం సంతోషంగా సాగిపోతుంది. కానీ తర్వాత నుంచి కష్టాలు మొదలవుతాయి. బాధ్యతలు రమ్యను ఆఫీస్‌కు నడిపిస్తాయి. సమస్యలు మదిని వ్యాపారం వైపుకు తరలిస్తాయి. అసలు సమస్య ఇక్కడే వచ్చిపడుతుంది. సీసీ కెమెరాలు, లాక్స్ సంబంధించిన బిజినెస్ మదిది. దీనికి సంబంధించిన వర్కంతా నైటే ఎక్కువ ఉంటుంది. దాంతో రమ్య ఆఫీస్ నుంచి ఇంటికి రావడం.. అదే టైమ్‌కి మది తన ఆఫీస్ వెళ్లిపోవడం.. ఈ కారణంగా వారి వైవాహిక జీవితం అసంతృప్తిగా తయారవుతుంది. ఇదిలావుంటే.. ఇంట్లో ఉన్న కొద్ది సమయంలో మది కదలికలు రమ్యకు అనుమానం కలిగిస్తాయి. తాను ఎవరితోనే రిలేషన్‌లో ఉన్నాడనే సందేహం రమ్యకు మొదలవుతుంది. అందుకు తగ్గట్టు సాక్ష్యాలు కూడా కనిపిస్తుంటాయి. దాంతో మదిని నిలదీస్తుంది రమ్య. ఇద్దరి మధ్య జరిగే గొడవలో అనుకోకుండా తన బిజినెస్‌కి సంబంధించిన రహస్యాన్ని బయటపెడతాడు మది. దాంతో రమ్య షాక్. అసలు మది చేస్తున్న బిజినెస్ ఏంటి? రమ్య ఎందుకు షాకయ్యింది? ఆ తర్వాత వీరిద్దరి వైవాహిక జీవితం ఎలాంటి మలుపు తీసుకుంది? అసలు చివరికి ఏం జరిగింది? అనేది అసలు కథ.ఈ సినిమా ఓ విధంగా హీరోయిన్ కథ. ఈ కథకు ప్రధానమైన సోల్ హీరోయిన్ పాత్రే. చెడ్డవాడైన భర్తతో కలిసి చెడ్డపనులు చేసే భార్యల కథలు విన్నాం. సకలగుణసంపన్నుడైన భర్త అడుగుజాడల్లో నడుస్తూ.. సుగుణవతిగా ఇంటిని చక్కబెట్టే భార్యల కథల్ని కూడా చూశాం. ఇందులో హీరోయిన్ కూడా ఓ విధంగా అలాంటి భార్యే. కాకపోతే ఇదోరకం. సాధారణంగా సమస్యల కారణంగా భర్త దొంగగా మారితే.. ఏ భార్యలైనా అతన్ని మార్చుకోడానికి ప్రయత్నిస్తారు. కానీ భార్య అలా కాదు. భర్త దొంగని తెలిసి.. భర్త సమస్యలను అర్థం చేసుకొని.. భర్తకు సాయంగా తాను కూడా దొంగలా మారుతుంది. ఓ విధంగా ఈ పాయింట్ నిజంగా కొత్తదే అనాలి. ఇందులో హీరోయిన్ వీక్నెస్ భర్తను అమితంగా ప్రేమించడమే. భర్త బలహీనతను కూడా ఇష్టపడటమే. నిజానికి అతడు చెడ్డవాడేం కాదు. తాను దొంగతనాలు కూడా యతికల్‌గా చేస్తాడు. అందుకే.. తాను కూడా భర్తతో కలిసి దొంగగా మారుతుంది. ఈ పాత్రలో ఆనంది నిజంగా అదరగొట్టిందనే చెప్పాలి. ఇందులో ఆనంది పోషించిన రమ్య పాత్ర జనాలకు పడితే.. సినిమా హిట్. పట్టకపోతే సినిమా ఫట్. ఈ విషయం దర్శకుడు నవనీత్ శ్రీరామ్ కొంతమేర సక్సెస్ అయ్యాడని చెప్పొచ్చు. ఓ వైపు గమ్మత్తైన ఈ కథను వినోదంగా ప్రజెంట్ చేస్తూనే.. మరోవైపు ఆ జంట మధ్య ఉండే పరస్పర ప్రేమానురాగాలను తెరపై చక్కగా ప్రజెంట్ చేశాడు దరశకుడు నవనీత్ శ్రీరామ్. ఆనంది, ప్రియదర్శి మధ్య వచ్చే సన్నివేశాలన్నీ సినిమా బావున్నాయి. సుమ, వెన్నెల కిశోర్ తమ పాత్రలను ఎప్పటిలాగే రక్తికట్టించారు. మిగతా నటీనటులంతా పరిధిమేర ఆకట్టుకున్నారు.సాంకేతికంగా దర్శకుడు రాసుకున్న కథ కొత్త ఉంది. కథనం కూడా ఆకట్టుకునేలా ఉంది.

# నాస్తిక వాదనలు అర్థం లేనివి

## రాజమౌళికి అండగా నిలబడ్డ ఆర్జీవి

దిగ్గజ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి ఇటీవల తాను దేవుడిపై పెద్దగా నమ్మకం లేదని చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. గ్లోబ్ ట్రాటర్ సినిమా ఈవెంట్‌లో ఆయన చేసిన ఈ కామెంట్స్‌పై పలు హిందూ సంఘాలు, బీజేపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ వివాదంపై తాజాగా దర్శకుడు రామ్ గోపాల్ వర్మ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. రాజమౌళికి మద్దతుగా నిలడడమే కాకుండా విమర్శకులకు గట్టి కౌంటర్ ఇచ్చాడు. రాజమౌళిపై విషం కక్కుతున్న సోకాల్డ్ ధర్మ రక్షకులు తెలుసుకోవాల్సింది ఏంటంటే? భారతదేశంలో నాస్తికుడిగా ఉండటం నేరం కాదు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 దేవుడిని విశ్వసించకపోవడాన్ని కూడా రక్షిస్తుంది. అందుకే, మీరు దేవుడిని నమ్ముతున్నామని చెప్పే హక్కు మీకు ఎంత ఉందో, రాజమౌళికి కూడా తనకు దేవుడిపై నమ్మకం లేదని చెప్పే హక్కు అంతే ఉంది. అయితే రాజమౌళి దేవుడిని నమ్మకపోతే తన సినిమాల్లో దేవుడిని ఎందుకు చూపిస్తున్నాడు? అనేది మూర్ఖపు వాదన. ఆ లెక్కన, గ్యాంగ్‌స్టర్ సినిమా తీయాలంటే దర్శకుడు గ్యాంగ్‌స్టర్‌గా మారాలా? హారర్ సినిమా కోసం దెయ్యంగా మారాలా? అని ఆర్జీవీ విమర్శకులను ప్రశ్నించారు. నిజం చెప్పాలంటే? రాజమౌళి దేవుడిని నమ్మకపోయినా చాలా మంది దేవుడిని నమ్మేవారు కూడా తమ జీవితాల్లో చూడనంత విజయం, సంపద నాస్తికుడైన రాజమౌళికి ఇచ్చాడు. దీనిని బట్టి చూస్తే దేవుడు నాస్తికులనే ఎక్కువగా ప్రేమిస్తున్నాడేమో, లేదా దేవుడు అసలు జనాలను పట్టించుకోడేమో? లేదంటే ఎవరు నమ్ముతున్నారని లెక్కలు రాసుకునే నోట్‌ప్యాడ్ పట్టుకొని దేవుడు కూర్చోలేదేమో? అని ఆర్జీవీ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. రాజమౌళితో దేవుడికే సమస్య లేనప్పుడు, ఈ స్వయం ప్రకటిత ధర్మ రక్షకులైనవారు ఎందుకు బీపీ, అల్సర్ తెచ్చుకుంటున్నారు? నిజమైన సమస్య ఆయన నాస్తికత్వం కాదు. దేవుడిని నమ్మకుండానే ఆయన విజయం సాధించడమే అసలు సమస్య. ఎందుకంటే దేవుడిని పిచ్చిగా ప్రార్థించినా విజయం సాధించలేని వారిని ఇది భయపెడుతోంది అని ఆర్జీవీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. విశ్వాసులు దేవుడిని రక్షించడం మానేయాలి. అది దేవుడిని అవమానించినట్లే. రాజమౌళి నాస్తికుడైనంత మాత్రాన దేవుడి శక్తి తగ్గదు. నమ్మకం ఆగిపోయిన వెంటనే విశ్వాసం కూలిపోతుందని భావించే వారి ఇన్ సెక్యూరిటీ మాత్రమే పెరుగుతుంది అని ఆర్జీవీ అన్నారు. చివరిగా.. దేవుడు బాగానే ఉన్నాడు. రాజమౌళి బాగానే ఉన్నాడు. వీరిద్దరినీ అర్థం చేసుకోలేని వారు మాత్రమే బాధపడుతున్నారు. రాజమౌళి తదుపరి చిత్రం 'వారణాసి' ద్వారా దేవుడు ఆయన బ్యాంకు బ్యాలెన్స్‌ను మరింత పెంచుతాడు. దేవుడి నమ్మకం పేరుతో అసూయ పడుతున్న వాళ్లు ఏడుస్తూ కూర్చోవడమే. జై హనుమాన్ అంటూ ఆర్జీవీ తన వ్యాఖ్యలను ముగించారు.

# వారణాసిలో.. రక్తం తాగే సీన్

ఛిన్నమస్తాదేవి రూపంగా ఊహాగానాలు దర్శక ధీరుడు రాజమౌళి ఒక సినిమా తెరకెక్కిస్తున్నాడంటే..వడుదలయ్యే వరకు కథపై చర్చిస్తూనే ఉంటారు. తాజాగా ఇప్పుడు వారణాసిపై ఎవరికి వారు తమ ఊహలను జోడించి కథలు అల్లుతున్నారు. జక్కన్న మహేష్ బాబుతో కలిసి వారణాసి సినిమాను తెరకెక్కిస్తున్నాడు. ఈ మధ్యనే ఈ సినిమా టైటిల్ గ్లింప్స్ ను రిలీజ్ చేశారు. అందరిలా వీడియోని రిలీజ్ చేయకుండా సినిమా కథను తెలిపే ప్లేసెస్, షాట్స్ ను చూపించి వారణాసి టైటిల్ ను రిలీజ్ చేశారు.అందులో ఒక్క షాట్ ఇండస్ట్రీ మొత్తాన్ని షేక్ చేసింది. అదే ఒక దేవత షాట్.. ఆ దేవత చాలా భయంకరంగా కనిపిస్తుంది. నగ్నంగా ఉన్న ఆ దేవత ఒక చేతిలో కత్తి.. ఇంకో చేతిలో తన తలను పట్టుకొని.. సంభోగంలో ఉన్న స్త్రీపురుషల మీద కాళ్లు పెట్టి.. తన మెడ నుంచి మూడు రక్తధారల్లో.. రెండు కింద ఉన్న ఇద్దరు ఆడవారు చెరో వైపు తాగుతుండగా.. మూడో రక్తధార.. డైరెక్ట్ గా చేతిలో ఉన్న తల నోట్లోకి వెళ్తున్నట్లు కనిపించింది. దేవతలందరిలో చాలా పవర్ ఫుల్ దేవతగా కొలవబడే ఛిన్నమస్తా దేవినే ఆ షాట్ లో కనిపించే దేవత. ఛిన్నా అంటే ఖండించినా అని అర్థం.. మస్తా అంటే తల.. తన తలను తానే ఖండించుకోవడంతో ఆమెకు ఛిన్నమస్తా దేవి అనే పేరు వచ్చింది. ఇక అలా ఖండించడం వెనుక ఉన్న కథను చాలామంది చాలారకాలుగా చెప్పుకొస్తారు. అందులో ఒకటి.. మందాకినీ నదిలో పార్వతి దేవి స్నానం ఆచరిస్తుండగా ఆ నీటిలో ఉన్న మాయనో ఏమో తెలియదు కానీ దేవికి కామ కోరిక రగులుతూ ఉంటుంది. సమయం కానీ సమయంలో ఇలాంటి కోరిక రావడంతో పార్వతి దేవి కోపోద్రికురాలు అవుతుంది. ఇంకోపక్క తనతో పాటు స్నానం ఆచరిస్తున్న చెలికత్తెలు అయిన డాకిని, వర్ణినిలకు తీవ్ర ఆకలి వేస్తుంటుంది. వారు దేవిని తమకు చాలా ఆకలి వేస్తుందని అడుగుతారు.ఇక అన్నపూర్ణాదేవి అయిన పార్వతి దేవి.. ఆకలి అన్నవారి ఆకలి తీర్చడానికి తనను తానే ఆహారంగా మార్చుకుంది. శరీరంలో రగులుతున్న కామాన్ని ఆపడానికి.. రతీ మన్మథుల శరీరాల మీద నిలబడి.. తన తలను తానే ఖండించుకొని.. డాకిని, వర్ణినిలకు రక్తాన్ని ఇచ్చి ఆకలి తీరుస్తోంది. మరో రక్తధార నేలమీద పడితే.. తన రక్తంతో సృష్టి నాశనం అవుతుందని.. తన నోటికే ఆ రక్తధారను అందిస్తుంది. పార్వతి దేవిని అలా చూస్తే ఎవరికైనా గగుర్పాటు పుడుతుంది అని చెప్పొచ్చు. పార్వతి దేవి ఈ రూపాన్ని రౌద్ర రూపంగా పూజిస్తారు. ఇక వారణాసికి ఛిన్నమస్తా దేవికి సంబంధం ఏంటి అంటే.. రణ కుంభ( పృథ్వీరాజ్ సుకుమారన్) ఈ సినిమాలో ఒక తంత్ర విద్యను అభ్యసిస్తాడు. అందులో భాగంగానే ఈ దేవతకు పూజ చేస్తాడు. ఇక ఆ శక్తితో మందాకినీ(ప్రియాంక చోప్రా)ను అంతమొందించే ప్రయత్నంలో రుద్ర( మహేష్ బాబు) ఆమెను కాపాడడానికి వస్తాడు..అని నెటిజన్స్ చెప్పుకుంటున్నారు. మరి ఇందులో నిజం ఎంత అనేది తెలియాలంటే సినిమా విడుదలయ్యేవరకు ఆగాల్సిందే.




EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685